www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14 | ANDHRAJYOTHI | వెల (Price) : Rs. 6.50

శుక్రవారం | 16-8-2024

సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 122

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 9.40 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మూల మ. 12.44 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 11.08-12.44, రా. 9.58-11.30; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23, మ. 12.44-1.34; అమృతఘడియలు: ఉ. 6.22-7.57; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లౌకిక పౌరస్మృతి

రాజ్యాంగకర్తల నుంచి సుప్రీంకోర్టు వరకు 78 ఏళ్లుగా కోరుతున్నదిదే

ఇప్పటి మతపర సివిల్ కోడ్‌ను మార్చాలి

'ఒక దేశం-ఒకే ఎన్నికలు' నేటి అవసరం 2

మహిళలపై అఘాయిత్యాలు బాధిస్తున్నాయి

స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతా

పేదలకు కడుపునిండా అన్నం పెడితే అదే సంతృప్తి

సెప్టెంబరు ఆఖరుకు రాష్ట్రంలో 203 అన్నక్యాంటీన్లు: సీఎం

గుడివాడలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించి భోజనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు 3

అన్న క్యాంటీన్లకు విరాళాల వెల్లువ.. ఒక్క రోజే రూ.2 కోట్లు

ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేసిన మున్సిపల్ శాఖ



విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న సీఎం చంద్రబాబు

ఏపీకి ఐదేళ్ల తర్వాత


మళ్లీ స్వాతంత్ర్యం

విధ్వంసక పాలన నుంచి విముక్తి: సీఎం

ఇక అభివృద్ధితో దూసుకుపోతాం.. అక్టోబరు 2న విజన్-2047.. నదుల అనుసంధానం చేసి తీరుతాం

కక్ష సాధింపులు ఉండవు.. తప్పుచేసిన వారిని వదలం.. స్వాతంత్ర్య దినోత్సవంలో సీఎం చంద్రబాబు

11



తుంగభద్ర డ్యాం వద్ద స్టాప్‌లాగ్ ఏర్పాటు పనులు

సాహసమే!

వరద ఉండగానే స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

తుంగభద్ర జలాలను కాపాడటమే లక్ష్యంగా ప్రయత్నం

జిందాల్ నుంచి ప్రాజెక్టుకు చేరుకున్న మొదటి బ్లాక్

వెడల్పు రెండు అంగుళాలు ఎక్కువవడంతో సమస్య

అటూ ఇటూ అంగుళం చొప్పున తగ్గిస్తున్న కార్మికులు

నేడు గైడ్ యాంగిల్‌లోకి స్టాప్‌లాగ్ ఎలిమెంట్ 12

భూ.. కంపం!

6 జిల్లాల్లో రికార్డుల పరిశీలనకు శ్రీకారం

సీమలోని 5 జిల్లాలతోపాటు ప్రకాశంలోనూ..

వాటి పరిధిలోని 6 డివిజన్‌లు, 18 మండలాల్లో

అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ల తనిఖీ 2



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో..
ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఫిలింనగర్ లోని 'ఏబీఎన్-ఆంధ్ర జ్యోతి' ప్రధాన కార్యాలయంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్లు వేమూరి ఆదిత్య, కోగంటి భానుప్రకాష్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబరులో గగన్‌యాన్

» శ్రీహరికోట నుంచే ప్రయోగం: ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట, ఆగస్టు 15: గగన్‌యాన్ ప్రయోగం నవంబరు నెలాఖరులో ఉంటుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. ఇప్పటికే గగన్‌యాన్‌కు సంబంధించి తుదిదశ పరీక్షలు విజయవంతంగా నిర్వహించామన్నారు. నవంబరులో గగన్‌యాన్ ప్రయోగం శ్రీహరికోట నుంచే ఉంటుందని చెప్పారు. కాగా, శుక్రవారం షార్ నుంచి ప్రయోగించే ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగానికి సర్వం సిద్ధం చేశామన్నారు. ఎస్ఎస్ఎల్వీ ప్రాజెక్టులో ఇది మూడో ప్రయోగమని తెలిపారు. సెప్టెంబరులో పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రోబ్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నట్లు తెలిపారు. నావిక్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఈ ఏడాది చివరిలోపు ఉంటుందన్నారు.



షార్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎస్.సోమనాథ్

నేడు నింగిలోకి ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్

రోదసిలోకి భూ పరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-08

సూళ్లూరుపేట, ఆగస్టు 15: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో వినూత్న ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగం చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా మన దేశానికి చెందిన ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ బుధవారం రాత్రే షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గురువారం షార్‌లోని ఎంఆర్ఆర్ కురుప్ ఆడిటోరియంలో మిషన్ రెడినెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రయోగం, కౌంట్‌డౌన్ తదితరాలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్) సమావేశమై చర్చించిన అనంతరం ప్రయోగానికి సంసిద్ధత తెలిపింది. కౌంటౌడౌన్‌ను ప్రయోగానికి 6.30 గంటల ముందు ప్రారంభించేలా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకెళ్లనుంది.



శ్రీహరికోటలోని షార్‌లో ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్

17 నిమిషాల్లో ప్రయోగం పూర్తి..

119 టన్నుల బరువు, 34 మీటర్ల ఎత్తు, 2 మీటర్ల వెడల్పు కలిగిన ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్‌ను భూమి నుంచి నింగిలోకి ఎగిరిన అనంతరం 17 నిమిషాల్లో ప్రయోగం పూర్తయ్యేలా డిజైన్ చేశారు. భూమి నుంచి 475 కి.మీ ఎత్తులోకి వెళ్లిన తరువాత రాకెట్ నుంచి ఉపగ్రహం విడిపోయి కక్ష్యలోకి చేరనుంది. మూడు దశల్లో రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. 175.5 కిలోల బరువు గల ఈవోఎస్08 ఉపగ్రహంలో మూడు పేలోడ్స్‌ను కూడా పంపుతున్నారు. భూ పరిశీలన ఉపగ్రహం విపత్తు పర్యవేక్షణ, పర్యావరణ పర్యవేక్షణ, రక్షణ రంగానికి కూడా ఉపయోగపడనుంది. ఏడాది కాలం దీని సేవలు అందేలా రూపకల్పన చేశారు. ఈ ఉపగ్రహం అగ్ని వంటి అనువర్తనాల కోసం పగలు, రాత్రి తేడా లేకుండా మిడ్ వేవ్, లాంగ్‌వేవ్ బ్యాండ్‌లతో ఛాయాచిత్రాలను తీసి ఎప్పటికప్పుడు పంపనుంది. ప్రయోగం విజయవంతం కావాలంటూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ గురువారం రాత్రి సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

వైద్య విద్యార్థులకు అధిక శ్రమ వద్దు

వారంలో 74 గంటల కంటే ఎక్కువ పని వద్దు.. వారాంతపు సెలవులు ఇవ్వాల్సిందే

» ఎన్ఎంసీ టాస్క్‌ఫోర్స్ నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 15: వైద్య విద్యార్థులతో ఎక్కువ గంటలు ఆస్పత్రుల్లో పనిచేయించడం వారి భౌతిక, మానసిక ఆరోగ్యం పాలిట ముప్పు అని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) టాస్క్‌ఫోర్స్ స్పష్టం చేసింది. వారికి వారంలో 74 గంటల కంటే ఎక్కువ పని అప్పగించకూడదని సూచించింది. వైద్య విద్యార్థులకు రోజులో 7 నుంచి 8 గంటల మేర కనీస నిద్ర అవసరమని పేర్కొంది. కంటినిండా నిద్ర లేకుంటే.. వారు భౌతిక, మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని హెచ్చరించింది. వైద్య విద్యార్థులు సెలవులు అడిగితే.. భేషరతుగా ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌షిప్‌లో ఉన్నవారు విద్యను అభ్యసించే క్రమంలో ఆస్పత్రుల్లో పనిచేస్తారని, వైద్యుల కొరతను తీర్చడానికి కాదని ఆ నివేదికలో తేల్చిచెప్పింది. వైద్య విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై ఏర్పాటైన ఎన్ఎంసీ టాస్క్‌ఫోర్స్ నివేదికలోని కీలకాంశాలు..

- రోగుల సంఖ్య పెరిగినప్పుడు విద్యార్థులపై ఒత్తిడి పెంచడం, వారితో అదనపు గంటలు పనిచేయించడం కాకుండా.. సీనియర్ రెసిడెంట్లు, వైద్యాధికారులను నియమించుకోవాలి. అందుకు తగ్గట్లుగా విభాగాధిపతులు, ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్లు, రెసిడెంట్లు ప్రణాళికలను రూపొందించుకోవాలి
- పీజీ విద్యార్థులకు రెండు వారాలు, ఎంబీబీఎస్ విద్యార్థులకు నాలుగు వారాల చొప్పున ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహించాలి
- మానసిక ఆరోగ్యం కోసం యోగాలో శిక్షణనివ్వాలి
- విద్యార్థులకు ఉచితవైద్య చికిత్సలను అందజేయాలి
- ర్యాగింగ్ నిర్మూలన విషయంలో ఎన్ఎంసీ నిబంధనలను కఠినంగా పాటించాలి
- బ్యాక్‌లాగ్‌ల ఒత్తిడి లేకుండా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించాలి. విద్యార్థుల ఫలితాలను రోల్ నంబర్ల ద్వారా ప్రకటించాలి
- స్పెషలిస్టుల డిమాండ్ ఉన్న విభాగాల్లో పీజీ సీట్లను పెంచాలి
- 24 గంటలూ విద్యార్థులకోసం సపోర్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి
- ప్రతి 500 మంది విద్యార్థులకు కనీసం ఇద్దరు కౌన్సెలర్లను నియమించాలి
- వైద్య విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదులకు ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

లోకం తీరు



లౌకిక పౌరస్మృతి

రాజ్యాంగ కర్తల నుంచి సుప్రీంకోర్టు వరకు 78ఏళ్లుగా కోరుతున్నదిదే

» ఇప్పటి మతపర సివిల్ కోడ్‌ను మార్చాలి

» 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' నేటి అవసరం

» 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 15 : దేశానికి లౌకిక పౌరస్మృతి అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఇప్పుడున్న సివిల్ కోడ్ మతపరమైనదీ, వివక్షాపూరితమైందని ఆక్షేపించారు. దీనిపై విస్తృతస్థాయిలో చర్చ జరగాలని మోదీ అభిప్రాయపడ్డారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం దేశ రాజధానిలోని ఎర్రకోట బురుజుపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రధాని ప్రసంగించారు. కాషాయం, ఆకుపచ్చ, పసుపు కలగలిసిన రాజస్థానీ (లెహెరియా) తలపాగా, తెల్ల కుర్తా, చుడీదార్‌తో మోదీ కనిపించారు. తన ప్రసంగంలో ఆయన వికసిత భారత్ భావనను మరింత ప్రస్ఫుటంగా ఆవిష్కరించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ, దేశంలో మహిళలపై పెరిగిన అఘాయిత్యాల నుంచి ఒక దేశం- ఒకే ఎన్నికలు, సెబీ చైర్మన్- అదానీ వివాదంలో విపక్షాల తీరు, ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడం వరకు అనేక అంశాలను తన ప్రసంగంలో ఆయన ప్రస్తావించారు. ప్రధానిగా ఎర్రకోట బురుజు నుంచి ఆయన ప్రసంగించడం ఇది 11వ సారి. 98 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగించి.. రికార్డు సృష్టించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో 2016లో అత్యధిక సమయం ప్రసంగించిన తన రికార్డును (94 నిమిషాలు) తానే బద్దలుకొట్టడం విశేషం. దాదాపు ఆరువేల మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఈసారి ఒలింపిక్ పతక విజేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి కేటాయించిన సీట్ల వరుసలో, వారితోపాటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూర్చున్నారు. ఆ తర్వాతి వరుసలను కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు కేటాయించారు.

మహిళల రక్షణకు ప్రభుత్వాలు కదలాలి

ప్రధానమంత్రి తన ప్రసంగంలో సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన సివిల్ కోడ్ అంశాన్ని ప్రస్తావించారు. "మన సమాజంలోని ఒక పెద్ద సమూహం ఇప్పటి సివిల్ కోడ్ మతపరంగా ఉన్నదని నమ్ముతోంది. అది నిజం కూడా. ఈ కోడ్ వివక్షాపూరితమైంది. అది మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసి, అసమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇప్పుడు మనమంతా సెక్యులర్ సివిల్ కోడ్‌కు మారాలి. ఇది ఇప్పటి అవసరం. రాజ్యాంగ స్ఫూర్తి కూడా ఇదే. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు నొక్కిచెప్పింది. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాతల స్వప్నాన్ని సాకారం చేసి తీరాలి" అని ప్రధాని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీల రక్షణ విషయంలో 140 కోట్ల మంది భారతీయులు కలత చెందుతున్నారని అన్నారు. పొరుగుదేశంలో పరిస్థితులు త్వరలోనే కుదురుకుంటాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటనను ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. "ప్రతిరంగంలో మహిళలు దూసుకుపోతున్నారు. కానీ, వారిపై జరుగుతున్న దాడుల ఘటనలు బాధిస్తున్నాయి. మహిళలకు భరోసా ఇచ్చే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. వేగంగా దర్యాప్తు జరిపించడం వల్ల ప్రజల్లో నమ్మకం కలిగించగలుగుతాం" అని ఆయన అభిప్రాయపడ్డారు.

యువతే రాజకీయాలను మార్చాలి

2047 నాటికి 'వికసిత్ భారత్‌ను ఆవిష్కరిస్తామని, ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి తీరుతామని మోదీ పునరుద్ఘాటించారు. రాజకీయాల నుంచి కులతత్వం, బంధుప్రీతిని పారదోలాలని, యువతే రాజకీయాలను మార్చాలని అన్నారు. దీనికోసం రాజకీయ కుటుంబాలకు చెందని కనీసం లక్ష మంది యువత ప్రజాజీవితంలోకి రావడానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. వైద్యవిద్య కోసం రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చుపెట్టి విదేశాలకు విద్యార్థులు ఏటా వెళుతుండటాన్ని మోదీ ప్రస్తావిస్తూ... ఎక్కడికో వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితిని తప్పించడానికి వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లను అందుబాటులోకి తేనున్నామని ఆయన తెలిపారు.

నెహ్రూ నుంచి మోదీ దాకా..

భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో ఎర్రకోట బురుజు నుంచి తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని 14 నిమిషాల్లో ముగించారు. ఆయన కుమార్తె, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1966లో అంతే సమయం ప్రసంగించారు. గత ప్రధానుల్లో వీరిద్దరివే పొట్టి ప్రసంగాలు.. ఇక వాజ్‌పేయి 2002లో 25 నిమిషాలు, 2003లో 30 నిమిషాల్లో ప్రసంగం ముగించేయగా, ఆ మరుసటి ఏడాదే ప్రధాని అయి పదేళ్లు ఆ పదవిలో ఉన్న మన్మోహన్ సింగ్ 2012, 2013లో వరుసగా 32, 35 నిమిషాలు ప్రసంగించారు. ఆ తర్వాత ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ ఇప్పటికి 11సార్లు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇవ్వగా, అవన్నీ పెద్ద ప్రసంగాలే. అందులో 2017లో ఆయన అతి తక్కువగా 56 నిమిషాలు ప్రసంగించారు. ఇక ఐకే గుజ్రాల్ 1997లో 71 నిమిషాలు ప్రసంగించారు.

భారత్‌పై జరిగే కుట్రల్లో భాగం కావద్దు

బీజేపీ మేనిఫెస్టోలో యూనిఫామ్ సివిల్ కోడ్‌తో పాటు 'ఒక దేశం- ఒకే ఎన్నికలు' అనేదీ ముఖ్యమైనదే. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాల పరిశీలనకు గత ఏడాది లా కమిషన్ ఏర్పడింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఈ కమిటీ రాజకీయ పార్టీలను సంప్రదించి తయారుచేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనను ఎక్కువ పార్టీలు వ్యతిరేకించడాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. అభివృద్ధిని చూసి ఓర్వలేని వారిని, దేశ సంక్షేమం పట్టనివారని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వారిని అనుమతిస్తే ప్రతిదాన్నీ ధ్వంసం చేసేస్తారని వ్యాఖ్యానించారు. సెబీ చైర్‌పర్సన్-అదానీ వ్యవహారంపై హిండెన్‌బర్గ్ నివేదికను పరోక్షంగా మోదీ ప్రస్తావిస్తూ.. భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రల్లో విదేశీ శక్తులు భాగస్వాములు కావొద్దని హితవు పలికారు.

కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడి!

నిరసనకారుల ముసుగులో చొచ్చుకెళ్లిన 40మంది దుండగులు.. ఆస్పత్రి ఆస్తుల ధ్వంసం

» ఎమర్జెన్సీ విభాగం, నర్సింగ్ సెక్షన్ మెడిసిన్ స్టోర్‌లో విధ్వంసకాండ

» పోలీసు వాహనం.. పలు బైక్‌ల ధ్వంసం

» బాష్పవాయువు, లాఠీచార్జితో పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు



ఆస్పత్రిలో దుండగుల చేతిలో ధ్వంసమైన వైద్య పరికరాలు

కోల్‌కతా, ఆగస్టు 15: జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన కోల్‌కతా ఆర్జీ కర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో బుధవారం అర్ధరాత్రి భయానక వాతావరణం నెలకొంది. గుర్తుతెలియని దుండగులు ఆస్పత్రిలో పెను విధ్వంసం సృష్టించారు. ఆందోళనకారుల ముసుగులో ఆ పరిసరాల్లోకి వచ్చిన గూండాలు ఆస్పత్రిలోకి చొచ్చుకెళ్లారు. దవాఖానా ఆస్తులు, విలువైన వైద్యపరికరాలను ధ్వంసం చేశారు. హత్యాచార ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లపైనా దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి 11:55 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ 'స్వాతంత్ర్యం సిద్ధించిన ఆ అర్ధరాత్రిని తిరిగి పొందుదాం' (రీక్లెయిమ్ ది నైట్) అనే పేరుతో పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ముఖ్య ప్రాంతాల్లో బుధవారం రాత్రి ప్రదర్శనలు జరిగాయి. ఈ క్రమంలో కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రి వద్దకు నిరసనకారుల ముసుగులో 40మంది దాకా గుర్తుతెలియని దుండగులు చేరుకున్నారు. వచ్చీరావడంతోనే పోలీసులపై రాళ్లు రువ్వుతూ ఆస్పత్రిలోకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. ఎమర్జెన్సీ విభాగం, నర్సింగ్ సెక్షన్, మెడిసిన్ స్టోర్‌లో విధ్వంసం సృష్టించారు. సీసీ కెమెరాలనూ పగులగొట్టారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనకు నిరసనగా ఆగస్టు 9 నుంచి అక్కడి వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేదిక వద్దకొచ్చి భయానక వాతావరణాన్ని సృష్టించారు. గూండాల దాడిలో కొందరు వైద్యసిబ్బంది, పోలీసులకు గాయాలయ్యాయి. ఆస్పత్రి ప్రాంగణంలోని పోలీసు వాహనం, కొన్ని ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి.. లాఠీచార్జి చేసి ఆ మూకను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గూండాల దాడిలో ఆస్పత్రి ఆస్తులకు తీవ్ర నష్టం జరిగిందని పోలీసులు చెప్పారు. ప్రణయ్ దాస్ అనే ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు మాత్రం దుండగులు 500 నుంచి 1000 మంది దాకా ఉన్నారని చెప్పడం విశేషం. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటిదాకా తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటన తాలూకు ఆధారాలను చెరిపివేసేందుకే ఓ వర్గం ఈ దాడికి పాల్పడినట్లుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు కీలక ప్రకటన చేశారు. 'వైద్య కళాశాలలోని సెమినార్ రూంలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. ఘటనాస్థలి చెక్కుచెదరకుండా ఉంది. అక్కడికెవ్వరూ రాలేదు' అని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు.. ఆస్పత్రిపై దుండగుల దాడిపై అక్కడి నర్సులు గురువారం ఉదయం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆర్జీ కార్ ఆస్పత్రిపై దుండగల విధ్వంసాన్ని బెంగాల్ గవర్నర్ సీజీ ఆనంద బోస్ తీవ్రంగా ఖండించారు. ఆస్పత్రిపై దాడి ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గురువారం ఆయన ఆర్జీ కర్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిపై గూండాల దాడిని భారత వైద్య మండలి (ఐఎంఏ) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై ఆ రాష్ట్ర విభాగాలతో అత్యవసర సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఇక.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దుండగుల దాడికి బాధ్యత వహిస్తూ బెంగాల్ సీఎం మమత రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. అయితే.. ఆస్పత్రిపై దుండగుల దాడి వెనుక రాజకీయ పార్టీలు ఉన్నాయని.. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం ద్వారా ఇబ్బందులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

ఉత్తరాఖండ్‌లో నర్సుపై హత్యాచారం

» 9 రోజుల తర్వాత దొరికిన మృతదేహం

» రాజస్థాన్‌లో నిందితుడి అరెస్టు

» ఆమె చున్నీతోనే ప్రాణాలు తీశాడు

డెహ్రాడూన్, ఆగస్టు 15: ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పనిచేసే నర్సుపై అత్యాచారం చేసి, అనంతరం హత్య చేసిన సంఘటన ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో చోటు చేసుకుంది. సంఘటన జరిగిన తొమ్మిది రోజుల అనంతరం ఆమె మృత దేహం లభించింది. దర్యాప్తు జరిపిన పోలీసులు బుధవారం ఇందుకు బాధ్యుడైన నిందితుడ్ని రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆ నర్సు ఇంద్రాచౌక్‌లోని ఆస్పత్రిలో పనిచేస్తుండగా, సరిహద్దులో ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో 11 ఏళ్ల కుమార్తెతో కలిసి ఉంటోంది. జులై 30న విధులు ముగించుకొని ఈ-రిక్షాలో బిలాస్‌పూర్ బయలుదేరింది. దినసరి కూలీ అయిన ధర్మేంద్ర ఆమెను అనుసరించాడు. ఆమె తాను నివాసం ఉండే అపార్టుమెంటుకు చేరుకుంటుండగా దాడి చేశాడు. సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆమె చున్నీతోనే పీక నులిమి హత్య చేశాడు. అనంతరం అక్కడి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని దిబ్‌డిబా గ్రామంలోని ఖాళీ స్థలంలో పడేసి వెళ్లిపోయాడు. ఆమె పర్సులోని రూ.3000ను కూడా దొంగిలించాడు. ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడు. ఇంటికి రాకపోవడంతో ఆమె సోదరి మరుసటి రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొమ్మిది రోజుల అనంతరం ఈ నెల 8న పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. బాధితురాలి ఫోన్ ఆధారంగా నిందితుడ్ని గుర్తించారు. అతడు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లా వాసి అని తేలింది. పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడ్ని రాజస్థాన్‌లో పట్టుకొని అరెస్టు చేశారు.

భూ.. కంపం మొదలు!

6 జిల్లాల్లో రికార్డుల పరిశీలనకు శ్రీకారం.. సీమలోని ఐదు జిల్లాలతోపాటు ప్రకాశం.. పరిధిలో 6 డివిజన్‌లు, 18 మండలాలు

అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూముల.. రికార్డులు, రిజిస్ట్రేషన్ల తనిఖీ.. భూచోడుగా మారిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే

బినామీల పేరిట వందల ఎకరాలు.. ఈ డివిజన్‌లో భారీ దందాలు.. 18 వేల ఎకరాల అసైన్డ్ భూమి ఫ్రీహోల్డ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో చట్టాలను చట్టుబండలు చేసి భూములను దోచుకున్న దారుణాలపై విచారణ మొదలైంది. మదనపల్లిలో రెవెన్యూ ఆఫీసును తగలబెట్టిన ఉదంతం జగన్ పాలనలోని అక్రమాలు అత్యంత దుర్మార్గంగా జరిగాయని తేల్చేసింది. ఆ ఘటన జరగడానికి ముందే జగన్ హయాం నాటి భూదందాలపై దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం, ఆ తర్వాత నుంచి వేగం పెంచింది. ఇప్పుడిక భూ రికార్డుల పరిశీలన, రిజిస్ట్రేషన్‌ల తనిఖీకి శ్రీకారం చుట్టింది. రాయలసీమ నుంచే ఈ కార్యక్రమం మొదలుపెట్టింది. రాయలసీమలోని ఐదు జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లా పరిధిలోని ఆరు రెవెన్యూ డివిజన్‌లు, 18 మండలాల పరిధిలో భూ పత్రాల పరిశీలన ప్రార ంభమైంది. ఎంపిక చేసిన స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఆరు రకాల ప్రొఫార్మాలను రూపొందించి డేటా నమోదు చేయిస్తున్నారు. నిజానికి రెండువారాల్లోగానే రికార్డుల పున:పరిశీలన చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. అయితే, ప్రాథమిక విచారణలోనే వైసీపీ నేతల భూముల పుట్టలు బయటకొస్తున్నాయని, రికార్డుల పున:పరిశీలన పూర్తవడానికి మరింత సమయం పడుతుందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఆరు జిల్లాల నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని ప్రొఫార్మాలు రూపొందించి డేటా సేకరణకు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ప్రాథమిక విచారణలో కొందరు వైసీపీ నేతల భూముల దందా చిట్టా స్పష్టంగా బయటకొస్తున్నట్లు తెలిసింది. అందులో తిరుపతి జిల్లా పరిధిలోని శ్రీకాహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అక్రమాలు పుంఖానుపుంఖాలుగా వెలుగుచూస్తున్నట్లు తెలిసింది. పున:పరిశీలన చేస్తోన్న అధికారుల బృందానికే మతిపోయేలా ఆ నేత అక్రమాలు ఉన్నట్లు తెలిసింది.

మదనపల్లిలో పగిలిన భూపుట్టలు

చిత్తూరు జిల్లా మదనపల్లిలో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిప్పుపెట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ నేతలు తమ భూ అక్రమాలను రికార్డుల ద్వారా బయటి సమాజం తెలుసుకోకుండా ఉండేందుకు కుట్రపూరితంగా రెవెన్యూ రికార్డులను తగులబెట్టారు. ఈ కేసులో మదనపల్లి ఆర్డీఓ, పూర్వపు ఆర్డీఓ, సీనియర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు వందలాది మంది ఆయన్ను కలిసి తమ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వివరించారు. దీంతో మూడు రోజుల పాటు ఆయన అక్కడే ఉండి ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరించారు. ఆ తర్వాత మదనపల్లి భూములపై విచారణ చేయ గా వేలాది ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా ఫ్రీ హోల్డ్ చేసి వైసీపీ నేతలు లాక్కున్నారని, దౌర్జన్యంగా తీసేసుకొన్నారని గుర్తించారు. ఇదే అంశంపై సిసోడియా అమరావతికి వ చ్చాక సీఎంకు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మదనపల్లి తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల భూముల సమస్యలపై విచారణ జరగాలని ఆయన కోరారు. ఇందుకోసం నిజాయతీ, నిపుణులైన అధికారులతో విచారణ చేయించాలని ప్రతిపాదించారు. ఇందుకు సీఎం అంగీకరించారు. దరిమిలా, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో విచారణ బృందాలను ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు తొలుత రాయలసీమ జిల్లాలు, ప్రకాశంలో ఎంపిక చేసిన రెవెన్యూ డివిజన్‌లు, మండలాల్లో రికార్డులను పున: పరిశీలన చేయించాలని నిర్ణయించారు.

ఆరు జిల్లాల్లో విచారణ మొదలు

అసైన్డ్ భూముల అన్యాక్రాంతం, దౌర్జన్యంగా లాక్కోవడం, అక్రమం గా, నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితానుంచి భూములను తొలగించి ఫ్రీహోల్డ్ చేయించిన ఉదంతాలపై విచారణ జరుగుతోంది. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఆరు రెవెన్యూ డివిజన్‌ల పరిధిలోని 18 మండలాల్లో రికార్డుల పున:పరిశీలన జరుగుతోంది. తొలుత ఆరు మండలాల్లో విచారణ ప్రారంభమైంది. ఈ మండలాల్లో పెద్ద ఎత్తున అసైన్డ్, చుక్కల భూములను నిషేధ జాబితా నుంచి తొలగించారు. గిఫ్ట్ పేరిట భారీగా అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేసి హక్కులు ఇచ్చారు. ఇందులో వైసీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆరు మండలాల్లోని కీలకమైన గ్రామాల పరిధిలోని అసైన్డ్, చుక్కల భూముల రికార్డులను పున:పరిశీలన చేస్తున్నారు. ఒక్కో విచారణ బృందంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, ఇతర మండలాలకు చెందిన తహసిల్దార్, సర్వేయర్, ఇతర జోన్‌లకు సంబంధించిన సబ్‌రిజిస్ట్రార్‌లు ఉన్నట్లు తెలిసింది. రికార్డుల పున:పరిశీలన ప్రక్రియను రెండు వారాల్లోగా పూర్తిచేయాలని సీసీఎల్ఏ జయలక్ష్మి ఆదేశించారు. అయితే, రెండు వారాలు కాదు కదా... కనీసం రెండు నెలలయినా పట్టొచ్చని విచారణలో పాల్గొంటున్న అధికారులు చెబుతున్నారని తెలిసింది.

శ్రీకాళహస్తిలో భూచోళ్లు

భూ రికార్డుల పరిశీలన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోనూ సాగుతోంది. ఇప్పటికే ఓ మండలంలో అధికారుల బృందం ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూముల రికార్డులను పరిశీలన చేస్తోంది. ఈ డివిజన్‌పరిధిలో 18వేల ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేసినట్లుగా గుర్తించారు. కాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత తన బినామీల పేరిట 1200 ఎకరాల అసైన్డ్ భూమిని చేజిక్కించుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ నేత చుట్టూ ఉండే వ్యాపారులు, ఓ కాలేజీ, స్కూల్ ప్రిన్సిపాల్, ఇతరుల పేరిట ఈ భూమిని కలిగి ఉన్నట్లు తెలిసింది. ఫ్రీ హోల్డ్ తర్వాత ఆ భూమి ఇతరుల పేరిట మారింది. ఈ మేరకు రికార్డుల్లోనూ ఇది క నిపిస్తున్నట్లు తెలిసింది. విచారణ పూర్తయ్యేసరికి వైసీపీ నేత బినామీల పేరిట ఉన్న భూముల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కేవలం ఒక అర్బన్, రూరల్ మండలం పరిధిలోనే విచారణ జరుగుతోందని, మిగతా గ్రామాల్లోనూ రికార్డుల పున: పరిశీలన జరిగితే అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసిన భూములు, నేతల చేతుల్లో ఉన్న వాటి వివరాలు బయటకొస్తాయని చెబుతున్నారు.

డయాఫ్రమ్ కొత్తదే కట్టుకోండి!

- పాతదానికి రిపేర్లు చేసుకోవచ్చు కానీ.. జలసంఘం సూచనలు పరిగణనలోకి తీసుకుంటే మేలు
- మెయిన్ డ్యామ్ పనులపై వర్క్‌షాప్
- పోలవరంపై అంతర్జాతీయ నిపుణుల నివేదిక

అమరావతి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం పాత డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసుకునే అవకాశముందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. అయితే... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు భద్రతరీత్యా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించుకోవచ్చునని కూడా పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర జలసంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుంది. పోలవరం ప్రాజెక్టును ప్రత్యక్షంగా పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు గెయిన్ ఫ్రాన్స్‌కో డీసీకో (అమెరికా), రిచర్డ్ డొనెల్లీ (కెనడా), డేవిడ్ పాల్ (అమెరికా) గురువారం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి 53 పేజీల నివేదికను పంపారు. "పోలవరం సాగునీటి ప్రాజెక్టులో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్యలో వీలైనంత త్వరగా ప్రస్తుత డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించుకోవచ్చు. ఈ ఏడాది నవంబరు ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూలై 31 దాకా నిరంతరాయంగా డయాఫ్రమ్‌వాల్ పనులు చేపట్టేలా కార్యాచరణను అమలు చేయాలి. ప్రాజెక్టులో చేపట్టాల్సిన మిగిలిన పనులన్నింటిపైనా ఇన్వెస్టిగేషన్, డిజైన్‌ల రూపకల్పన కొనసాగించుకోవచ్చు" అని నిపుణుల బృందం సిఫారసు చేసింది. అయితే... మెయిన్ డ్యామ్ పనులకు సంబంధించి డిజైన్లు, నిర్మాణ పనులపై వర్క్‌షాపును నిర్వహించాలని సూచించింది. నిర్మాణ యాజమాన్య విధానంలో భాగంగా క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని తెలిపింది. నిపుణుల ప్యానల్ నివేదికలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

- పాత డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసే అవకాశమున్నప్పటికీ... కేంద్ర జల సంఘం ఆలోచనల మేరకు కొత్త డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించుకోవచ్చు.
- ప్రస్తుత డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో వినియోగించిన మెథడాలజీనే కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి ఉపయోగించాలి.
- షెడ్యూల్‌లోగా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు వీలుగా వనరులను సిద్ధం చేయాలి.
- డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి సమగ్ర ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి.
- మెయిన్ డ్యామ్ దిగువన గ్యాప్ 2 వద్ద గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పూర్తి చేయాలి.
- డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం కోసం ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయాలి.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య మూడు మీటర్ల కంటే తక్కువ ఎత్తులో జలాలు ఉండేలా చూసుకోవాలి.
- వైబ్రో కంపాక్షన్ (వీసీ) 20 మీటర్ల లోతు వరకూ చేపట్టాలి.
- చానల్ 1550, చానల్ 280 మధ్య భారీగా ఉన్న సీపేజీని నివారించేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలి.
- ఆరు నుంచి ఎనిమిది పిజియోకోన్‌లను సిద్ధం చేయాలి. ఓడోమీటరు పరీక్షలు చేయాలి.
- మెయిన్ డ్యామ్‌కు సంబంధించిన గ్యాప్-1, గ్యాప్-2 డ్యామ్ డిజైన్‌లపై చాలా సందేహాలు వస్తున్నాయి. వీటిని నివృత్తి చేసేందుకు వీలుగా డ్యామ్ డిజైన్, నిర్మాణాలపై పూర్తి సమాచారంతో వర్క్‌షాపును నిర్వహించాలి.

'ఆడుదాం ఆంధ్రా'పై పోలీసు విచారణకు సీఐడీ ఆదేశం

విజయవాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందని వస్తున్న ఆరోపణలపై విచారణ చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్‌ను సీఐడీ ఆదేశించింది. దీనికి సంబంధించి ఒక మెమోను కమిషనర్ కార్యాలయానికి పంపింది. వైసీపీ ప్రభుత్వం సీఎం కప్, ఆడుదాం ఆంధ్రా పేర్లతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ క్రీడలకు టోర్నమెంట్లను నిర్వహించింది. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ టోర్నమెంట్ నిర్వహించింది. ఒక్కో దశలో విజేతలకు ఒక్కో విధంగా నగదు బహుమతిని ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌లకు ప్రభుత్వం రూ.125 కోట్లు విడుదల చేసింది. అందులో రూ.105 కోట్లు దుర్వినియోగం జరిగిందని ఆత్యాపాత్యా సీఈవో రంభ ప్రసాద్ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ దుర్వినియోగంలో అప్పటి మంత్రులు ఆర్కే రోజా, ధర్మాన కృష్ణదాసుల పాత్ర ఉందని ఆరోపించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన సీఐడీ దీనిపై విచారణ చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుకు ఆదేశాలు ఇచ్చింది.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

- స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

వెంకటాచలం, ఆగస్టు 15: స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న వికసిత్ భారత్ నిర్మాణంలో యువతరం భాగస్వామి కావాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం మండలం సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్షర, స్వర్ణభారతి విద్యామందిర్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య కోసం ప్రాణాలను అర్పించిన సమరయోధుల స్మృతికి నివాళ్లు అర్పించిన ఆయన, వారి కలలకు ప్రతిరూపమైన నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటి మీద జెండాను ఎగరేసి ప్రజలంతా దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టీ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, అక్షర విద్యాలయం ప్రిన్సిపాల్ కుముదా పాల్గొన్నారు.

భారీగా సోలార్ విద్యుదుత్పత్తి

- వ్యవసాయానికి 1,200 ఫీడర్లతో 3,725 మెగావాట్ల సౌర ఇంధనం
- ప్రభుత్వ కార్యాలయాలకూ..: విజయానంద్

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా సోలార్ విద్యుదుత్పత్తి కోసం కార్యాచరణను అమలు చేయనున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. విజయవాడ విద్యుత్ సౌధలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా విద్యుత్తు సంస్థల ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో 19.6 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ఉన్నాయి. వాటికి ఉచిత విద్యుత్తు ఇవ్వడం కోసం 1,200 అగ్రికల్చరల్ ఫీడర్ల ద్వారా 3,725 మెగా వాట్ల సోలార్ విద్యుత్తును వినియోగిస్తాం. రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల్లోనూ సోలార్ విద్యుత్తును ఉపయోగిస్తాం. గత ఏడాది 26,449 మిలియన్ యూనిట్లను ఏపీ జెన్కో ఉత్పత్తి చేసింది' అని తెలిపారు. కార్యక్రమంలో ఏజీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జేఎండీ చేకూరి కీర్తి, ఏపీ జెన్కో చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ టి.వనసరెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ దొరికితే.. అడ్మిషన్ రద్దు..!

- వర్సిటీలు, కాలేజీల్లో నియంత్రణపై తెలంగాణ సర్కారు దృష్టి

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో డ్రగ్స్‌తో పట్టుబడే విద్యార్థుల అడ్మిషన్లను రద్దు చేయాలని భావిస్తోంది. ఈ అంశంపై మరింత లోతుగా చర్చించేందుకు డీజీపీ జితేందర్, విద్యాశాఖ అధికారులు, వర్సిటీల ఇన్‌చార్జి వీసీలు, యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో అధికారులు శనివారం భేటీ కానున్నారు. వర్సిటీలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థల్లో డ్రగ్స్, ర్యాగింగ్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పుడు ఉన్న చట్టాల ప్రకారం డ్రగ్స్, ర్యాగింగ్‌లను పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చా? మరిన్ని కఠినమైన నిబంధనలను తీసుకురావాలా? అనే అంశంపై మేథోమదనం చేయనున్నారు. ప్రస్తుత చట్టాలు, నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి వద్ద డ్రగ్స్ లభిస్తే.. కౌన్సెలింగ్ ఇచ్చి, వదిలి వేయాలి. అయితే.. దీని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, అడ్మిషన్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటే.. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లేందుకు సాహసించరని అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ భేటీలో తీసుకునే నిర్ణయాలపై ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పిస్తారు.

తిరుమలలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం


శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం

తిరుమల, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేశాక హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేదపండితులు పంచసూక్తాలను పఠించిన తర్వాత పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలను కూడా ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ జీయర్‌స్వాములు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

కళా 'లావణ్య'ం!

- అంకుడు కర్రతో సూక్ష్మ లక్ష్మీదేవి బొమ్మ


అంగుళం ఎత్తు, అర అంగుళం వెడల్పుతో రూపొందించిన సూక్ష్మ లక్ష్మీదేవి బొమ్మ, హస్త కళాకారిణి చింతల లావణ్య(ఇన్‌సెట్)

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్త కళాకారిణి చింతల లావణ్య అంకుడు కర్రతో సూక్ష్మ లక్ష్మీ అమ్మవారి బొమ్మను తయారుచేశారు. ఒక అంగుళం ఎత్తు, అర అంగుళం వెడల్పుతో చేతి బొటన వేలిపై నిలిపేటంత చిన్న బొమ్మను రూపొందించారు. దీనిని తయారు చేయడానికి సుమారు 40 గంటలు సమయం పట్టినట్టు ఆమె తెలిపారు.

-ఎలమంచిలి

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతా

పేదలకు కడుపునిండా అన్నంపెడితే అదే సంతృప్తి



- సెప్టెంబరు నెలాఖరుకు రాష్ట్రంలో 203 అన్నక్యాంటీన్లు
- అన్నక్యాంటీన్‌లోనే భోజనం చేసిన సీఎం చంద్రబాబు దంపతులు
- అన్న క్యాంటీన్ల నిర్వహణకు రోజుకు రూ.53 లక్షల ఖర్చు
- పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి: చంద్రబాబు

మచిలీపట్నం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'పేదల జీవితాల్లో వెలుగులు నింపుతానని, పేదలకు కడుపునిండా అన్నంపెడితే అదే మానసిక సంతృప్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలోని రామబ్రహ్మం పార్కులో అన్నక్యాంటీన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. సీఎం సతీమణి భువనేశ్వరి ప్రజలకు భోజనం వడ్డించారు. అనంతరం సీఎం, ఆయన సతీమణి ప్రజలతో కలసి అన్నక్యాంటీన్‌లోనే భోజనం చేశారు. భోజనంచేసే సమయంలో పేదలతో ముఖ్యమంత్రి మాట్లాడారు. త్వరలో జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజల కష్టాలను పరిష్కరిస్తామన్నారు. అన్నక్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలతో మాటామంతీ నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ తిరుపతిలో అన్నదానం ట్రస్ట్‌ను ప్రారంభించారని, ఆయన ప్రారంభించిన అన్నదానం ట్రస్ట్ ద్వారా టీటీడీతో సంబంధం లేకుండా రోజుకు లక్షమందికిపైగా భోజనం పెడుతున్నారని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గన్నవరంలో డొక్కా సీతమ్మ వచ్చిన వారందరికీ భోజనం పెట్టేవారని, వీరిద్దరి స్ఫూర్తితో 2018లో అన్నక్యాంటీన్లను ప్రారంభించినట్లు తెలిపారు. తొలివిడతగా 100 అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తామని, సెప్టెంబరు నెలాఖరుకు రాష్ట్రవ్యాప్తంగా 203 అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపారు. గిరిజనుల కోసం మండల కేంద్రాల్లో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ పాలకులు నిర్దాక్షిణ్యంగా అన్న క్యాంటీన్లను నిలిపివేసి ఐదేళ్లపాటు పేదల కడుపు మాడ్చారని అన్నారు.


గుడివాడలో అన్నక్యాంటీన్ ప్రారంభించి ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి

ప్రజలతో కలిసి భోజనం చేయడం సంతృప్తినిచ్చింది: భువనేశ్వరి

గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రజలతో కలిసి భోజనం చేయడం ఎంతో సంతృప్తిని కలిగించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. 'స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రజలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషం కలిగించింది. ఈరోజు ప్రారంభమైన అన్న క్యాంటీన్లు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని కోరుకొంటున్నాను. సామాన్యులందరికీ ఐదు రూపాయలకే రుచి, శుచి కలిగిన భోజనం అందుబాటులోకి రావాలి. రాష్ట్రంలో పేదలందరికీ ఆహార భద్రత లభించాలని ఆశిస్తున్నాను' అని ఆమె ఆకాంక్షించారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ వెళ్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆయన విజయవాడ నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్తున్నారని, శనివారం అక్కడే ఉంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చిస్తారని తెలిపారు. శనివారం రాత్రి ఆయన ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే అవకాశం ఉంది.

అన్న క్యాంటీన్లకు విరాళాల వెల్లువ

- ఒక్క రోజే రూ.2 కోట్లకుపైగా రాక
- ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేసిన మున్సిపల్ శాఖ

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునఃప్రారంభమైన అన్న క్యాంటీన్‌లకు విరాళాలందించే విషయంలో ప్రజల నుంచి భారీగా స్పందన వస్తోంది. పేదలకు ఐదు రూపాయలకే భోజనం అందించే నిమిత్తం పారిశ్రామికవేత్తలు, సాధారణ ప్రజలు, వృద్ధులు సైతం తరలి వచ్చి విరాళాలిస్తున్నారు. బుధవారం ఒక్క రోజే రూ.2 కోట్లకుపైగా విరాళాలు అందాయి. వివిధ వర్గాల ప్రజలు, సంస్థలు విరాళాలిచ్చేందుకు ఆసక్తి చూపుతుండటంతో అన్న క్యాంటీన్ల నిర్వహణ చూస్తున్న మున్సిపల్‌శాఖ విరాళాలు తీసుకునేందుకు బ్యాంక్ ఖాతా వివరాలను ప్రకటించింది. విరాళాలు పంపించాలనుకునేవారు ఆ ఖాతాకు నేరుగా ఆన్‌లైన్ విధానంలో లేదా చెక్ రాసి పంపవచ్చని తెలిపింది. అన్న క్యాంటీన్స్ అకౌంట్ నెంబరు 37818165097కు గుంటూరు చంద్రమౌళినగర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌కు చెందేలా జమచేయవచ్చని పేర్కొంది. ఎస్‌బీఐ ఐఎఫ్ఎస్‌కోడ్ 0020541 నంబరుకు నగదు పంపవచ్చని తెలిపింది. గురువారం గుడివాడలో జరిగిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఖాతా వివరాలు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో ఒక స్ఫూర్తి నింపేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉంటుందని సీఎం చెప్పారు.

విరాళాలు పంపాల్సిన చిరునామా:
అన్నా క్యాంటీన్స్
బ్యాంకు పేరు: ఎస్‌బీఐ
అకౌంట్ నంబర్: 37818165097
ifsc code: SBIN0020541
చంద్రమౌళినగర్ బ్రాంచి, గుంటూరు

దాతలు ముందుకురావాలి

ఒక్కో అన్నక్యాంటీన్‌కు రోజుకు రూ.26,250 ఖర్చవుతుందని, 203 అన్నక్యాంటీన్లకు రూ.53 లక్షలు అవుతుందన్నారు. ఈ ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరించలేదని, దాతలు ముందుకు వస్తే పథకాన్ని నిర్విరామంగా కొనసాగించవచ్చన్నారు. తమ సంపాదనలో ఐదు శాతం నగదును అన్నక్యాంటీన్లకు విరాళాల రూపంలో ఇవ్వాలని చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నక్యాంటీన్లకు విరాళాలు ఇచ్చేవారు 37818165097 ఖాతా నంబరుకు, ఐఎఫ్ఎస్‌కోడ్ ఎస్‌బీఐ 0020541 నంబరుకు నగదు పంపవచ్చన్నారు. డిజిటల్ పేమెంట్లను కూడా స్వీకరిస్తామని తెలిపారు. పెళ్లిరోజు, పుట్టినరోజు వేడుకలతో పాటు ఇంటిలో శుభకార్యాలు జరిగే సమయంలో కొంతమేర ఖర్చును తగ్గించుకుని పేదలకు పట్టెడన్నం పెట్టే అన్నక్యాంటీన్లకు విరాళాలు అందజేయాలని కోరారు. జిల్లాకు చెందిన ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యేలు రూ.50 లక్షలను అన్నక్యాంటీన్లకు విరాళాలు ప్రకటించారు. దండమూడి చౌదరి రూ.5,07,779ల చెక్కును సీఎంకు అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

విజయవాడ-ఢిల్లీ ప్రతిరోజూ విమానం

- విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ, ఢిల్లీ మధ్య ఇండిగో సంస్థ వచ్చే నెల 14 నుంచి రోజువారీ విమాన సర్వీసును నడపనున్నట్లు కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. 'విజయవాడ నుంచి ఉదయం 11.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.40 గంటలకు విమానం ఢిల్లీ చేరుకుంటుంది. ఢిల్లీ నుంచి ఉదయం 8.10 గంటలకు బయలుదేరే ఇండిగో విమానం ఉదయం 10.40 గంటలకు విజయవాడ చేరుకుంటుంద'ని మంత్రి గురువారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కొత్త విమాన సర్వీసు ప్రారంభంతో ఢిల్లీ, అమరావతి మధ్య బంధం మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కీర్తిచక్ర పురస్కార గ్రహీత రాంగోపాల్‌కు అభినందనలు


ఆర్మీ మేజర్ రాంగోపాల్‌తో కేంద్రమంత్రి రామ్మోహన్

కీర్తిచక్ర పురస్కారానికి ఎంపికైన శ్రీకాకుళం జిల్లా నగిరిపెంట గ్రామానికి చెందిన ఆర్మీ మేజర్ మళ్ల రాంగోపాల్‌నాయుడుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందనలు తెలిపారు. ఈ మేరకు గతంలో రాంగోపాల్‌తో కలిసి దిగిన ఫొటోను మంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు రేఖ నుంచి దేశంలోకి అక్రమంగా చొరబడుతున్న ఉగ్రవాదులను అత్యంత సాహసంతో ఎదుర్కొని దేశ ప్రజలను, సైనిక దళాలను కాపాడారు. మీరు సాధించిన ఘనత మన జిల్లాకే కాదు. మొత్తం తెలుగు జాతికి ఎంతో గర్వకారణం. సర్వీసులో ఉండగానే కీర్తిచక్ర పొందిన తొలి తెలుగు వ్యక్తిగా మీరిచ్చిన స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం" అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కొనియాడారు.

నేడు పశ్చిమ బెంగాల్‌లో అల్పపీడనం

- రాష్ట్రానికి వర్షసూచన

విశాఖపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడి నైరుతి వైపు ఒంగి ఉంది. దీని ప్రభావంతో శుక్రవారం పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో భూమిపై అల్పపీడనం ఏర్పడనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా అరేబియా సముద్రం నుంచి దక్షిణ తెలంగాణ వరకూ ద్రోణి విస్తరించింది. ఈ రెండింటి ప్రభావంతో రాష్ట్రంలో గురువారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. అయితే చాలాచోట్ల ఎండ తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా అనంతపురంలో 37.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఏకపక్ష సర్దుబాటుపై అధ్యాపకుల్లో ఆవేదన

- సుదూర ప్రాంతాలకు పంపడంపై డిగ్రీ లెక్చరర్ల అభ్యంతరం
- ఖాళీలను పారదర్శకంగా ప్రకటించి ఎంపికకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఏకపక్ష పని సర్దుబాటు ప్రక్రియపై డిగ్రీ లెక్చరర్లలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ అభిప్రాయంతో పనిలేకుండా అవసరమైన సర్దుబాటు పేరుతో సుదూర ప్రాంతాలకు పంపడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న సర్దుబాటు విధానంలో టీచర్ల అభిప్రాయానికి విలువ ఉందని వారు గుర్తు చేస్తున్నారు. ఖాళీలు ఎక్కడున్నాయి? అవసరం ఎక్కడుంది? అన్న విషయాలను పారదర్శకంగా చూపించి, ఆప్షన్ ఇస్తే సముచితంగా ఉంటుందని వారు సూచిస్తున్నారు. అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు కక్షసాధింపు చర్యగానే భావించాల్సి వస్తుందని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

380 కి.మీ. అవల సర్దుబాటా!

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మరోసారి పని సర్దుబాటు చేపట్టాలని ఆ శాఖ నిర్ణయించింది. తాజాగా జోన్-3లో తొమ్మిది మంది లెక్చరర్లను సర్దుబాటు పేరుతో నాగార్జున సాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీకి పంపారు. నెల్లూరు నుంచి 381 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీకి ఏకపక్షంగా పంపడంపై లెక్చరర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా కొన్ని కాలేజీల్లో లెక్చరర్లు మిగిలగా, కొన్నిట్లో అవసరం ఏర్పడింది. అవసరం మేరకు ఆర్డర్లు జాబితాలు తయారు చేస్తున్నారు. వాటి ఆధారంగా మరోసారి సర్దుబాటు తప్పదు. అయితే తమను అధికారులు ఉద్దేశపూర్వకంగానే వేధిస్తున్నారన్నది అధ్యాపకుల ఆరోపణ. తరచూ రకరకాల శిక్షణలతో పేరుతో దూర ప్రాంతాలకు పంపుతున్నారని, దీంతో బోధన సమయం తగ్గిపోతోందని అంటున్నారు. దీనిపై ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్సీలకు వారు ఫిర్యాదు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తమపై వేధింపులు ఇంకా పెంచారని లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీలకు సర్దుబాటు పేరుతో పంపితే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. సర్దుబాటు సమయంలో తమ అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న సర్దుబాటు పద్ధతిని వారు చూపిస్తున్నారు.

అసలు సర్దుబాటు ఎందుకు?

డిగ్రీ కాలేజీల్లో సింగిల్ మేజర్ డిగ్రీ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత లెక్చరర్ల అవసరం గందరగోళంగా మారింది. ఈ విధానంలో ఒక్కో సబ్జెక్టుకు ముగ్గురు లెక్చరర్లు కావాలి. దీంతో కొన్ని చోట్ల కొన్ని సబ్జెక్టులను ఎత్తివేశారు. ఆ కారణంగా కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు మిగులుగా మారారు. వారిని అవసరమైన చోటకు సర్దుబాటు పేరుతో పంపుతున్నారు. అందులో భాగంగానే కళాశాల విద్యాశాఖ ఈ ఏడాది జనవరిలో 140 మందిని సర్దుబాటు పేరుతో ఇతర కాలేజీలకు పంపింది. జనవరిలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటుపై వెళ్లిన అధ్యాపకులు ఏప్రిల్ తరువాత తిరిగి సొంత కళాశాలలకు వచ్చేయాలి. కానీ వారిని అనధికారికంగా ఇప్పటికీ అక్కడే కొనసాగిస్తున్నారు. పాత కాలేజీల్లో వారి అవసరం లేదని, అందువల్లే కొనసాగిస్తున్నామని చెబుతున్న అధికారులు... వారి కొనసాగింపుపై ఉత్తర్వులు మాత్రం జారీ చేయలేదు.

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ (విశాఖపట్నం), ఆగస్టు 15: రిమాండ్ ఖైదీ ఒకరు బుధవారం అర్ధరాత్రి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు విశాఖపట్నం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. గాజువాకకు చెందిన ఎం.కృష్ణప్రసాద్ అలియాస్ చిన్నారావు హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బుధవారం వాయిదా ఉండడంతో పోలీసులు కోర్టుకు తీసుకువెళ్లారు. కోర్టు నుంచి వస్తుండగా రక్తపు వాంతి చేసుకోవడంతో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అయితే చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండె, ఊపిరితిత్తుల్లో సమస్యల వల్ల కృష్ణప్రసాద్ చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. అతను 2022 నవంబరు 14వ తేదీన రిమాండ్ ఖైదీగా కేంద్ర కారాగారానికి వెళ్లాడు. రెండు నెలల క్రితం కూడా ఊపిరితిత్తుల సమస్య తలెత్తడంతో 15 రోజులు కేజీహెచ్‌లో చికిత్స పొంది, తిరిగి జైలుకు వచ్చినట్టు సూపరింటెండెంట్ తెలిపారు.


టీడీపీలో చేరిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురంలో వైసీపీకి షాక్

- చైర్‌పర్సన్‌సహా 8 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిక

హిందూపురం, ఆగస్టు 15: సినీనటుడు, శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. వైసీపీకి చెందిన హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు ఎనిమిది మంది కౌన్సిలర్లు గురువారం బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు పార్టీ వీడడానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో వేచిచూశారు. గురువారం ఆయన నియోజకవర్గ పర్యటనకు రావడంతో ఎమ్మెల్యే నివాసంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారన్న నమ్మకంతోనే టీడీపీలో చేరామన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 30 మంది వైసీపీ, 6 టీడీపీ సభ్యులున్నారు. బీజేపీ, ఎంఐఎం తరఫున ఒక్కొక్కరు గెలిచారు. ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఇద్దరు, ఎంఐఎం నుంచి ఒకరు టీడీపీలో చేరారు. గురువారం 9 మంది చేరడంతో టీడీపీ బలం 19కి చేరింది. టీడీపీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి మరో కౌన్సిలర్ అవసరం. ఎమ్మెల్యే, ఎంపీ ఓటు కలుపుకుంటే 21కి చేరుతుంది. దీంతో చైర్మన్ పదవి టీడీపీ వశం కానుంది. మరికొంతమంది కూడా టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎర్రకోట సందేశం

ప్రధాని నరేంద్రమోదీ ఎంతో చక్కగా ప్రసంగించగలరు. ఆయన ఎర్రకోట ప్రసంగాల్లో ఆదిలో ఉన్న పస క్రమంగా తగ్గిందని గిట్టనివారు అంటూంటారు కానీ, ఈ 78వ స్వాతంత్ర్యదినోత్సవంలో ఆయన ఒక సరికొత్త రికార్డు కూడా సృష్టించేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన ప్రసంగం ఏకంగా 98నిముషాలు సాగింది.మరో రెండునిముషాలు మాట్లాడివుంటే సెంచరీ కొట్టేవారని అభిమానులు అంటున్నారు. ఓ రెండునిముషాలు ఎక్కువగా మాట్లాడి ఆయన 2016నాటి రికార్డును చెరిపేశారు. 2019లో అధిక సంఖ్యాబలంతో రెండోసారి ప్రధాని అయినప్పుడు కూడా ఎర్రకోటనుంచి 92నిముషాలే మాట్లాడారు. ఇప్పుడు సొంత బలం 240కు పడిపోయి, కూటమి కట్టాల్సివచ్చినప్పటికీ, గత పది ప్రసంగాల రికార్డులను చెరిపివేస్తూ ఈ 11వ ఎర్రకోట ప్రసంగాన్ని సుదీర్ఘంగా చేశారు. ప్రధాని ప్రసంగంలో 140కోట్ల బలం కనిపించిందే తప్ప, ఆ 240 బలహీనత కాదని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రత్యక్షంగా ఆహూతులను, పరోక్షంగా కోట్లాదిమంది ప్రజలను ఆయన సంబోధించారు. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్‌బిహారీ వాజపేయి వంటివారు కాస్త అటూఇటూగా అరగంటే మాట్లాడేవారు. పనిమంతుడైన మన్మోహన్ సింగ్ మంచిమాటకారి కాదు కానీ, అంతటి వాగ్ధాటి ఉన్నప్పటికీ అటల్ జీ ఎర్రకోటమీద ఎందుకంత తక్కువ సమయం ఉండేవారో తెలియదు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచీ నరేంద్రమోదీ ఈ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాన్ని నామమాత్రపు తంతుగా కాకుండా ఒక ప్రజా సంబంధ వ్యవహారంగా చూశారు. ప్రసంగానికి అప్పటివరకూ ఉన్న హద్దులను కూడా చెరిపేసి, రాజకీయం చేస్తున్నారన్న విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. నెహ్రూ నుంచి రాహుల్ వరకూ ఎవరిని తప్పుబట్టాలన్నా, గతపాలకుల పాపాలు దేశానికి శాపాలుగా మారాయని కడిగిపారేయడానికి కూడా ఆయన దీనిని వాడుకున్నారు. అలాగే, పలురకాల అభియాన్లు, మిషన్ల ప్రకటనకు కూడా ఇదే వేదికైంది. స్వచ్ఛభారత్, బేటీ బచావో-బేటీ పడావో, ఉజ్వల, జల్‌జీవన్ వంటివి అందులో కొన్ని. అవినీతి వ్యతిరేక పోరాటాలు, కుటుంబపాలనపై విమర్శలు సైతం ఆయన ఎర్రకోట ప్రసంగాల్లో ఉంటాయి.

ఇప్పుడు సొంతబలం తగ్గినంతమాత్రాన మోదీ తీరులో మార్పు ఉండబోదని ఈ ప్రసంగం సైతం రుజువుచేసింది. ఆయన ఈ మారు దూకుడుగా కాక, కాస్తంత మెత్తగా మాట్లాడారని కొంతమందికి అనిపించినా, విపక్షాలను ఏకిపారేయడానికీ, వివాదాస్పద అంశాలను ముందుకు తేవడానికీ ఆయన సంకోచించలేదు. వికసిత భారతాన్ని కాంక్షించారు, మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం లక్ష్యంగా ప్రకటించారు.

మద్దతిస్తున్న మిత్రపక్షాలకు ఇబ్బందిలేకుండా ఉండటానికి కాబోలు, తాము ఎప్పటినుంచో వల్లిస్తున్న ఉమ్మడిపౌరస్మృతికి ఈసారి ఆయన 'సెక్యులర్' పదాన్ని జతచేర్చారు. చర్చ జరగాలన్న ఒక్క మాటతో రచ్చరేపవచ్చునని ఆయనకు తెలుసు. ఇప్పటి సివిల్‌కోడ్ మతపరమైనదనీ, వివక్షాపూరితమైనదనీ ఆక్షేపించి, మెజారిటీ ప్రజలు దానిని మెచ్చడం లేదని నిర్ధారించి, రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న ఈ లౌకికవాద ఉమ్మడిపౌరస్మృతికి సుప్రీంకోర్టు ఆమోదం, ఆశీస్సులు ఉన్నాయన్నారు. ఆ స్వప్నసాకారం దిశగా వడివడిగా అడుగులు ఎలా పడతాయో ఇక చూడాలి. ఒకేదేశం-ఒకే ఎన్నిక అవసరాన్ని కూడా ఆయన ఈ వేదికమీదనుంచి మరోమారు ఉద్ఘాటించి, సభాబలం తగ్గినంతమాత్రాన ఎజెండాలో తాము వెనక్కు తగ్గడంలేదని తెలియచెప్పారు. ఆర్థిక, చట్టపరమైన సంస్కరణల విషయంలో విపక్షాలు అడ్డుపడినా ఆగేదిలేదన్న ప్రకటన కూడా అటువంటిదే. విద్య ఉపాధి గురించి ప్రస్తావించడం, కొన్ని చర్యలను వివరించడం ఆగ్రహంగా ఉన్న యువతరాన్ని ఉపశమింపచేయడం కోసం కావచ్చు. పదేళ్ళలో అద్భుతాలు చేశామంటూ ఏ ఒక్కరంగాన్నీ, ఏ చిన్న విషయాన్నీ వదలకుండా ఆయన ప్రజలకు వివరించారు. అదానీకి వ్యతిరేకంగా జరిగే ఏ వ్యవహారమైనా విదేశీకుట్రలో భాగమే కనుక, ఇప్పుడు సెబీచీఫ్‌మీద హిండెన్‌బర్గ్ కథనాన్ని సైతం విశ్వసించకూడదని అన్యాపదేశంగా సెలవిచ్చారు. మోదీ ఎంతో ఓపికగా చేసిన ఈ సుదీర్ఘ ప్రసంగంలో ఆత్మస్తుతి పరనిందలను అటుంచితే, కొనసాగుతున్న లక్ష్యాలను, అంతర్లీన సందేశాలను ప్రజలు సరిగానే గ్రహించి ఉంటారు.

ఉపేక్షిత కులాలకు ఉపకోటా వెల్లువ

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో క్రీమీలేయర్ (సంపన్న శ్రేణి) నిబంధనను ప్రవేశపెట్టనున్నారనే విషయమై జరుగుతున్న ఊహాగానాలకు కేంద్రం తెరదించింది. అటువంటి మినహాయింపు సూత్రాన్ని సదరు రిజర్వేషన్లకు వర్తింపచేసే ఆలోచన ఏదీ లేదని కేంద్ర కేబినెట్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అమలుపై ప్రశ్నలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎస్సీ కులాలలో బాగా వెనుకబడిన శ్రేణులకు ప్రత్యేక కోటాలు మంజూరు చేయడం (అంటే ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ) వివక్ష, వెనుకబాటుతనం నిర్మూలనకు, సామాజిక నైతిక న్యాయసాధనకు దోహదం చేస్తుందా అనే అంశంపై స్పష్టమైన సమాధానాలు లేని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎస్సీ రిజర్వేషన్లకు 'క్రీమీలేయర్ నిబంధనను వర్తింపచేసే ప్రసక్తే లేదన్న కేంద్ర కేబినెట్ నిర్ణయం ఆశ్చర్యం కలిగించలేదు. ఆర్థికాభ్యున్నతిని పొందిన దళితులపై వివక్ష కొనసాగుతూనే ఉన్నందున ఎస్సీ/ ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ నిబంధనను వర్తింపచేయకూడదనేది ఇప్పటికే ఒక సునిశ్చిత అభిప్రాయంగా ఉన్నది' అని ప్రొఫెసర్ సునీత్ మహ్వాకర్ (ఒ.పి. జిందాల్ విశ్వవిద్యాలయం) అన్నారు. అయితే ఉపవర్గీకరణకు అనుమతినిస్తూ తీర్పునిచ్చిన ఏడుగురు సభ్యుల ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలతో ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టనున్నారా అన్నది విస్తృతంగా చర్చనీయాంశమయింది.

ఎస్సీ ఎస్టీలలో సంపన్న శ్రేణులను గుర్తించి వారిని రిజర్వేషన్ల పరిధి నుంచి మినహాయించాలన్నది ఆ నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యల సారాంశం. రాజ్యాంగ అధికరణ 341 ప్రకారం షెడ్యూల్డు కులాలు అన్నీ ఒకే సమూహానికి చెందినవని 2005లో ఇ.వి. చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఆగస్టు 1న 6:1 మెజారిటీతో త్రోసిపుచ్చింది. ఎస్సీ కులాలలో అత్యధికం తీవ్ర వివక్షకు గురవుతూ బాగా వెనుకబాటుతనంలో ఉన్నందున రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేయడం రాజ్యాంగ సమ్మతమేనని ఏడుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. అటువంటి ఉపవర్గీకరణ కచ్చితమైన గీటురాళ్ల ప్రాతిపదికన జరగాలని మెజారిటీ తీర్పును స్వయంగా రాసిన భారత ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ పేర్కొన్నారు. అటువంటి విభజన నిర్దిష్ట కులాలను రాష్ట్రపతి జాబితా నుంచి మినహాయించదని, ఉపవర్గీకరణ అవసరమని నిరూపించే వాస్తవిక సమాచారం ప్రాతిపదికన జరగాలని, ఉపవర్గీకరణకు చేసే ఏ చట్టమైనా న్యాయసమీక్షలో ఆమోదం పొందితీరాలని న్యాయ కోవిదులు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతించడం 'విప్లవాత్మక నిర్ణయం' అని రయీస్ ముహమ్మద్ (గతంలో రవిచంద్రన్ బత్రన్) వ్యాఖ్యానించారు (ఈయన 2016లో రాసిన 'ది మెనీ ఒమిషన్స్ ఆఫ్ ఎ కాన్సెప్ట్ : డిస్క్రిమినేషన్ ఎమాంగెస్ట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్' అనే పరిశోధనా పత్రంలోని కొన్ని అంశాలను సిజెఐ చంద్రచూడ్ తన తీర్పు పాదసూచికల్లో ఉటంకించారు). 'ఒక సామాజిక సమస్య పరిష్కారంలో న్యాయవ్యవస్థ ఒక విప్లవాత్మక తీర్పును వెలువరించడం చరిత్రలో ఇదే మొదటిసారి. మానవ మలమూత్రాలను ఎత్తి పారబోసే హేయ, అమానుష వృత్తిలో ఉన్న వాల్మీకీలు ఇత్యాది కులాలవారు ఇప్పుడు విద్యా ఉద్యోగాలలో వాటా, తద్వారా సామాజిక న్యాయాన్ని పొందగలుగుతారు. సుప్రీంకోర్టు తీర్పును అమలుపరిస్తే మూడు నుంచి ఐదు సంవత్సరాలలో తోటి ఎస్సీల మధ్య తమకు నిత్యం జరుగుతున్న అన్యాయాలను వారు అధిగమించగలుగుతారని' ముహమ్మద్ అన్నారు. 'క్రీమీలేయర్ నియమం వివక్షను రూపుమాపలేదు. అయితే షెడ్యూల్డు కులాలలో కుల అంతరాలను తొలగించేందుకు శ్రద్ధ చూపినందున సుప్రీంకోర్టు తీర్పు విప్లవాత్మకమైనదని' ఆయన అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ 'కుల నిర్మూలన'ను ఒక మత గ్రంథంగా దళితులు భావించడం దళిత ఉద్యమంలోని ఒక తీవ్ర లోపం. 'అంబేడ్కర్ ఆ పుస్తకాన్ని హిందువుల నుద్దేశించి రాశారు. దళితులు ఇప్పుడు తమ మొత్తం సమస్యలను అగ్రకుల హిందువులు కేంద్రంగా చూస్తున్నారు. నిజానికి 'దళితులలో మరింత కులతత్వం ఉందనేది నా వాదన. సుప్రీంకోర్టు తీర్పు కూడా ఈ విషయాన్ని చెప్పింది. దళితులలో సైతం బ్రాహ్మణీయ మనస్తత్వం ఉన్నది. కులం అనేది అగ్రకులాల సమస్యగా మాత్రమే చూసేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. కులం అనేది క్రింది స్థాయి కులాలకు సమస్య కాదని వారు చెప్పడం లేదు. ప్రతి వ్యక్తికీ కులం అనేది ఒక సమస్యగా ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినందున అది విప్లవాత్మకమైనదని అంటున్నాను' అని ముహమ్మద్ అన్నారు.

ఉపవర్గీకరణ మాత్రమే ఎస్సీల, ఎస్టీల పురోగతికి దోహదం చేయగలదా లేదా అనేది ఇప్పుడు అసలైన ప్రశ్న అని ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థలలో దళితుల, ఆదివాసీల ప్రాతినిధ్యంపై సర్వే చేసిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి ఎమ్ఎస్ నెత్రపాల్ అన్నారు. 'రిజర్వేషన్ విధానం గురించి మాట్లాడుతున్నప్పుడు భర్తీ చేయని ఉద్యోగ ఖాళీల గురించి తప్పక పట్టించుకోవల్సి ఉన్నది. ఉద్యోగాల విషయాన్ని సమగ్రంగా చూసినప్పుడు ఔట్‌సోర్సింగ్, ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ మొదలైన పరిణామాలతో వాటి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది దీనికి తోడు ఉన్నత స్థాయి ఉద్యోగాలను చూస్తే రిజర్వ్‌డ్ కేటగిరీలో భర్తీకాకుండా మిగిలిపోయిన ఉద్యోగాలు అనేకం ఉండడాన్ని గమనిస్తాం. మరి వాటిని భర్తీచేసేదెప్పుడు? అనేది ప్రశ్నగా మిగిలిపోతోంది' అని ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని సునీత్ మహ్వాకర్ అభిప్రాయపడ్డారు. ఆదాయం, ఆస్తులు, భూమిపై యాజమాన్యం పరంగా కులాల వారీగా ఎటువంటి సమాచారం లేదు గనుక ఆ తీర్పు రాజ్యాంగ విహితం కాదని ఆయన స్పష్టం చేశారు. 'ఉప విభజన తప్పనిసరి కావచ్చు. భవిష్యత్తులో జనాభా గణన వివరాలు అందుబాటులోకి వచ్చి, కొన్నికులాలు అధికంగా లబ్ధి పొందడంతో ఆటు, అవి కులాధారిత వివక్షకు తక్కువగా గురవుతున్నాయని ధ్రువీకరణకావచ్చు. మరాఠా, జాట్ కులస్తుల రిజర్వేషన్ల విషయంలో తగినంత అనుభవపూర్వక సమాచారం (ఎంపిరికల్ డేటా) లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మరి ఇప్పుడు ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. ఎస్సీ ఉపకులాల, ఉపతెగలకు సంబంధించి ఎటువంటి అనుభవపూర్వక సమాచారం లేకుండానే ఉపవర్గీకరణ చేయవచ్చని ఆదేశించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. విద్యా ఉద్యోగాల ప్రవేశాలలో ముఖ్యంగా ఉన్నత స్థాయి ఉద్యోగాల విషయంలో కేవలం సంఖ్యాపరమైన ప్రాతినిధ్యానికేకాకుండా ప్రభావదాయక ప్రాతినిధ్యానికి ఆయా ఉపకులాలకు సంబంధించిన అనుభవపూర్వక సమాచారంను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. 'ఒక నిర్దిష్ట కులంకు సంబంధించిన సాధారణ ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఎంతమంది ఉన్నారు. ఉన్నత విద్య అభ్యసించినవారు ఎందరున్నారు అనే అంశాలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉండి ఉండవచ్చని నేను భావిస్తున్నాను. ఆ సమాచారాన్ని ప్రజారంగం (పబ్లిక్ డొమైన్)లో ఉంచితే, సిజెఐ నిర్దేశించినట్టు కచ్చితమైన సమాచారం ప్రాతిపదికన ఉపవర్గీకరణ జరిగేందుకు ఆస్కారముంటుంది. అయితే అది న్యాయ తనిఖీ (జుడీషియల్ స్క్రూటినీ) నెదుర్కోవలసి ఉంటుందని' నెత్రపాల్ స్పష్టం చేశారు.

ఉపవర్గీకరణ అన్ని రాజకీయ పార్టీలకు రాజకీయంగా సమ్మతమవుతుందని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న మేధావి, ప్రజా కార్యకర్త సూరజ్ యెంగ్డే అభిప్రాయపడ్డారు. అయితే దీనివల్ల అంబేడ్కరైట్ విలువలు అన్నీ నిరర్థకమవుతాయని కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'ఏ ఒక్క ఎస్సీ కులం కోసం కాకుండా సమస్త షెడ్యూల్డు కులాల అభ్యున్నతికై అంబేడ్కర్ పోరాడారు. ఇప్పుడు ఉపవర్గీకరణతో ప్రతి ఎస్సీ ఉపకులమూ సమస్త ఎస్సీ వర్గంలో ఒక భాగంగా కాకుండా తనను తాను ఒక సంపూర్ణ ఎస్సీ శ్రేణిగా భావించుకుంటుంది. షెడ్యూల్డు కులాలు సమైక్యమవకుండా దేనికది విడిగా ఉండిపోయేలా చేయడమే బ్రాహ్మణీయ ఎజెండా'. అట్టడుగు ఎస్సీ కులాల బాగును దృష్టిలో ఉంచుకునే సుప్రీంకోర్టు ఆ తీర్పును వెలువరించి ఉండవచ్చు కాని వాస్తవిక, ప్రామాణిక సమాచారం ప్రాతిదికన ఉపవర్గీకరణ జరగాలన్న నిర్దేశం అంతిమగా ఎస్సీ కులాలలో చీలికలకు దారితీసే అవకాశమున్నది. సంప్రతింపుల ప్రక్రియ ద్వారా ఉపవర్గీకరణ జరగడం ఉత్తమమని యెంగ్డే అన్నారు. వివిధ సామాజిక సమూహాలతో సహా ఎస్సీ కులాల వారిని విస్తృతంగా సంప్రదించిన అనంతరం ఉపవర్గీకరణ జరగాలి. ఈ బాధ్యతను పార్లమెంటు చేపట్టాలని యెంగ్డే అన్నారు. 'కొన్ని కులాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్న విషయం మనకు తెలుసు. వారి సమస్యలు నిజమైనవి. వాటిని పరిష్కరించి తీరాలి. వనరుల పునఃపంపిణీ అనేది ఉపవర్గీకరణ ద్వారా సవ్యంగా జరగదు. నిర్దిష్ట కులాల వారి వెనుకబాటుతనానికి అసలైన కారణాలు ఏమిటో గుర్తించడం ద్వారా మాత్రమే వనరుల పునఃపంపిణీ సమరీతిలో జరిగేందుకు అవకాశమున్నది. వనరుల పునఃపంపిణీ అనేది అట్టడుగు కులంలోని అట్టడుగు వ్యక్తికి కూడా చేరి తీరాలి. కేవలం సంఖ్యాపరంగా అధిక జనాభా ఉన్న కులాలకే ఆ పునఃపంపిణీ పరిమితం కాకూడదు. వెనుకబడిన సామాజిక సమూహాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి, వనరులను సమంగా పంపిణీ చేసేందుకు ఏమి చేయాలో ఆలోచించాలి. (రిజర్వేషన్ల) రొట్టెను మీరు తునకలుగా చేసి, పంపిణీ చేయలేరు. ఎందుకంటే ఆ రొట్టె ఇప్పటికే చాలా చిన్నదిగా ఉన్నది' అని సూరజ్ యెంగ్డే అన్నారు.



ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు 'విప్లవాత్మక'మైనదని ఆ సామాజిక వర్గంలో బాగా వెనుకబడిన సమూహాలు భావిస్తున్నాయి. అయితే భర్తీ కాకుండ మిగిలిపోయిన రిజర్వ్‌డ్ ఉద్యోగాలు, ఉపకులాల స్థితిగతులపై అనుభవపూర్వక, సమాచారం కొరవడడం, అసలు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతున్న తరుణంలో ఎస్సీలకు రాజ్యాంగ విహిత కేటాయింపుల విభజనపై సమాధానాలు లేని ప్రశ్నలు ఎన్నో తలెత్తుతున్నాయి.

■ శ్రావస్తి దాస్ గుప్తా
(ద వైర్ సౌజన్యం)

వయనాడ్ విలయానికి కారకులు ఎవరు?

ఆ బాధ్యత నా జీవితంలో మహా కఠినమైన పని. పశ్చిమ కనుమలపై మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను సమీక్షించేందుకు గత ప్రభుత్వం నియమించిన కె. కస్తూరి రంగన్ కమిటీలో ఒక సభ్యురాలుగా ఉండడం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. పశ్చిమ కనుమలను విధ్వంసం నుంచి పరిరక్షించే చర్యల పట్ల ఎందుకు అంత తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందో మనం చర్చించాల్సిన అవసరమున్నది. ఇటీవల 400మందిని బలిగొన్న వయనాడ్ విపత్తు లాంటి ఉపద్రవాలను చవిచూస్తున్నా పశ్చిమ కనుమల ప్రాంతాల ప్రజలు తమ ప్రాంత పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవడంపై మెరుగైన అవగాహనతో కూడిన శ్రద్ధాసక్తులను ఎందుకు చూపించడం లేదనేది నన్ను బాగా కలవరపెడుతోంది.



■ సునీతా నారాయణ్
మట్టివాసన

సరే, కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలుగా నేను ఎదుర్కొన్న సందిగ్ధావస్థ గురించి తొలుత వివరిస్తాను. కస్తూరి రంగన్ కమిటీ, పౌర సమాజం వాగ్వ్యవహారంలో చెప్పాలంటే, మాధవ్ గాడ్గిల్ కమిటీ కీలక సిఫారసులను అస్పష్టం చేసి బలహీనపరిచేందుకు ఏర్పాటు చేసిన కమిటీ. కమిటీ మొదటి సమావేశం జరగకముందే ఏదో తప్పు చేశామనే భావన మాకు కలిగింది. ఆరు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల ప్రాంతాన్ని సున్నిత పర్యావరణ ప్రాంతం (ఎకొలాజికల్లీ సెన్సిటివ్ ఏరియా)గా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ నివేదిక స్పష్టంగా సిఫారసు చేసింది. అయితే ఈ సిఫారసు ఆ ఆరు రాష్ట్రాలలో ఏ ఒక్కదానికీ ఆమోదయోగ్యం కాలేదు. గాడ్గిల్ నివేదికను తిరస్కరించాయి. కనుక కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలుగా నా విధి నిర్వహణ చాలా జటిలమైనదని నాకు బాగా తెలుసు. పశ్చిమ కనుమలను శీఘ్రగతిన పరిరక్షించేందుకు దోహదం చేసే పరిష్కారాన్ని కనుగొనడం ఎలా?

పశ్చిమ కనుమలలో 1,37,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం (80 శాతం)ను సున్నిత పర్యావరణ ప్రాంతంగా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసు చేసింది. ఈ రక్షిత సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించి ప్రతి ప్రాంతంలోను అనుమతించదగిన కార్యకలాపాల వివరాలను విపులంగా సమకూర్చింది. ఇదిగో ఈ సిఫారసే తోటల ప్రాంతాలు, వ్యవసాయ భూములు ప్రభుత్వ నియంత్రణకు లోనవుతాయేమోననే భయాలు, సంకోచాలను సృష్టించడానికి దారి తీసింది. అయితే ఆ సిఫారసు చేయడంలో మాధవ్ గాడ్గిల్ ఉద్దేశం అది కాదని నేను ఘంటాపథంగా చెప్పుతున్నాను. గాడ్గిల్ నాకు బాగా తెలుసు. పర్యావరణ, ప్రజల జీవనోపాధుల రక్షణకు అంకితభావంతో కృషి చేసిన పర్యావరణవేత్త. సామాజిక సమూహాల హక్కులను సంరక్షించాలని ఆయన సదా వాదించేవారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు సంపూర్ణ భాగస్వాములు కావాలనేది ఆయన ఆకాంక్ష. గాడ్గిల్ నివేదికకు ఆయన ఆకాంక్షకు విరుద్ధమైన భాష్యాలు చెప్పడం చాలా విచారకరమైన విషయం. ఎందుకలా జరిగింది? పశ్చిమ కనుమల ప్రాంతాలలో విధ్వంసకరమైన 'అభివృద్ధి' కార్యకలాపాలకు కారకులు, రాజకీయ ప్రాబల్యమున్న శక్తిమంతమైన స్వార్థపరశక్తులే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.



కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులలో కేరళ కోరిన సవరణే వయనాడ్ విషాదానికి దారితీసిందా? వాతావరణ మార్పు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ కాలంలో ఏ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ నమూనాకు ప్రజల మద్దతు ఖాయంగా లభిస్తుంది? వయనాడ్ విపత్తు నేపథ్యంలో ఈ రెండు అంశాలపై మనం విస్తృత, లోతైన చర్చ జరపాల్సిన అవసరమున్నది.

ఆరు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రతినిధులు, ఇతరులతో చర్చలు జరిపిన అనంతరం కస్తూరి రంగన్ కమిటీ తన సిఫారసులు రూపొందించింది. 2013లో పర్యావరణ పరిరక్షణ చట్టంలోని 5వ సెక్షన్ కింద వాటిని జారీ చేశారు. నోటిఫై అయిన సిఫారసులు మాధవ్ గాడ్గిల్ కమిటీ నివేదికకు రెండు మార్పులు చేశాయి. మొదటిది– పశ్చిమ కనుమలలోని సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని 59,940 చదరపు కిలోమీటర్లకు కుదించింది. ఉపగ్రహాల ద్వారా తీసిన ఫోటోల ఆధారంగా పశ్చిమ కనుమలలో 60 శాతం తోటలు, వ్యవసాయ భూములు, మానవ ఆవాస ప్రదేశాలుగా ఉన్నాయని నిర్ధారించారు. వీటిని సాంస్కృతిక భూ దృశ్యం (కల్చరల్ ల్యాండ్ స్కేప్ – ప్రకృతి, మానవ చర్యలు రెండిటితో తీర్చిదిద్దబడిన ప్రాంతం)గా వర్గీకరించారు. సదరు భూములను ఉపయోగించుకుంటున్న తీరుతెన్నులను వెనక్కి అంటే పూర్వపు పరిస్థితికి మళ్లించలేము. కనుక మిగిలిన సహజ భూ దృశ్యం (నేచురల్ ల్యాండ్ స్కేప్)ను పరిరక్షించుకోవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ సహజావరణంలో 20 శాతానికి పైగా పరిరక్షిత అడవులు, గ్రామాలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం ఆ పరిరక్షిత గ్రామాల జాబితాను కూడా పేర్కొంది.

పశ్చిమ కనుమలలో అనుమతిస్తున్న, అనుమంతించని కార్యకలాపాల సమగ్ర జాబితాను జారీ చేయకుండా విధ్వంసకర కార్యకలాపాలను చాలవరకు నిషేధించాలని కస్తూరి రంగన్ కమిటీ సిఫారసు చేసింది. దీని ప్రకారం ఇసుక తవ్వకాలతో సహా సకల మైనింగ్ కార్యకలాపాలు నిషిద్ధమయ్యాయి. అలాగే థర్మల్ విద్యుత్కేంద్రాలతో సహా సకల కాలుష్యకారక పరిశ్రమలు, భారీ స్థాయిలో భవన నిర్మాణ, ప్రాజెక్టులు, కొత్త టౌన్‌షిప్ ప్రాజెక్టులు మొదలైనవన్నీ నిషిద్ధమయ్యాయి. కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులపై 2013లో జారీ అయిన నోటిఫికేషన్ ఇప్పటికీ అమలులో ఉన్నది. దానికింద పరిరక్షిత పశ్చిమ కనుమలలో నిషిద్ధ కార్యకలాపాలకు పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. అయితే ఈ విషయంలో ఒక కీలకమార్పు చోటుచేసుకున్నది. అది కేరళ రాష్ట్ర సంబంధితమైనది.

కస్తూరి రంగన్ సిఫారసుల నోటిఫికేషన్‌పై కేరళ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. రక్షిత ప్రాంతాలలో మార్పులు చేయాలని కోరింది. కస్తూరి రంగన్ కమిటీ పేర్కొన్న నేచరల్ ల్యాండ్ స్కేప్‌లోని గ్రామాలను మొత్తంగా పరిరక్షిత ప్రదేశాలుగా వర్గీకరించకూడదని కేరళ ప్రభుత్వం వాదించింది. అందుకు బదులుగా గ్రామ సరిహద్దుల పరిధిలో ఒక ప్రాంతాన్ని పరిరక్షితమైనదిగా, మరొక ప్రాంతాన్ని పరిరక్షితం కానిదిగా పరిగణించాలని కేరళ సూచించింది. ఈ విధంగా కస్తూరి రంగన్ కమిటీ జాబితాలో ఉన్న గ్రామాలలో సున్నిత పర్యావరణ ప్రాంతం ఉంటుంది. ఆ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలను అనుమతించాలి. కేరళ ప్రభుత్వ సూచనను ఆమోదిస్తూ 2013లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం 2018లో ఒక సవరణ చేసింది. కేరళ డిమాండ్ చేసిన విధంగా పరిరక్షిత పశ్చిమ కనుమలలోని 3,115 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించింది.

ఈ నేపథ్యంలో మనం రెండు ప్రధాన విషయాల గురించి మరింత విస్తృతంగా చర్చించవలసి ఉన్నది. ఒకటి– కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులలో కేరళ కోరిన సవరణే వయనాడ్ విషాదానికి దారితీసిందా? రెండు– వాతావరణ మార్పు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ కాలంలో ఏ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ నమూనాకు ప్రజల మద్దతు ఖాయంగా లభిస్తుంది? మరింత స్పష్టంగా చెప్పాలంటే సున్నిత పర్యావరణ ప్రాంతాలలో అభివృద్ధి నమూనాను ఎలా రూపొందించుకోవాలి?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

నాలుగు దశాబ్దాలైనా అదే కథ!

గత నెల 27న జరిగిన నీతి ఆయోగ్ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరయినా తన ఉపన్యాసం పూర్తికాక ముందే మైక్ కట్ చేశారని వాకౌట్ చేశారు.

సరిగ్గా నలభై సంవత్సరాల క్రితం ఇటువంటి సంఘటన జరిగిన సందర్భం ఒకటి గుర్తుకొస్తున్నది. జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా నాయకత్వాన గల మంత్రివర్గాన్ని రద్దు చేసి, ఆయన బావ జి.ఎం. షాను ముఖ్యమంత్రిని చేసింది అప్పటి ఇందిరాగాంధీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం. దానిపై నలుగురు కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు; చరణ్‌సింగ్, చంద్రశేఖర్, బిజూ పట్నాయక్, వాజ్‌పేయి వంటి 19 మంది ప్రతిపక్ష నేతలు ఎన్టీఆర్ అధ్యక్షతన ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జూలై 10న సమావేశమై ఈ దుందుడుకు చర్యను ఖండిస్తూ తీర్మానించి, ఈ దుశ్చర్యను సరిదిద్దవలసిందిగా రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్‌ను కలిసి వివరించాలని నిర్ణయించారు.



ఆ తరువాత 12వ తేదీన జాతీయ అభివృద్ధి మండలి సమావేశం జరిగింది. దానికి ముఖ్యమంత్రుల ఉపన్యాసాన్ని ముందుగానే తయారుచేసి, దానిని ముద్రించి అచ్చుప్రతులను కూడా కేంద్ర ప్రభుత్వానికి, ప్రణాళికా సంఘానికి అందజేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రణాళికా శాఖ, ఆర్థిక శాఖ అధికారులతోనూ చర్చించి, ఎన్టీఆర్ ఉపన్యాసాన్ని రూపొందించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఇందిరాగాంధీ ముందుగా అధ్యక్షోపన్యాసం చేశాక, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్న శంకరరావు చవాన్ మాట్లాడారు. అకారాది క్రమంలో తొలుత మాట్లాడిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ముందుగా రూపొందించిన ఉపన్యాసాన్ని పక్కన పడేసి, జేబులో నుంచి చిన్న కాగితాన్ని తీసి రాజకీయ ఉపన్యాసం మొదలుపెట్టారు. "జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కేంద్రం కుట్ర చేసి పడగొట్టి, జి.ఎం. షాకు పట్టం గట్టడాన్ని తీవ్రంగా ఖండించి, ఈ దుందుడుకు దూకుడులో లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన జగ్‌మోహన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తరువాత సర్కారియా కమిషన్ సిఫార్సుల ప్రకారం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను పునర్నిర్వచించాలని రాజకీయ ఉపన్యాసం చేశారు.

ఇటువంటి రాజకీయ ఉపన్యాసాలకు, చర్చలకు ఇది వేదిక కాదని, చర్చలను తప్పుతోవకు మళ్లించవద్దని, ప్రధాని పదే పదే హెచ్చరించినా, తన ధోరణిలోనే ఉపన్యాసాన్ని కొనసాగించి, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేశారు. ఎన్టీఆర్ ఉపన్యాసాన్ని అడ్డుకోరాదని ప్రధానితో వాదించిన ముగ్గురు ముఖ్యమంత్రులు– జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, నృపేన్ చక్రవర్తి– కూడా ఎన్టీఆర్‌తో పాటే వాకౌట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు కూడా సమావేశం నుంచి ముఖ్యమంత్రితో బయటకు రావడానికి లేస్తే, వారిని కూర్చోమని ఎన్టీఆర్ సైగ చేశారు. తరువాత సమావేశం ప్రతిపక్ష ముఖ్యమంత్రుల బాధ్యతారహిత ప్రవర్తనను ఖండిస్తూ తీర్మానం చేసింది. సమావేశంలో ప్రధాని, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గుసగుసలాడుకొని వాకౌట్ చేసిన ముఖ్యమంత్రులకు సహాయకులుగా వచ్చిన ఆయా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా సమావేశం నుంచి బయటకు వెళ్లాలని ప్రకటించారు.

రాజకీయ ఉపన్యాసం సంఘటనతో ఇందిరాగాంధీ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న కేంద్ర-రాష్ట్ర సంబంధాలు మరింత సంక్లిష్టమయ్యాయి. కొద్ది రోజులకే ఎన్టీఆర్ గుండె శస్త్రచికిత్సకు అమెరికా వెళ్లడం, ఆయన అక్కడుండగానే ఇక్కడ ఆగస్టు సంక్షోభం ఏర్పడడం, స్వాతంత్ర్య దినోత్సవం నాటికి హైదరాబాద్‌కు చేరుకున్న ఎన్టీఆర్‌కు ఇటువంటి పరిస్థితి ఎదురవడం– ఈ పరిణామాలన్నీ చూశాం. చివరిగా చెప్పవచ్చేదేమంటే నలభై ఏళ్లుగా అదే కథ నడుస్తున్నది.

– డాక్టర్ యలమంచిలి శివాజీ

ప్రజా కలెక్టర్ 'పట్టాల' చంద్రయ్య

"ఎవరైనా మిమ్మల్ని చలువరాతి మందిరాల్లోకి ఆహ్వానిస్తే వెళ్ళండి, కానీ వెళ్ళేముందు మీరు ఉంటున్న పూరి గుడిసెకు నిప్పు పెట్టి మాత్రం వెళ్లవద్దు" అని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ తన జాతి జనులకు జాగ్రత్త చెప్పాడు. కొమ్మ పట్టుకొని, ఉన్నత స్థానానికి చేరుకోవడంతో పాటు మరొకరికి కొమ్మగా మారి, చేయూతనందించాలని దళిత విద్యావంతులకు ఆయన పిలుపునిచ్చాడు. ఈ విధమైన ఎరుకతో గురుతరమైన బాధ్యతతో సమాజ ప్రగతికి జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి కత్తి చంద్రయ్య. తల్లి, తండ్రి, గురువు, బంధువు, సోదరుడు, యముడు… వీరందరి విశిష్ట లక్షణాలను పుణికి పుచ్చుకున్నవారే ఉత్తమ అధికారి అన్న నీతిశాస్త్ర సూత్రానికి నిలువెత్తు నిదర్శనం చంద్రయ్య. కలెక్టర్ బంగాళాకే పరిమితం కాకుండా కటిక పేదరికంలో కునారిల్లుతున్న అణగారినవర్గాల అభ్యుదయపథంలో మడమ తిప్పకుండా పయనించిన బహుదూరపు బాటసారి చంద్రయ్య. పరిపాలన అంటే నిరుపేదల ఆలనా పాలనయేనని నిరూపించిన అరుదైన కలెక్టర్‌గా మన్ననలందుకున్నాడు. శిఖరాలను అధిరోహించటం గొప్పతనం కాదని, అందుకు కారణమైన పునాదులను పటిష్టపరచాలని తన కార్యాచరణతో రుజువు చేసిన మానవతామూర్తి. "పాలనా సామర్థ్యంలో, పౌరసేవలో, సంఘ సంస్కరణలో పాండిత్యంలో, రచనా వైభవంలో అన్నింటికీ మించి తాడిత, పీడిత ప్రజాబంధుగా" కత్తి చంద్రయ్య రాణకెక్కాడని ఏబీకే ప్రసాద్ కితాబిచ్చాడు (ఏబీకే సంపాదకీయాలు). చంద్రయ్య జీవన పుటలను పరిశీలిస్తే సమున్నత లక్ష్యసాధనా విధానం అర్థమవుతుంది. పేదరికం, అంటరానితనం వంటి ముళ్ళకంచెలను, పెను అవరోధాలను అధిగమించి, జ్ఞానైక దృష్టితో జీవితాన్ని గెలిచే స్ఫూర్తి కలుగుతుంది.

పాత గుంటూరు జిల్లా ఒంగోలు సమీపంలోని పోతవరం గ్రామంలో పేరయ్య, రాగమ్మ దంపతులకు 1924, జూలై 6న కత్తి చంద్రయ్య జన్మించాడు. ఒక కుగ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగివచ్చిన చంద్రయ్య, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి, మద్రాస్ విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యనభ్యసించాడు. మద్రాస్ ప్రెసిడెన్సీ సివిల్ సర్వీస్‌కు ఎంపికై మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో కీలక అధికారిగా ప్రభుత్వ ప్రశంసలందుకున్నాడు. నిబద్ధత కలిగిన కలెక్టర్‌గా ప్రజల నీరాజనాలందుకున్నాడు. ప్రజలకు తలలో నాలుకలా, బడుగు బలహీన వర్గాలకు కొంగుబంగారంగా వెలుగొందాడు. ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్, మౌలానా అబుల్ కలాం అజాద్ ఓరియంటల్ స్టడీ రీసెర్చ్ సెంటర్ వంటి సంస్థల్లో క్రియాశీలక సభ్యుడిగా ఆ సంస్థల పురోగతికి చంద్రయ్య విస్తృతంగా కృషి చేశాడు.

ప్రకాశం, గుంటూరు, ఉమ్మడి హైదరాబాద్ కలెక్టర్‌గా ఆయా జిల్లాల సర్వతోముఖ వికాసానికి చంద్రయ్య విశేషమైన సేవలందించాడు. ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్‌గా ఆయన చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఎంతో సూక్ష్మపరిశీలనతో, ముందుచూపుతో అంకితభావంతో జిల్లా అభివృద్ధికి చంద్రయ్య నిరంతరం పరిశ్రమించాడు. ఏ జిల్లాలో కలెక్టర్‌గా విధులు చేపట్టినా ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్ర వేశాడు.



మద్రాస్ ప్రెసిడెన్సీ సివిల్ సర్వీస్‌కు ఎంపికై మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో కీలక అధికారిగా కత్తి చంద్రయ్య ప్రభుత్వ ప్రశంసలందుకున్నాడు. నిబద్ధత కలిగిన కలెక్టర్‌గా ప్రజల నీరాజనాలందుకున్నాడు. నిరుపేదలకు, దళితులకు గిరిజనులకు విస్తృతంగా భూమిని పంపిణీ చేశాడు. అనేక రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని, తీవ్రమైన బెదిరింపులను లెక్కజేయకుండా వేలాది ఎకరాల భూమిని అణగారిన వర్గాల ప్రజలకు పట్టాలుగా పంచిపెట్టాడు.

వ్యవసాయ కూలీలుగా మాత్రమే మిగిలిపోకుండా, దళితులు భూయజమానులుగా మారాలని చంద్రయ్య భావించాడు. "విద్య మన భవిష్యత్తు, భూమి మన వర్తమానమూ, భవిష్యత్" అని ప్రబోధించిన అంబేడ్కర్ దార్శనికతను తన పాలనకు అన్వయించుకొని తదనుగుణమైన ధ్యేయంతో కత్తి చంద్రయ్య ప్రజాసేవలో నిమగ్నమయ్యాడు. నిరుపేదలకు, దళితులకు గిరిజనులకు విస్తృతంగా భూమిని పంపిణీ చేశాడు. అనేక రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని, తీవ్రమైన బెదిరింపులను లెక్కజేయకుండా వేలాది ఎకరాల భూమిని అణగారిన వర్గాల ప్రజలకు పట్టాలుగా పంచిపెట్టాడు. అందుకే ప్రకాశం జిల్లాలో 'పట్టాల చంద్రయ్య'గా ప్రఖ్యాతి చెందాడు. పేద ప్రజలు ప్రేమతో ఇచ్చిన ఈ అరుదైన బిరుదు ఎన్నో పురస్కారాలకంటే ఎంతో విశిష్టమైనది. ఈ బిరుదులో కత్తి చంద్రయ్య పాలనాగరిమ అర్థమవుతుంది. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో మాల, మాదిగ, యానాది వాడల్లో, బహుజన, ముస్లిం ప్రజలు నివాసముండే ప్రాంతాల్లో అనేక కాలనీలు నిర్మించి, వందలమందికి చంద్రయ్య గృహవసతి కల్పించాడు.

పాలనాదక్షుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కత్తి చంద్రయ్య గొప్ప పరిశోధకుడు, రచయిత అని చాలామందికి తెలియదు. నాలుగు శతాబ్దాల మహోన్నత హైదరాబాద్ చరిత్ర (Hyderabad 400 years of glorious years) అనే గ్రంథం చంద్రయ్య అపారమైన పరిశోధనా పటిమకు తార్కాణం. కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల నేతృత్వంలోని హైదరాబాద్ చారిత్రిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను, ఈ బృహత్ గ్రంథంలో చంద్రయ్య సముచితంగా విశ్లేషించాడు. రాజుల ప్రణయగాథలు, ప్రజల బాధలతో పాటు, నగరంలో వెల్లివిరిసిన మతసామరస్యం, జాతీయ సమైక్యత, మొగల్, ఇండో సొరసెనిక్ శిల్పకళావైభవం తదితర అంశాలను ఈ పుస్తకంలో చంద్రయ్య వివరంగా సమీక్షించాడు. హైదరాబాద్‌లో లౌకిక భావనలకు పాదులు వేసిన సూఫీ ప్రవక్తల ఔన్నత్యం గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించాడు. "Indian contribution to Islamic Calligraphy", "Ornamentation in Indian epigraphy" వంటి క్లిష్టమైన అంశాలపై కూడా చంద్రయ్య లోతుగా అధ్యయనం చేసి విలువైన రచనలు చేశాడు. దళితుల శ్రమ పునాదిపైనే దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా నిలబడి ఉందని ప్రతిపాదిస్తూ చంద్రయ్య రాసిన 'Dalit Economics' అముద్రిత గ్రంథం సామాజికశాస్త్ర విద్యార్థులకు సరికొత్త అవగాహన కలిగిస్తుంది. 'భారతీయ సంస్కృతిలో కుల ప్రభావం'పై ఆంగ్లంలో చంద్రయ్య రాసిన పరిశోధనాపత్రాన్ని బూక్యా చినవెంకటేశ్వర్లు తెలుగులోకి అనువదించాడు. మతం, కులం, సంస్కృతుల స్వరూప స్వభావాలను, పరస్పర ప్రభావాన్ని, వాటినుసరించి మానవాళిని ఆవరించిన చీకటి వెలుగులను ఈ పత్రంలో ఆయన వివేచించాడు. భారతదేశంలో కులం గాలిలో కలిసివుందని, దీని అంటువ్యాధి లక్షణం హిందూ మతాన్ని దాటి ముస్లిం, క్రైస్తవ మతాలకు కూడా సోకిందన్న హెర్బర్ట్ రిస్లే సూత్రీకరణలను ఇందులో చంద్రయ్య సవివరంగా వ్యాఖ్యానించాడు. పదవీ విరమణ తరువాత ప్రముఖ ఆంగ్ల పత్రికల్లో చంద్రయ్య ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలు రాశాడు. ఈ ప్రజా కలెక్టర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కత్తి కల్యాణ్ రాసిన 'నా అన్వేషణలో కత్తి చంద్రయ్య' అనే పుస్తకం చదివితే వీరి జీవనయానం కొంత వరకు తెలుసుకోవచ్చు.

● డాక్టర్ కోయి కోటేశ్వరరావు
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
(నేడు ఒంగోల్ ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కత్తి చంద్రయ్య శతజయంతి సభ)

జిల్లా వ్యాప్తంగా తిరంగా పండుగ వైభవంగా జరిగింది. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రేకెత్తించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్తేజపరిచాయి. దేశభక్తిని పెంపొందించేలా కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోలీసు కవాతు ప్రతిఒక్కరిలో జాతీయ స్ఫూర్తిని రగిలించింది. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో చిన్నారుల ప్రదర్శనలు ఆనాటి వీరుల త్యాగాలను చాటి చెప్పాయి. ఈ వేడుకను చూసిన జనం జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ దేశభక్తిని ప్రదర్శించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఈ స్ఫూర్తివంతమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో.. పార్టీ ఆఫీసుల్లో... విద్యా సంస్థల్లో... ప్రైవేటు సంస్థల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.

మా తుఝే సలాం!




ఐఎంజీ స్టేడియంలో జాతీయ పతాకావిష్కరణలో చంద్రబాబు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జిల్లాలో వైభవంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు

- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు
- ఆకట్టుకున్న కళారూపాలు



పోలీసు కవాతు



చాక్లెట్లు పంచుతున్న కలెక్టర్ సృజన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఐఎంజీ స్టేడియంలో సీఎం చంద్రబాబు నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ నిధి మీనాతో కలిసి కలెక్టర్ సృజన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేడుకల్లో పాల్గొన్న పిల్లలకు మొక్కలు, చాక్లెట్లు పంచారు. మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు.

- ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి కలెక్టర్ సృజన, డీసీపీ హరికృష్ణ పతకాలను అందజేశారు. విజయవాడ ఏఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ఈ పతకాలను అందజేశారు.



తిరంగాతో ఆనందంగా..



రెండవ బహుమతి

రెండో బహుమతి పొందిన పశుసంవర్ధక శాఖ శకటం



మూడవ బహుమతి

మూడో బహుమతి పొందిన మహిళాభివృద్ధి శాఖ శకటం





అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ సామాన్యులతో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజలతో మమేకమై..

పేదల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందని సీఎం చంద్రబాబు హామీ

- అల్పాదాయం ఉన్నవారికి బాసటగా ఉంటామని సీఎం భరోసా
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహనిర్మాణ పనులు పెరిగాయా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా
- ఈ-వెహికల్స్ ద్వారా చిరు వ్యాపారాలు చేసుకోవాలని సూచన
- గుడివాడలో అన్న క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి చంద్రబాబు దంపతుల భోజనం
- అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు ఎంపీ, ఎమ్మెల్యేల విరాళం రూ.50 లక్షలు

మచిలీపట్నం/గుడివాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో ముఖ్యమంత్రి పర్యటన అంటే పోలీసుల ఆంక్షలు, పరదాలు కట్టి జనం రోడ్లపైకి రాకుండా నిబంధనలు, ప్రతిపక్ష నాయకుల ముందస్తు గృహ నిర్బంధాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుడివాడలో గురువారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సమయంలో ఎలాంటి ఆర్భాటాలూ లేవు. అన్న క్యాంటీన్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యారు. పేదలకు అన్నక్యాంటీన్‌లు గతంలో ఎలా ఉపయోగపడ్డాయి, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్లను మూసివేయడంతో ఎటువంటి ఇబ్బందులు పడ్డారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీఎం సతీమణి భువనేశ్వరి స్వయంగా పేదలకు భోజనం వడ్డించారు. వారితో పాటే కలిసి సీఎం దంపతులు కూడా భోజనం చేశారు. పేదలకు మేలు చేసేందుకు, వారికి మూడు పూటలా రూ.15 ఖర్చుతో పట్టెడన్నం పెట్టేందుకు జీవితాంతం కృషి చేస్తానని సీఎం ఈ సందర్భంగా అన్నారు.

● ప్రజల బాధలు తెలుసుకుంటూ..

ముఖ్యమంత్రి చంద్రబాబు చిరువ్యాపారులు, వివిధ షాపుల్లో పనిచేసే కార్మికులతో మాట్లాడి వారికి వచ్చే ఆదాయం, కుటుంబ నిర్వహణ కోసం అయ్యే రోజువారీ ఖర్చు, అన్న క్యాంటీన్‌లో తక్కువ ధరకే భోజనం పెడితే వారికి జరిగే మేలును ప్రజలతో మాట్లాడి వివరాలు రాబట్టారు. గిల్టు నగల వ్యాపారం చేసే తమ్మిశెట్టి నాగమణి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి గిల్టు నగలు విక్రయిస్తూ ఉంటానని, గుడివాడ చేరుకుని హోటల్‌లో భోజనం చేస్తుంటానని దీంతో ఖర్చు పెరుగుతోందని అన్నారు. అన్న క్యాంటీన్‌లు అందుబాటులోకి రావడంతో తనకు ఖర్చులు కలిసి వస్తాయని ఆమె అన్నారు. ఇద్దరు పిల్లలను పోషించడం కష్టతరంగా మారిందన్నారు. నాగమణికి ఎలక్ట్రికల్ స్కూటీని కొని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాలాజీకి సీఎం సూచించారు. చిన్నపాటి టిఫిన్ బండి నడుపుకునే తాను సరైన పెట్టుబడి లేక, తన భర్త ఇసుక వ్యాపారం కూడా దెబ్బతినడంతో ఆర్థికంగా కుంగిపోయామని, దుకాణంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గాదంశెట్టి విజయలక్ష్మీ చంద్రబాబుకు మొరపెట్టుకున్నారు. గుడివాడ పట్టణంలో సెక్యూరిటీ గార్డుగా తాను పనిచేస్తున్నానని, గతంలో అన్న క్యాంటీన్‌లో ఐదు రూపాయలకు భోజనం చేసేవాడినని ఆశిష్ తెలిపారు. గత ప్రభుత్వం అనాలోచిత అన్న క్యాంటీన్‌ను మూసివేయడంతో తనలాంటి చిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. తిరిగి అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, డైరెక్టర్ హరినారాయణ, సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న, అక్షయపాత్రట్రస్ట్ సీఈవో కాంతేయదాస, పురపాలకశాఖ రీజనల్‌డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, గుడివాడ మునిసిపల్ కమీషనర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుడివాడకు ప్రాధాన్యం

టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు పుట్టినగడ్డ అయిన గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రంలో మొదటిసారి గుడివాడలోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఎన్టీఆర్ రూ.2లకు కిలో బియ్యం అందిస్తే, చంద్రబాబు కేవలం రూ.5లకే భోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిమాట్లాడుతూ కృష్ణాజిల్లా శివారుప్రాంతం కావడంతో తాగునీటి సమస్య ఉందని, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పెనమలూరులను యూనిట్‌గా తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరారు.

అటవీశాఖలో ఇద్దరిపై వేటు

రిజర్వు ఫారెస్టులో అక్రమాలపై నివేదిక

ఉన్నతాధికారులు సీరియస్

విజయవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం, జి.కొండూరు మండలంలో వైసీపీ పాలనలో రిజర్వు ఫారెస్టులో జరిగిన అక్రమాలపై అటవీశాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలపై అధికారులు స్పందించారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడులలో జరిగిన అక్రమ తవ్వకాల్లో బీట్ ఆఫీసర్ రంపవరపు సునీతపై అటవీశాఖ ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో ఇక్కడ డిప్యూటీ రేంజర్‌గా పనిచేసిన విజయశేఖర్‌పైనా చర్యలకు సిద్ధమవుతున్నారు. 2019 నుంచి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వరకు కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడు, జి.కొండూరు మండలం వెలగలేరులో ఉన్న రిజర్వు ఫారెస్టులో వైసీపీ నేతలు విచ్చలవిడిగా తవ్వకాలు చేశారు. కొండలను గుల్ల చేశారు. అటవీశాఖ భూములకు, రెవెన్యూ భూములకు మధ్య ఉన్న సరిహద్దు రాళ్లను తొలగించారు. పగలు, రాత్రి తేడా లేకుండా అటవీశాఖకు చెందిన కొండలను గ్రావెల్ కోసం పిండి చేశారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసిన వారిని వైసీపీ గూండాలు బెదిరించారు. జిల్లా అటవీశాఖాధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా గ్రామాలకు చెందినవారు అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు ఎలాంటి అక్రమాలూ జరగలేదని నివేదికలు ఇచ్చారు. చివరికి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్త జోక్యం చేసుకోవడంతో అటవీశాఖ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అటవీశాఖ విజిలెన్స్ అధికారులు ఇక్కడ సర్వే చేసి సరిహద్దు రాళ్లను మాయం చేసిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. రెవెన్యూ భూములను దాటుకుని వచ్చి రిజర్వు ఫారెస్టులో తవ్వకాలు చేశారని గుర్తించారు. ఈ నివేదికను ఎన్జీటీ, లోకాయుక్తకు అందజేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఇక్కడ బీట్ ఆఫీసర్‌గా ఉన్న సునీతను సస్పెండ్ చేశారు. ఆ సమయంలో ఇక్కడ డిప్యూటీ రేంజర్‌గా పనిచేసిన విజయశేఖర్‌ను అధికారులు ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగించారు. ఏలూరు జిల్లాలో జామాయిల్ చెట్ల లెక్కల్లో తేడాలు రావడంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు. విజయవాడ రూరల్ మండలంలోని రిజర్వు ఫారెస్టులో జరిగిన అక్రమాల్లోను విజయశేఖర్ పాత్ర ఉండడంతో దానిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఫైళ్లను సిద్ధం చేస్తున్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లో వాహన్ స్కామ్!



వైసీపీ హయాంలో బెజవాడ, సూళ్లూరుపేటల కేంద్రంగా రవాణా శాఖలో జాతీయ స్థాయిలో జరిగిన 'వాహన్ స్కామ్' వ్యవహారం మరుగున పడింది. ప్రాథమికంగా స్కామ్ జరిగిందని వెలుగు చూసినా.. తూతూ మంత్రపు చర్యలు చేపట్టారే కానీ సమగ్ర విచారణకు ఆదేశించలేదు. అప్పటి రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్న సీతారామాంజనేయులు జాతీయ స్థాయి కుంభకోణంపై సమగ్ర విచారణకు ఆదేశించకపోవటంతో రవాణా శాఖలో అతిపెద్ద స్కామ్ మూలన పడిపోయింది. ఈ స్కామ్‌లో లబ్ధి పొందింది వైసీపీ నేతలు, వారి బంధువులే. దీనికి సహకరించిన ప్రైవేటు మాఫియా, రవాణా శాఖ పరంగా పాత్ర పోషించిన అధికారులు 'సేఫ్‌జోన్'లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే అక్రమార్కులు బయటికొస్తారు.

వాహనాలే లేకుండా 365 వాహనాల పేరుతో ఆర్‌సీలు

- వైసీపీ నాయకుల బంధువులకే నకిలీ సీ బుక్‌లు
- పట్టించుకోని రవాణా శాఖ కమిషనర్
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నీరుగారిన విచారణ
- స్కామ్‌లో పాత్రధారులు, సూత్రధారులంతా సేఫ్
- నకిలీ ఆర్‌సీలు పొందిన వారిపైనా కేసులు లేవు
- సమగ్ర విచారణకు ఆదేశిస్తేనే అక్రమార్కులు దొరికేది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాహనాలు ఏమీ లేకుండా మొత్తం 365 వాహనాలు ఉన్నట్టుగా చూపి లేని ఈ-వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్‌సీ) ఇప్పించారు. కేంద్ర ప్రభుత్వ వాహన రిజిస్ట్రేషన్ పోర్టల్ అయిన 'వాహన్'ను ట్యాంపరింగ్ చేసి ఈ భారీ కుంభకోణానికి ఒడిగట్టారు. ఈశాన్య రాష్ట్రాలైన ఉత్తరాంచల్, అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో అక్కడ లేని వాహనాలను ఉన్నట్టుగా వాహన్ వెబ్ పోర్టల్‌లో చూపించారు. వాహన్ పోర్టల్‌ను ట్యాంపరింగ్ చేసి దొంగ ఛాసిస్, ఇంజిన్ నెంబర్లతో నమోదు చేయించారు. ఇవన్నీ దాదాపుగా ఆయిల్ ట్యాంకర్లకు సంబంధించినవి. ఏపీకి చెందిన వైసీపీ నేతలు, వారి బంధువులు కొందరు ఆయిల్ కంపెనీల్లో ట్యాంకర్ల అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. టెండర్ల నిబంధనల ప్రకారం కాలపరిమితి తీరిన వాహనాల స్థానంలో తిరిగి తగిన కాలపరిమితి ఉన్న వాహనాలను ప్రవేశపెట్టాల్సి ఉంది. దీంతో వీరంతా విజయవాడలోని ముద్ర సుబ్బారావు అండ్ కో మాఫియాను ఆశ్రయించారు. ముద్ర సుబ్బారావు అండ్ కో గ్యాంగ్ వాహన్ పోర్టల్‌ను ట్యాంపరింగ్ చేయటంతో పాటు లేని వాహనాలను రిజిస్ట్రేషన్లు చేయించింది. విజయవాడ కేంద్రంగా ఈ వ్యవహారం నడిపిస్తే అనుమానం వస్తుందన్న ఉద్దేశంతో.. ఇక్కడి నుంచి కేవలం ఆయా వాహనాలకు సంబంధించి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయించాడు. అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సూళ్లురుపేటలో వీటికి ఫిజికల్ వెరిఫికేషన్ చేయించాడు. అసలు వాహనాలే లేకపోయినా.. అక్కడి అవినీతి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) నాయక్ వాహనాలను పరిశీలించినట్టుగా ఫిజికల్ వెరిఫికేషన్, ఫిట్నెస్ కూడా ఇచ్చేశారు. ఈ వ్యవహారంలో అక్కడి ఆర్టీవో కూడా సహకారం అందించారు. విజయవాడలో 40 వాహనాల వరకు అసలు అవి లేకుండానే ఉన్నట్టుగా స్థానిక అధికారి విఠల్ ద్వారా వాహన్ సైట్‌ను ట్యాంపరింగ్ చేయించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ జాతీయ స్థాయి కుంభకోణాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకు వచ్చింది. దీనిపై రవాణా శాఖ అధికారులు ప్రాథమిక విచారణలో స్కామ్ జరిగినట్టుగా వెలుగుచూసింది. ఈ వ్యవహారంపై మరింత సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉందని రిపోర్టు ఇచ్చారు. సమగ్ర విచారణకు ఆదేశిస్తామని చెప్పిన అప్పటి రవాణా శాఖ కమిషనర్ సీతారామాంజనేయులు ఆ తర్వాత వదిలేశారు. ఈ అక్రమంలో 365 మందికిపైగా ఆయాచిత లబ్ధి పొందారు. వైసీపీ నాయకులు, వారి బంధువులు పొందిన అక్రమ ఆర్‌సీల కారణంగా ఆయిల్ కంపెనీలకు కొత్త వాహనాలు కొనకుండానే.. ఉన్న వాహనాలకే ఛాసిస్, ఇంజిన్ నెంబర్లను మార్ఫింగ్ చేయించారు. తాము పొందిన నకిలీ ఆర్‌సీలను సమర్పించి పాత వాహనాల లైఫ్‌ను పెంచుకున్నారు.

సేఫ్ జోన్‌లో.. దొంగలు

ముద్ర సుబ్బారావు అండ్ గ్యాంగ్‌పై సాధారణ 420 కేసు పెట్టారు. ఆయన పది రోజులు కస్టడీలో ఉండి బయటకు వచ్చేశాడు. ఈ స్కామ్‌లో ప్రధాన పాత్రధారి ముద్ర సుబ్బారావు దర్జాగా ఇపుడు బయట తిరుగుతున్నాడు. మళ్లీ రవాణాశాఖ ఏజెంట్‌గా ఇందిరాగాంధీ స్టేడియం కాంప్లెక్స్‌లో పనిచేస్తున్నాడు. రవాణా శాఖ పరంగా సహకారం అందించిన అవినీతి అధికారులలో ఒకరిద్దరిపైనే వేటు పడింది. ఈ వ్యవహారంతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న మిగిలిన వారంతా సేఫ్ జోన్‌లో ఉన్నారు. పెండింగ్ విచారణల పేరుతో విజయవాడకు చెందిన విఠల్ అనే అవినీతి ఉద్యోగి మళ్లీ ఉద్యోగంలో చేరాడు.

కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లకుండా చేసి..

రవాణా వాహనాల డేటాబేస్ పోర్టల్ అయిన కేంద్ర ప్రభుత్వ వాహన్ సైట్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే.. ఇంత పెద్ద విషయాన్ని కేంద్ర రవాణా శాఖ దృష్టికి ఏపీ రవాణా శాఖ అధికారులు తీసుకు వెళ్లలేదు. ఈ వ్యవహారంలో వైసీపీ నేతల పాత్ర ఉండటంతో కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశిస్తుందేమోనన్న ఉద్దేశంతో గప్‌చుప్‌గా ఉంచారు. దేశంలోనే అతిపెద్ద రవాణా వాహనాల స్కామ్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నుంచి అవార్డు అందుకుంటున్న ఏడీసీపీ కృష్ణమూర్తి నాయుడు | బి.శ్రీనాథుడు ఎక్సైజ్ శాఖ | సీహెచ్ శైలజ జిల్లా కో-ఆపరేటివ్ | డీఎం వెంకటేశ్వర్లు సివిల్ సప్లయిస్ | జె సుమన్ డీసీవో | శ్రీనివాసరెడ్డి డీసీవో | శైలజ శ్రీ కమర్షియల్ టాక్స్ | సురేంద్రనాథ్ డిఐపీఆర్వో | డీఎంఎఫ్ వి జయకుమారి | డీఎంహెచ్‌వో సుహాసిని | శివప్రసాద్‌యాదవ్ డీపీవో | వి.శ్రీనివాసరావు డీఆర్వో



మోహన్‌బాబు, డీఎస్‌వో | జె.సునీత, డ్వామా పీడీ | రజనికుమారి హౌసింగ్ పీడీ | ఉమాదేవి ఐసీడీఎస్ పీడీ | కె.రవి | కె.శ్రీనివాసరావు డీఆర్‌డీఏ పీడీ | కె.శ్రీనివాస్, సర్వేయర్ | ఇ.కిరణ్మయి, డిప్యూటీ కలెక్టర్ | కె.ప్రియాంక ఎల్‌డీఎం | ఎం.పురేంద్ర, డీటీసీ | రవీంద్ర, నందిగామ ఆర్డీవో | పి.బాలాజీకుమార్, జిల్లా హార్టికల్చర్ | పి.శ్రీనివాసరావు, ఈఈ పీసీబీ



పీఎం సుభాని, ఏపీ ఎంఐపీ పీడీ | ఎస్.నాగమణెమ్మ, జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసర్ | ఎస్‌డీ తేజేశ్వరరావు, ఏసీపీ క్రైమ్ | శుభం కుమార్ అసిస్టెంట్ కలెక్టర్ | భవానీ శంకర్, సబ్ కలెక్టర్ | ఎస్వీ మోహన్‌రావు డీపీఆర్‌వో | మాధవి, తిరువూరు ఆర్డీవో | పీవీ ప్రసాద్, ఏపీ సూపర్‌వైజర్

ఉత్తమ పనితీరుకు పురస్కారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందితో పాటు సామాజిక సేవలో భాగస్వాములౌతున్న విశిష్ట వ్యక్తులకు కలెక్టర్ సృజన ప్రశంశా పత్రాలను అందజేశారు. ఎన్నికల సమయంలో విశేష సేవ లందించిన ఆర్వోలు, ఏఆర్వోలు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, కలెక్టరేట్, సీపీ కార్యాలయ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తదితర సంస్థల ప్రతినిధులకు ప్రశంశాపత్రాలను అందజేశారు. అవార్డుల కార్యక్రమంలో జేసీ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకకు హాజరైన జనం.. ఆనందోత్సాహాలతో కేరింతలు..



హాజరైన నారా భువనేశ్వరి..



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన, ఎంపీ కేశినేని చిన్ని

అన్నివర్గాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా వేడుకలు : మంత్రి కొల్లు రవీంద్ర



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం, ఆగస్టు 15 : అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, పేదల సంక్షేమం కోసం విప్లవాత్మక పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 240939 మందికి ఆగస్టు నెలలో రూ.162.49 కోట్లు పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఐదు కొత్త రీచ్‌లు గుర్తించి, 14.55 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నిజమైన రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ-క్రాప్ నమోదును డిజిటల్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 70 వేల మంది రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటివరకు జిల్లాలో 53563 మందికి ఈ కార్డులు పంపిణీ చేశామని, 5213మంది రైతులకు రూ.21 కోట్ల పంట రుణాలు అందజేసినట్లు మంత్రి వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగర మాల ఫేజ్-2 కింద రూ.421.17 కోట్ల వ్యయంతో గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. జిల్లాలో సాగునీటి కాలువలు, డ్రైనేజీల నిర్వహణ కోసం ఈ ఆర్థిక సంవత్సర కార్యచరణ ప్రణాళికలో భాగంగా రూ.26.27 కోట్లతో 123 పనులు చేపట్టామని, కాలువ గట్లు పటిష్టపర్చేందుకు 43.33 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించామని మంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు అమలు చేస్తామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా సామాన్యుడికి మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ఆకట్టుకున్న పోలీసు కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో జరిగిన పోలీసు కవాతు, పలు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంత్రి పోలీసుల సంక్షేమానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. 8 మంది మత్స్యకార మృతుల కుటుంబాలకు చంద్రన్న బీమా కింద రూ.40 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులతో కలిసి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.

పింగళి నేటి తరానికి స్ఫూర్తి

» మంత్రి కొల్లు రవీంద్ర



పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రవీంద్ర తదితరులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 15 : జాతీయ పతాక నిర్మాత కృష్ణాజిల్లా వాసి కావడం ఎంతో గర్వించదగిన విషయమని, పింగళి వెంకయ్యను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం జాతీయ భావాలను పెంపొందించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మూడు స్తంభాల నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు ఏర్పాటు చేసిన 105 అడుగుల జెండా స్థూపంపై భారీ జాతీయ పతాకను మంత్రి ఆవిష్కరించగా.. పింగళి వెంకయ్య విగ్రహాన్ని కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, బర్మా వెంకయ్యగా పేరు పొందిన పింగళి వెంకయ్య గాంధీజీ పిలుపు మేరకు జాతీయ జెండాను రూపొందించి ఇచ్చారని, ఆయన రూపొందించిన జాతీయ జెండా భారతదేశమంతా రెపరెపలాడుతోందన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విజయవాడ జాతీయ రహదారిపై అందరికీ కనబడే నిలువెత్తు జెండా స్థూపం, పింగళి వెంకయ్య విగ్రహం దేశభక్తిని ప్రబోధిస్తుందన్నారు. గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జనసేన నేత బండి రామకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, మోటమర్రి బాబాప్రసాద్, మాదివాడ రాము, పింగళి కుటుంబ సభ్యురాలు సుశీల, ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో పంద్రాగస్టు వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి

» కేంద్ర మంత్రి నుంచి గుర్తింపు, సత్కారం



కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ నుంచి సత్కారం అందుకుంటున్న చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి

చల్లపల్లి, ఆగస్టు 15 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన పంద్రాగస్టు వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి హాజరయ్యారు. సుపరిపాలన, పచ్చదనం, పరిశుభ్రత తదితర అంశాల ప్రాతిపదికగా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణకుమారిని ఢిల్లీ వేడుకలకు ఎంపికచేశారు. భర్త పైడిపాముల రాజేంద్రతో కలిసి ఆమె స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. ఢిల్లీ జనపథ్‌లో "పాజిటివ్ ఇంపాక్ట్ ఆఫ్ వుమెన్ లీడర్‌షిప్ ఇన్ పంచాయత్స్" నేషనల్ వర్క్‌షాపులో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతులమీదుగా కృష్ణకుమారిని సన్మానించి జ్ఞాపికను అందించారు. పంచాయతీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధుల్లో కృష్ణకుమారి ఒక్కరే కేంద్ర మంత్రి చేతులమీదుగా సన్మానం అందుకోవటం చల్లపల్లికి మరింత ఖ్యాతిని అందించింది. చల్లపల్లి సర్పంచ్‌కు దక్కిన అరుదైన గౌరవం పట్ల స్వచ్ఛ కార్యకర్తలు సంతోషం వ్యక్తంచేశారు.

గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యం

» అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవంలో వెనిగండ్ల



అన్న క్యాంటీన్ల పునఃప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రంలో మొదటిసారి అన్నక్యాంటీన్‌ను చంద్రబాబు పునః ప్రారంభించారని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం తుమ్మలరాంబ్రహ్మం పార్కులోని అన్నక్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, ప్రజల నమ్మకానికి తగ్గట్టు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజాపాలన చేస్తు.. అయోమయ స్థితిలో ఉన్న రాష్ట్రాన్ని రెండు నెలల్లో చంద్రబాబు గాడిన పెట్టారని అన్నారు.

అమరావతి, పోలవరం పూర్తి చేస్తాం : బాలశౌరి

రాష్ట్రానికి రెండు కళ్లు అయిన అమరావతి, పోలవరం నిర్మాణం కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తి చేస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల మొదటి తేదీన పింఛన్ ఇంటికి అందిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్‌లను రెండు నెలల వ్యవధిలో పునఃప్రారంభించారన్నారు. జలజీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించి నీటి సమస్యను పరిష్కరించాలని బాలశౌరి చంద్రబాబును కోరారు. సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమారరాజా, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు భారీ విరాళాలిచ్చిన శ్రీనివాసరాజు, నారా భువనేశ్వరీలు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ నిర్వహణకు దాతల విరాళాలు

గుడివాడలో అన్నక్యాంటీన్ నిర్వహణకు పలువురు దాతలు విరాళాలు అందించారు. వీరిలో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్ సభ్యులు, ఏడుగురు ఎమ్మెల్యేలు కలిపి రూ.50లక్షలు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, ప్రసాద్ దంపతులు రూ.1లక్ష, పామర్రు మండలం పెద్దమద్దాలికి చెందిన సుంకర మల్లిఖార్జునరావు రూ.50వేలు, జమీగొల్వేపల్లికి చెందిన ఐనంపూడి వెంకట సీతా మనోహర్‌రావు రూ.25వేలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.

చంద్రబాబు పర్యటన సాగిందిలా..


అన్నక్యాంటీన్ పునఃప్రారంభం సందర్భంగా గుడివాడకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం 12.50గంటలకు ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. మంత్రికొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, శాసనసభ్యులు వెనిగండ్ల రాము, మండలి బుద్ధప్రసాద్, వర్లకుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, బోడేప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు చంద్రబాబుకు స్వాగతం పలికారు. అక్కడి నుండి గుడివాడ పురపాలకసంఘంలోని తుమ్మల రామబ్రహ్మం పార్కులో ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. స్వయంగా రూ.5లు చెల్లించి భోజనం చేశారు. భోజనం చేస్తున్న లబ్దిదారులతో మాట్లాడారు. హరేకృష్ణ మూమెంట్ సంస్థ(అక్షయపాత్ర) ప్రతినిధులతో ముచ్చటించారు. అన్నక్యాంటీన్‌లో అందించే మెనూచార్టును పరిశీలించారు. అనంతరం పలురంగాలకు చెందిన పేదలతో మాట్లాడి. వారి కష్టాలు, అనుభవాలను తెలుసుకుని వారిని ఏవిధంగా ఆదుకోవాలనే విషయంపై మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లకు రూ.1కోటి చొప్పున విరాళాలిచ్చిన దాతలు శ్రీనివాసరాజు, నారా భువనేశ్వరిలను ఘనంగా సత్కరించారు. తిరిగి 2.25కి హెలీకాప్టర్‌లో ఉండవల్లిలోని సీఎం నివాసానికి తిరుగు ప్రయాణమయ్యారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మహనీయుల త్యాగాల స్ఫూర్తిగా జిల్లా బంగారు భవిత నిర్మాణానికి కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. జిల్లా ప్రగతికి ఐక్యతతో సమిష్టిగా పనిచేసి సత్ఫలితాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో సమున్నతంగా నిలిపి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ నిధి మీనాతో కలిసి కలెక్టర్ సృజన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిల్లలకు మొక్కలు, చాక్లెట్లు పంచారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో వేడుకలలో జేసీ నిధి మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీసీపీ టి.హరిక్రిష్ణ, ఆర్డీవో భవానీ శంకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని, జాతీయ పతాక ఔన్నత్యాన్ని, విలువలను భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతం చేయటం పట్ల అభినందనలు తెలిపారు. దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. ఆ స్వేచ్ఛా ఫలాలను అనుభవించడంతో పాటు విధులు, బాధ్యతల విషయంలో నిబద్ధతతో వ్యవహరిస్తూ రాష్ట్రంలోనే కీలకమైన ఎన్టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను జోడెడ్లుగా సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు.





జగ్గయ్యపేట పట్టణం 31వ వార్డు విష్ణుప్రియనగర్‌లో 151 అడుగుల జాతీయ పతకానికి సెల్యూట్ చేస్తున్న నెట్టెం, తాతయ్య, రాఘవేంద్ర, మునిసిపల్ కౌన్సిలర్లు

తమ్ముడితో కలిసి ఆడుకుంటూ..

» చెరువులో పడి బాలిక మృతి



ఉంగుటూరు, ఆగస్టు 15 : తమ్ముడితో కలిసి చెరువుగట్టుపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి బాలిక మృతి చెందిన సంఘటన వ మండలంలోని ఆత్కూరుగ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఆత్కూరు ఎస్‌ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కినేని చైతన్య, అంజలి దంపతులకు మానస(7), కార్తికేయ(5) ఇద్దరు పిల్లలు. మానస ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం సాయంత్రం స్కూలునుంచి ఇంటికి రాగానే తమ్ముడు కార్తికేయతో కలిసి ఇంటి సమీపంలో వున్న కోనేరు చెరువుగట్టు వద్దకు ఆడుకునేందుకు వెళ్లింది. ఇంటికి వెళ్దాం రా అని తమ్ముడు అడగ్గా.. కాసేపు ఊయల ఊగి వస్తానని చెప్పి ఆగిపోయింది. చీకటి పడుతున్నా మానస ఇంటికి రాకపోవడంతో తల్లి అంజలి చెరువు వద్దకు వెళ్లి అక్కడ పాప లేకపోవడంతో బంధువులతో కలిసి ఊరంతా గాలించి ఆత్కూరు స్టేషన్లో ఫిర్యాదుచేసింది. మిస్సింగ్ కేసు నమోదుచేసిన ఎస్సై సురేష్ సిబ్బందితో పాప ఆచూకీ కోసం గాలింపుచర్యలు చేపట్టారు. గురువారం బాలిక శవం నీటిలో తేలియాడుతూ కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిత్యావసరాల పంపిణీ

పాయకాపురం, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం, ఆర్‌హెచ్‌ఏ(రీజనల్ హెల్త్ అథారిటీ) సంస్థ పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ, కంకిపాడు తదితర ప్రాంతాల్లోని 200 మంది పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు.





స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో



శివాజీకేఫ్ సెంటర్‌లో



బెజవాడ బార్ అసోసియేషన్‌లో



రెవెన్యూ భవన్‌లో



మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో, వన్‌టౌన్‌లో, ఎన్టీఆర్ కాలనీలో

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

నగర వ్యాప్తంగా గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాలయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల వద్ద, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ జరిగింది.

గవర్నర్‌పేట: స్వాతంత్ర్య సమరయోధుల భవన్ వద్ద సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహనప్రసాద్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి జెండా వందనం స్వీకరించారు. లెనిన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం: 59వ డివిజన్ లూనా సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నేత యలవర్తి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నందమూరినగర్‌లో జరిగిన వేడుకల్లో బొండా ఉమా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సత్యనారాయణపురం: స్థానిక శివాజీకేఫ్‌సెంటర్‌లో డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జాతీయపతాకం ఆవిష్కరించారు. సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, ముత్యాలంపాడులో టీడీపీ నాయకులు, సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజు జాతీయపతాకం ఆవిష్కరించారు. ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు మున్సిపల్ స్కూల్‌లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు జాతీయపతాకం ఆవిష్కరించారు. 30వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, కాపుసేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం కార్యదర్శి ఇడుకడి పాండురంగారావు జెండా ఆవిష్కరణ చేశారు.

మొగల్రాజపురం: వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలలో ఐఆర్‌టీఎస్ సీనియర్ డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) గుంటూరు మీసాల దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కేడెట్‌లను ధ్రువపత్రాలతో సత్కరించారు. ● సిద్ధార్థ నగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ● జన శిక్షణా సంస్థాన్‌లో సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ జాతీయ జండాను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రాం అధికారి డి. కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో

కృష్ణలంక: బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద జాతీయ జెండాను మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్‌లు ఆవిష్కరించారు. బార్ ఆవరణలోని మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● కృష్ణలంకలో ప్రజాసంఘాలు, పౌరసంక్షేమ సంఘం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పౌరసంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ దోనేపూడి కాశీనాథ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.● ఏపీ రెవెన్యూ సర్వీసెస్, ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీఆర్‌ఎస్‌ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అశోక్‌నగర్‌లో...

పటమట: అశోక్‌నగర్‌లోని తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. మాజీ మేయర్ తాడి శకుంతల జాతీయ జెండాను ఆవిష్కరించారు.



● మారిస్ స్టెల్లా కళాశాలలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రస్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కేడెట్స్, ఆర్మీ, నేవీ కేడెట్స్, ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. నేవీ వింగ్ అధికారిణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాణిగారితోట: రాణిగారితోట తాడికొండ సుబ్బారావు మున్సిపల్ స్కూల్ ఆవరణలో జెండా వందనం జరిగింది. ● రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సంస్థ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.శ్రీధర్ జాతీయ పతకాన్ని ఎగురవేశారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్: గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో చెన్నుపాటి రష్మి జెండాను ఆవిష్కరించారు. అధ్యక్షుడు దోగిపర్తి శంకర్రావు, సెక్రటరీ నీలం దుర్గారావు పాల్గొన్నారు.

వన్‌టౌన్: వన్‌టౌన్ శంకర్ కేఫ్ సెంటర్ వద్ద జరిగిన వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమీపంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కనకదుర్గా నగర్, కెనాల్‌రోడ్డు మెయిన్ బజార్, కాళేశ్వరరావు మార్కెట్ గద్దబొమ్మ సెంటర్ వద్ద జరిగిన వేడుకల్లో పశ్చిమ టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కె.రవీంద్ర జెండాను ఆవిష్కరించారు. ● కొత్తపేటలోని పొట్టిశ్రీ రాములు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో మీడియా కమిటీ మాజీ మెంబర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ సి.ఆర్. మోహన్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. ● అమ్మహోటల్, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద జరిగిన వేడుకల్లో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

చిట్టినగర్: 49వ డివిజన్ చిట్టినగర్ స్కూల్లో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.● చిట్టినగర్ ఈద్గా మస్జిద్‌లో జరిగిన వేడుకల్లో మహమ్మద్ ఫతావుల్లా జెండా ఆవిష్కరించారు. ఈద్గా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో వృద్ధులకు పెన్షన్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది.

పాతరాజరాజేశ్వరి పేట: 34వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల, వీఎంసీ అధికారి ఆర్. ఓబేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వంద అడుగుల త్రివర్ణ పతాకంతో డివిజన్ లో ర్యాలీ చేసి కేదారేశ్వరపేటలోని వెలగపూడి లక్ష్మణదత్తు ప్రాథమిక పాఠశాల ఆవరణలో జెండా వందన కార్యక్రమం చేపట్టారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో...

భారతీనగర్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.కనకరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. విజయ సారథి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి. పద్మారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి విజయ కుమార్, బోర్డు డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ నగర పాలక సంస్థ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు సుజాత ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ రెండో రోడ్డులో రింగ్‌రూమ్ వద్ద కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీనియర్ సిటిజన్ కొసరాజు పరమేశ్వరరావు జాతీయ జెండాను అవిష్కరించారు. శ్రీరామచంద్ర నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ జెండాను ఆవిష్కరించారు.



వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో



వీపీ సిద్దార్థ పబ్లిక్ స్కూల్‌లో

మహిళల్లో కేన్సర్‌పై అవగాహన పెంచాలి

ఎంపీ కేశినేని శివనాథ్



ఎంపి శివనాథ్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణలతో కలిసి హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా

వన్‌టౌన్, ఆగస్టు 15: అతి ప్రమాదకరమైన కేన్సర్‌పై మహిళల్లో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం కొత్తపేట కేబీఎన్ కళాశాలలో సుజనా ఫౌండేషన్, షేర్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంప్‌ను ఎంపీ కేశినేని చిన్ని, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముందుగా గుర్తించే కేన్సర్ స్కానింగ్ టెస్ట్‌లపై ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు డివిజన్లలో ప్రచారం నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి నెల రోజుల పాటు ఉచిత శిబిరం నిర్వహించటం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ఈనెల 16 నుంచి సెప్టెంబరు 14 వరకు పశ్చిమ వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, బీజేపీ నాయకులు పైలా సోమినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జీవీఎన్ ప్రసాద్, షేర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ పి.ఎస్. రెడ్డి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మధుమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సీపి కాశీ విశ్వనాథం, ట్రస్ట్ వ్యవస్థాపకుడు రుద్రయ్య

భవానీపురం, ఆగస్టు 15 : పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు పెన్షన్ల కింద ఏటా రెండు లక్షల వ్యయం చేస్తూ జవ్వాది సూర్యనారాయణ(రుద్రయ్య), హైమావతి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సమాజంలో అందరికి ఆదర్శంగా నిలిచిందని ఏలూరు రేంజ్ సీఐ దాసరి కాశీ విశ్వనాథం కొనియాడారు. కబేళా సమీపంలోని కామాక్షి ఏకాంబేశ్వర కల్యాణమండపంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా, ట్రస్ట్ 13వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి గురువారం 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, 25 మందికి నాలుగో విడతగా రూ.వెయ్యి చొప్పున పెన్షన్ల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా కాశీ విశ్వనాథం, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ ఇందిరా రమణామూర్తిలు హాజరయ్యారు. ట్రస్ట్ చైర్మన్ అరవింద్‌కుమార్, ది విజయవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోనా శ్రీహరి, పట్నాల సత్యనారాయణ, రామనాథం కృష్ణబాబు, ఆడారి వెంకటేశ్వరరావు, మిరియాల దూండేశ్వరరావులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేది టీడీపీనే: ఎమ్మెల్యే గద్దె



అన్న క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గద్దె దంపతులు

పటమట, ఆగస్టు 15 : అన్నక్యాంటీన్లను ప్రారంభించడం సంతోషంగా ఉందని, పేదల ఆకలిని తీర్చేది టీడీపీనే అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 11వ డివిజన్ పటమట రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభ ఏర్పాట్లను ఆయన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధతో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఉదయం నుంచి అన్నక్యాంటీన్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ తూర్పులో నాలుగు అన్న క్యాంటీన్లు ప్రారంభించనుండటం సంతోషంగా ఉందన్నారు. డివిజన్ అధ్యక్షులు కోనేరు రాజేష్, చెన్నుపాటి గాంధీ, పామర్తి కిషోర్, జాస్తి సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఐజీఎంసీ పంద్రాగస్టు వేడుకల్లో గద్దె దంపతులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని చూస్తే ముచ్చటగా ఉందని గద్దె దంపతులు అన్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వీరిద్దరూ పాల్గొన్నారు.

మహిళకు సబ్కా ఆర్థిక సాయం

అజిత్‌సింగ్‌నగర్ : అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన పోలూరి బలరాం రేణుకకు సబ్కా(స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్) సభ్యులు ఆర్థికసాయం చేశారు. గురువారం సింగ్‌నగర్ పైపులరోడ్డు వద్ద గల రేణుక నివాసానికి వెళ్లి విభిన్న ప్రతిభావంతుడైన ఆమె కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమెకు చిరు వ్యాపారం నిమిత్తం రూ. 15 వేలు చెక్‌ను అందజేశారు. సబ్కా జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎంఆర్‌డి. ప్రసాదరావు, సభ్యులు కొల్లి కోటిరెడ్డి, సత్య సుధీర్, శేషగిరిరావు ఉన్నారు.

నేడు త్రిశక్తిపీఠంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

కృష్ణలంక, ఆగస్టు 15: త్రిశక్తిపీఠంలోని కాళీమాత దేవస్థానంలో క్రోధి నామ సంవత్సరం శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి భక్తులు తమ స్వహస్తాలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతుందని తెలిపారు. కుంకుమార్చనకు, సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే భక్తులకు పూజా సామాగ్రి ఆలయ నిర్వాహకులే అందిస్తారని వారు తెలిపారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

పాతరాజరాజేశ్వరి పేట, ఆగస్టు 15 : ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు అనుసరించి నడుచుకోవాలని ఖమ్మం బిషప్ కదిలి ప్రకాష్ అన్నారు. స్థానిక పెజ్జోనిపేట ఆర్‌సీఎం చర్చిలో గురువారం విచారణ గురువులు ఫాదర్ జేమ్స్ ఆధ్వర్యంలో దేవమాత మోక్షారోపణ పండుగ జరిగింది. ఈ పండుగకు ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ ప్రకాష్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా దేవమాత మోక్షారోపణ పండుగను ఘనంగా జరిపిస్తున్నారని అన్నారు. సహాయ గురువులు ఫాదర్ మాథ్యూ, చిన్నాబత్తుని శౌరీలు, పాలెం జీవన్, సిస్టర్ గంజి దీప్తి, పసల స్వర్ణజ్యోతి, విచారణ కౌన్సిల్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు

వన్‌టౌన్, ఆగస్టు 15: పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతిని మోసం చేసిన కీసరకు చెందిన దీపక్ రాజ్‌పై గురువారం గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కంచికచర్ల మండలం, కీసర గ్రామానికి చెందిన దీపక్ రాజ్ మొగల్రాజపురానికి చెందిన యువతిని పరిచయం చేసుకుని స్నేహం చేశాడు. ఆ తరువాత ప్రేమించానని వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. యువతి వద్ద నుంచి రూ.80 వేలు, రెండు బంగారు ఉంగరాలు తీసుకున్నాడు. బాధితురాలు వివాహం చేసుకోమని అడగగా, అందుకు అతను నిరాకరించి, ఆమెను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు

తమ కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడి సారాకొట్టు సెంటర్ వద్ద ఉంటున్న యువతి బుధవారం రాత్రి 10 గంటలకు తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసింది. అనంతరం ముగ్గురు నిద్రపోయారు. తల్లిదండ్రులు తెల్లవారుజామున 3 గంటలకు లేచి చూడగా కుమార్తె కనిపించలేదు. తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ యువతి ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొల్లిమర్ల సాంబశివరావు అలియాస్ కారు శివ పై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఎన్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్' పోటీ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్&ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్(డీఈఎస్‌ఎం)- 'ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్(ప్రయాస్) 2024 స్కీమ్' గైడ్‌లైన్స్ విడుదల చేసింది. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మేథమెటిక్స్ విభాగాల్లో ఆసక్తిని కలిగించి పరిశోధనల దిశగా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పరీక్షించి వారి సృజనాత్మకతను పెంపొందించేలా పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయంగా పరిశోధనలు చేయాలి. ఇందుకు తమ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.

తమ పరిశోధనల వివరాలతో ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను సంస్థ ఈ మెయిల్‌కు పంపాలి. ప్రాజెక్ట్ వర్క్ వ్యవధి ఏడాది. అవసరం మేరకు మరో ఆర్నెల్లు పొడిగించే వీలుంది. నిబంధనల ప్రకారం పూర్తిచేసిన ప్రాజెక్ట్ పరిశోధన పత్రాలను ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: తొమ్మిది నుంచి పదకొండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు నాటికి విద్యార్థుల వయసు 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు విద్యార్థుల గ్రూప్ తమ టీచర్, హెచ్‌ఈఐ సహకారంతో రీసెర్చ్ చేయవచ్చు. తొమ్మిది నుంచి పన్నెండోతరగతి వరకు సైన్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 25



- **దరఖాస్తుల స్క్రీనింగ్:** ఆగస్టు 31
- **ప్రాజెక్ట్ ప్రపోజల్ సెలెక్షన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **జ్యూరీ ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌ల సమాచారం:** సెప్టెంబరు 10న
- **ప్రాజెక్ట్ రీసెర్చ్ వర్క్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసేందుకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 14
- **ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్:** 2025 సెప్టెంబరు 20
- **ఈ మెయిల్ ఐడీ:** prayaasncert@gmail.com
- **వెబ్‌సైట్:** ncert.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/W6jLfS4లో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Corteva Agriscience

Description: An initiative of Corteva Agriscience India Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./ M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

The applicant's annual family income must be 6,00,000 or less. Students from across India can apply. Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:
- For PG students: INR 50,000
- For UG students: INR 25,000
- For school students: INR 10,000

Last Date to Apply: 13-09-2024
Short Url: www.b4s.in/aj/CASP4

Infosys Foundation

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12. The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh. Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

KSB Scholarship

Description: KSB Ltd through Care Charitable Trust invites applications from female students in their first year of a diploma in engineering or any polytechnic course to provide them with financial support for their studies.

Eligibility: Girls studying in the first year of a diploma in engineering or any polytechnic course. Students studying or having domiciles in and around Pune, Nashik, Ahmednagar, Satara, and Coimbatore. Students who have scored more than 60% marks in their previous classes are eligible to apply. Students' family income from all sources should be less than INR 8 lakh per annum. Children of employees of KSB Care Charitable Trust and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of INR 25,000 and mentorship support
Last Date to Apply: 16-09-2024
Short Url: www.b4s.in/aj/KSBMP1

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

ఐపీఎస్ ఆఫీసర్‌గా...

విష్వక్ సేన్ కథానాయకుడిగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'వీ.ఎస్ 13' వర్కింగ్ టైటిల్. గురువారం చిత్రీకరణ ప్రారంభించారు. కన్నడ నటి సంపద హీరోయిన్. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. గ్రామీణ నేపథ్యంలో విభిన్న



పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విష్వక్ నిజాయితీ గల ఐ.పీ.ఎస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో గౌరవ అతిథిగా పాల్గొనేందుకు ఆహ్వానం అందిన నేపథ్యంలో రామ్‌చరణ్ తన కుటుంబంతో గురువారం మెల్‌బోర్న్ చేరుకున్నారు. పది రోజుల పాటు సాగే ఈ చలనచిత్రోత్సవంలో ఇండియన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ అంబాసిడర్ పురస్కారాన్ని రామ్‌చరణ్ అందుకోనున్నారు.

కంటతడి పెట్టించిన కవిత



విలక్షణ నటుడు, గాయకుడిగా సుపరిచితుడైన ఆయుష్మాన్ ఖురానా పశ్చిమ బెంగాల్‌ను కుదిపేస్తున్న ట్రైనీ వైద్యురాలి హత్య ఘటనపై తన కలం ఝుళిపించారు. బాధితురాలి ఆవేదనకు అక్షరరూపం ఇచ్చిన ఆయన ఆ కవితను చదువుతున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వైరల్ అయింది. అది విన్న మనసున్న ప్రతి మనిషి కళ్లు ఆర్తితో చెమర్చుతున్నాయి. 'నేనే అబ్బాయిని అయి ఉంటే గది తలుపు వేయకుండా నిద్రపోవచ్చు కదా' అంటూ మొదలైన కవిత మగవాడిగా ఉండడంలోని స్వేచ్ఛను, ఆడపిల్లలపై ఉన్న పరిమితులను వర్ణిస్తూ సాగింది. తన ఆవేదనను ఆయుష్మాన్ ఆవిష్కరించిన తీరుతో ఆ కవిత విన్న ప్రతి ఒక్కరూ ఆ వైద్యురాలి ఆవేదనను అనుభూతి చెందుతున్నారు. 'నిర్భయ హత్య ఘటన జరిగి 12 ఏళ్లు... అయినా మనలో మార్పు రాలేదు. ఇప్పుడు మళ్లీ అదే తరహా ఘటన' అని నటి కరీనా కపూర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలియాభట్, ప్రీతిజింతా సహా పలువురు బాలీవుడ్ నటీనటులు ఈ ఘటనను ఖండించారు.

భావోద్వేగాల సమ్మేళనం




బండి సరోజ్‌కుమార్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'పరాక్రమం'. ఈ నెల 22న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ కిషన్ మాట్లాడుతూ "సరోజ్ కుమార్ నిజాయితీ గల దర్శకుడు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రతీ కామన్ మ్యాన్‌కు కనెక్టయ్యే చిత్రమిది. ఈ సినిమా ఎన్నో భావోద్వేగాల సమ్మేళనం" అని దర్శకుడు బండి సరోజ్‌కుమార్ అన్నారు.



సమంత సమాధానం?

సమంత ఏం చేసినా సంచలనమే. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన సెల్ఫీ చర్చనీయాంశమైంది. ఇది నాగచైతన్య నిశ్చితార్థం తర్వాత ఆమె పోస్ట్ చేసిన తొలి ఫొటో కావడమే అందుకు కారణం. ఇందులో సమంత స్టైలిష్‌గా కనిపించారు. ఈ స్టిల్‌లో సమంత ఎడమ కణతపై మధ్యవేలును ఉంచారు. దర్శకుడు రాజ్ నిడమోరుతో డేటింగ్‌లో ఉన్నారంటూ తనపై వస్తున్న పుకార్లను పట్టించుకోబోనని శామ్ చెప్పకనే చెప్పారని కొందరు నెటిజన్లు అంటున్నారు. 'ది మ్యూజియం ఆఫ్ పీస్ అండ్ క్వైట్' అని రాసున్న టీషర్ట్‌ను సమంత ధరించారు. దీంతో ఈ కొటేషన్ ద్వారా కొందరికి సమంత సరైన సమాధానం చెప్పారని మరో అభిమాని వ్యాఖ్యానించారు.





దసరా బరిలో పొట్టేల్

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ ఎం. దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి, సురేశ్ కుమార్ సడిగె నిర్మించారు. గురువారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుపుతూ పోస్టర్‌ను విడుదల చేశారు.

అక్టోబర్‌లో హారర్ థ్రిల్లర్



వెంకటసాయి గుండ ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రం 'ద డిజర్వింగ్'. ఈ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌ను కోకా సింగ్ అరోర దర్శకత్వంలో వెంకటసాయి గుండ, తిరుమలేశ్ గుండ్రాత్, విస్మయ్‌కుమార్ కొత్తపల్లి నిర్మించారు. సమాజంలో జరిగే పలు అంశాలను ఆధారం చేసుకుని విభిన్నంగా తెరకెక్కింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. 'ద డిజర్వింగ్'ను అక్టోబరు 1న విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



బాలల చిత్రం అభినవ్

భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "బాలకార్మిక వ్యవస్థను, గంజాయి మాఫియాను నిర్మూలించడమే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఇది అందరి ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. ప్రేక్షకులను కట్టిపడేసే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. సామాజిక చైతన్యమే ఈ సినిమా ధ్యేయం" అని అన్నారు.

వినాయక చవితికి విడుదల



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను జె.శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి సమర్పిస్తున్నారు. తాజాగా, మేకర్స్ ఈ సినిమా డేట్‌ను ప్రకటించారు. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రాన్ని సెప్టెంబరు 7న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది.

జీరోలో హీరోగా



నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్‌రాజా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జీరో'. ఈ స్పోర్ట్స్ డ్రామాను లక్ష్మీనారాయణ దర్శకత్వంలో ఆర్.లక్ష్మణ రావు, ఆర్.శ్రీను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తనికెళ్ల భరణి మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. తప్పక విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి ఈ సినిమా నచ్చుతుంది" అని దర్శకుడు లక్ష్మీనారాయణ అన్నారు. "ఈ సినిమాలో అందరికీ కనెక్ట్ అయ్యే ఆసక్తికర అంశం ఉంది" అని నిర్మాత ఆర్.లక్ష్మణరావు తెలిపారు.





ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 16 ఆగస్టు 2024



కల్కి వచ్చేది అప్పుడే

కల్కి అవతారాన్ని భవిష్యత్తులో జరగబోయేదిగా మన పూర్వ ఋషులు వర్ణించారు. ఆయన జన్మించే శంభల గ్రామం ధర్మబద్ధమైనదనీ, అది సామాన్యులకు అగోచరంగా... అంటే కంటికి కనిపించకుండా ఉంటుందనీ కూడా వెల్లడించారు. కానీ ప్రజలలో కుతూహలం పెరిగి, వాటిపై రకరకాల కల్పిత కథనాలు ఊహాపోహలు ఎక్కువయ్యాయి. నిరాధారమైన అప్రామాణిక కథలు చిలవలుపలవలుగా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో సనాతన ధార్మిక గ్రంథాలు చెబుతున్న అసలు విషయాలను తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. కల్కి ఈ యుగాంతంలో ఆవిర్భవించే అవతారం. 'అథాసౌ యుగసంధ్యాయాం...' అంటే 'యుగసంధిలో...' అని పురాణాలు స్పష్టంగా చెబుతున్నాయి. దానికి ఇంకా చాలా సమయం ఉంది.

సృష్టి స్థితి లయకారకుడైన పరమాత్మ... ధర్మ ప్రతిష్ఠాపన కోసం, అధర్మ నిర్మూలన కోసం తనను తాను యోగమాయా శక్తితో అవతరింపజేసుకుంటాడనేది సనాతన ధర్మ శాస్త్రాలు చెబుతున్న మాట. వాటిలో ప్రధానంగా... త్రేతాయుగంలో రామావతారం, ద్వాపర యుగంలో కృష్ణావతారం, కలియుగాంతంలో కల్కి అవతారం సంభవిస్తాయని పూర్వ ఋషులు పలుచోట్ల ప్రస్తావన చేశారు. ప్రజలు ఒకరంటే ఒకరికి గిట్టక... పరస్పర కలహాలతో ధర్మనాశనం జరిగే కాలం కలియుగం. 'కల్యంతే కలహం కుర్వంత్యస్మిన్నితి కలిః' అని వ్యుత్పత్తి. పాపం, దురాచారం, విచ్చలవిడితనం, మర్యాదారాహిత్యం, పరస్పర హింస, ప్రకృతి వైపరీత్యాలు లాంటి దుర్లక్షణాలు... కలి స్వభావాలు. దుర్మార్గులు పాలకులై, ధర్మ విరోధుల దాష్టీకాలతో దెబ్బతిన్న కలియుగంలో... ధర్మ రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఆవిర్భవిస్తాడనే విషయాన్ని 'విష్ణుపురాణం', 'శ్రీమద్భాగవతం', 'విష్ణు ధర్మోత్తర పురాణం' తదితర పురాణాలలో, కొన్ని కావ్యాల్లో వివరించారు. భాగవతానికి అనుబంధమైన ఉప పురాణం 'శ్రీ కల్కి పురాణం'లో కల్కి కథ విస్తృతంగా వివరించి ఉంది.

ఇత్థం కలౌ గతప్రాయే జనేషు ఖర ధర్మిషు... ధర్మత్రాణాయ సత్త్వేన భగవానవతరిష్యతి... శంభల గ్రామ ముఖ్యస్య బ్రాహ్మణస్య మహాత్మనః... భవనే విష్ణుయశసః కల్కిః ప్రాదుర్భవిష్యతి... తదితర శ్లోకాల్లో కల్కి అవతార విశేషాలను 'శ్రీమద్భాగవతం' వర్ణించింది. ఇదే అర్థాన్ని ఇచ్చే వాక్యాలు, శ్లోకాలు ఇతర పురాణాలలోనూ ఉన్నాయి. "గాడిదల మాదిరిగా ప్రవర్తించే జంతుప్రాయులైన మానవుల వల్ల అధర్మం ప్రబలుతుంది. దానివల్ల ప్రకృతి వైపరీత్యాలు విజృంభిస్తాయి. ఆ సమయంలో భగవానుడు ధర్మ రక్షణ కోసం సత్త్వగుణంతో అవతరిస్తాడు. సకలలోక గురువైన, సర్వులకూ ఆత్మ అయిన, సర్వేశ్వరుడైన మహావిష్ణువు... సాధువులను రక్షించడానికి ఆవిర్భవిస్తాడు. శంభల గ్రామంలో విష్ణుయశుడనే వేదవేత్తకు తనయుడిగా జన్మిస్తాడు. దేవదత్తమనే అశ్వాన్ని అధిరోహిస్తాడు. మహాశక్తిమంతమైన ఖడ్గంతో... కపటపాలకులుగా ఉన్న దోపిడీదారులను, మ్లేచ్ఛులను హతమారుస్తాడు. ఆ తరువాత కృతయుగాన్ని స్థాపిస్తాడు" అని అవి వివరిస్తున్నాయి. గరుత్మంతుడి శక్తే అశ్వంగా పుడుతుందనీ, సర్వజ్ఞమనే శక్తి స్వామికి లీలాశుకంగా (చిలుక)గా ఉంటుందనీ పురాణాలు వర్ణించాయి. ముగ్గురు సోదరుల తరువాత కల్కి జన్మిస్తాడు. అతని పత్ని పద్మ. పరశురాముని దగ్గర శిష్యరికం చేసి, శివోపాసనతో అస్త్రవిద్యలను ఆర్జించి, ఆ తరువాత భూమి అంతటా పర్యటించి దుష్టత్వాన్ని నివారిస్తాడు.

కల్కిం కల్కవినాశార్థం ఆవిర్భూతం విదుర్బుధాః
నామా కుర్వంస్తతస్తస్య కల్కిరిత్యభివిశ్రుతమ్... అని చెప్పింది కల్కి పురాణం. అంటే 'కల్కమును వినాశనం చేయువాడు కల్కి' అని అర్థం. 'కల్కో అస్య అస్తి ఇతి హార్యతయా కల్కిః' అనేది కల్కి నామానికి వ్యుత్పత్తి. 'కల్కము' అంటే కపటం, వంచన, పాపం, భయభ్రాంతులు తదితర అర్థాలు ఉన్నాయి. వాటన్నిటినీ తొలగించి, యదార్థ ధర్మాన్ని స్థాపన చేసేవాడు కల్కి.

ఇది భవిష్యత్ అవతారమే అయినా... విష్ణు స్వరూపమే కాబట్టి, ఈ కాలంలో కూడా ఈ నామంతో విష్ణువును ఆరాధించినా, స్మరించినా స్వామి కృప లభిస్తుంది. అలా ఆరాధించేవారికి కలి బాధ సోకకుండా స్వామి రక్షిస్తాడు. కాబట్టి కల్కిరూప శ్రీమన్నారాయణ స్మరణతో ధన్యులమవుదాం.



• సామవేదం షణ్ముఖశర్మ



గీతాసారం

యోగః కర్మసు కౌశలం

వివిధ అంశాల ఆధారంగా మనకోసం, మన కుటుంబం కోసం, సమాజం కోసం మనం నిర్ణయాలు తీసుకుంటాం. ఈ నిర్ణయ సామర్థ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్ళాలని చెబుతూ "యోగః కర్మసు కౌశలం... అంటే యోగస్థితిలో చేసే ప్రతి కర్మ సామరస్యంగా ఉంటుంది" శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది జీవితాన్ని ఉన్నది



ఉన్నట్టుగా ఆస్వాదించడం కోసం కర్తృత్వాన్ని, అహంకారాన్ని వదిలెయ్యడం. మనం తీసుకొనే నిర్ణయాలన్నీ మనం, మన కుటుంబం సుఖపడడానికి లేదా బాధను నివారించుకోవడానికి. ఈ ప్రయాణంలో తదుపరి స్థాయి... సమతుల్యమైన నిర్ణయాలను తీసుకోవడం. మనం సంస్థలకు, సమాజానికి బాధ్యత వహిస్తున్న సందర్భాలలోనైనా సరే... ఈ కర్తృత్వం ఇంకా మిగిలే ఉంటుంది. ఇక్కడ కృష్ణుడు కర్తృత్వానికి తావులేని అంతిమ (అత్యున్నత) స్థాయి గురించి మాట్లాడుతున్నాడు. ఈ స్థాయికి చేరుకున్న వ్యక్తి ఏది చేసినా... అది సామరస్యంగానే ఉంటుంది. అంతటా వ్యాపించి ఉన్న చైతన్యమే వారిని నడిపిస్తుంది. నిర్ణయాధికారులందరికీ తమ ప్రయాణంలో ఈ దశ ఒక ముఖ్యమైన భాగం. అందుకే 'యోగః కర్మసు కౌశలం' అనే వాక్యాన్ని 'ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్' (ఐఎఎస్) తమ లోగోలో భాగంగా చేసుకుంది.

మనం భావోద్వేగాలు, పక్షపాతాలు, జ్ఞాపకాల ప్రభావంలో పడకుండా ఉండాలి. ఎందుకంటే వాటి ప్రభావంలో పడితే... వాస్తవాలను గ్రహించే మన సామర్థ్యాలను అవి నాశనం చేస్తాయి. తప్పుడు నిర్ణయాలకు దారి తీస్తాయి. మనం ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు ఏదో ఒకవైపు మొగ్గు చూపించే పరిస్థితి వస్తుంది. అలాంటప్పుడు వీలైనంత త్వరగా తటస్థ దశలోకి రావాల్సిన అవసరం ఉంది. ఏదైనా నిబంధనను కచ్చితంగా అమలు చేయడం, ఏదైనా నిర్ణయం తీసుకోవడం సులువైన, ఆహ్లాదమైన విషయాలు కావు. అప్పుడు తటస్థమైన ఆలోచనే మార్గాన్ని చూపిస్తుంది. ప్రశంసలను, విమర్శలను సమానంగా తీసుకోవడానికి తటస్థ వైఖరి సహాయపడుతుంది. తటస్థ స్థితిలో స్థిరంగా నిలిచినవారికి శక్తి, అపరిమితమైన తెలివితేటలు, కారుణ్య స్వభావం ఉంటాయి. ఇలాంటి గొప్ప గుణాలు కలిగినవారు అన్నింటా కార్యసాధకులు అవుతారు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

మహాత్ముల స్వభావం

ఇతః స్వపితి కేశవః కులమితస్తదీయ ద్విషా
మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే
ఇతోపి బడబానలః సహ సమస్త సంవర్తకై
రహో వితతమూర్జితం భరసహం చ సింధోర్వపుః

మహాత్ముల గొప్పతనం గురించి తన నీతి శతకంలో భర్తృహరి చెప్పిన శ్లోకం ఇది. దాన్ని...

ఒక యెడ బవ్వళించు హరి, యొక్కయెడన్ వహియించు రాక్షస
ప్రకరము, లొక్కచో నడగు బర్వత సంఘము, లొక్కెడన్ బలాహకములతోడ నుండు బడబాగ్నియు, విస్తృత మూర్జితంబునుం బ్రకటభరక్షమం బగుచు భాసిలు నౌర సముద్రమెంతయున్...



అంటూ తెలుగువారికి అందించారు ఏనుగు లక్ష్మణకవి.

భావం: గొప్పవారిని, సహనశీలత కలిగినవారిని గంభీరమైన సముద్రంతో పోలుస్తూ ఉంటారు. బ్రహ్మాండాన్ని తన ఉదరంలో దాచుకున్న శ్రీమహావిష్ణువు సముద్రంలో ఒక చోట నిద్రపోతూ ఉంటాడు. ఆయనకు శత్రువులైన రాక్షసులు కూడా సముద్రంలో తలదాచుకొని ఉంటారు. ఇంద్రుడి వజ్రాయుధం దాడి నుంచి రక్షణ కోసం మైనాకాది సముద్రంలో దాగి ఉన్నాయి. సముద్రంలో మరొకచోట బడబానలం ప్రజ్వరిల్లుతూ నీటిని మింగేస్తోంది. వీటన్నిటినీ భరిస్తూ సముద్రం ఇంకా వర్ధిల్లుతూనే ఉంది. అదే విధంగా... సుఖాలు వచ్చినా, కష్టాలు ఎదురైనా మహాత్ములు తమను ఆశ్రయించినవారిని ఆదరిస్తారు. వారికి ఆధారంగా నిలుస్తారు.

సత్యధర్మరతాయచ...

పూజ్యాయ రాఘవేంద్రాయ సత్య ధర్మరతాయచ... భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే... ఇది భక్త జనులందరికీ తెలిసిన శ్రీ రాఘవేంద్రస్వామివారి నిత్య స్మరణీయ శ్లోకం. దీనిలోని మొదటి పదమే 'శ్రీ రాఘవేంద్రులు అత్యంత పూజనీయులు' అని చెబుతోంది. ఎందుకంటే ఆయన సత్య ధర్మాలనే దీక్షగా, వ్రతంగా పెట్టుకున్నవారు. 'సత్యం' అంటే ఉన్నది ఉన్నట్టు చెప్పడం మాత్రమే కాదు. యత్ సతాం హితం తత్ సత్యం...అంటే జీవితంలో మనం మాట్లాడే మాట మన తల్లితండ్రులకు, గురువులకు, సజ్జనులకు హితం కలిగించేదిగా ఉండాలి. తద్వారా వారు భగవన్ముఖులై... ఆ పరమాత్ముని అనుగ్రహం పొందాలి. ఇదీ రాఘవేంద్రుల సత్య వ్రతం. ఆయన ఏనాడూ పరుషమైన మాటలతో సజ్జనుల మనస్సును నొప్పించలేదు. శ్రీ రాఘవేంద్రులను పరీక్షించడానికి ఒక ముస్లిం రాజు తామసమైన ఆహారం మీద వస్త్రాన్ని కప్పి ఆయన ముందు ఉంచాడు. ఆయన తీర్థ సంప్రోక్షణంతో దాన్ని సాత్విక ఆహారంగా మార్చారు. ఆ రాజు తామస వ్యక్తిత్వాన్ని కూడా సాత్వికంగా మార్చారు. జాతి, మత భేదాలు లేకుండా... అందరినీ కరుణించి, వారి యోగ్యతకు అనుగుణంగా ఆధ్యాత్మిక దృష్టిని ప్రసాదించి, సన్మార్గాన్ని చూపించిన దివ్యపురుషులు శ్రీ రాఘవేంద్రులు.

శ్రీరాఘవేంద్రుల పూర్వనామం వెంకటనాథుడు. వివాహమై, సంసారధర్మాన్ని నిర్వహిస్తున్న కాలంలో ఆయన కటిక దరిద్రాన్ని అనుభవించారు. అయినా ఎవరినీ చేయి చాచి అడుగలేదు. సరైన దుస్తులు లేని దుస్థితిలో కూడా అధ్యయనాన్ని, అనుష్ఠానాన్నీ మానలేదు. చిన్న చిన్న సమస్యలకు సైతం చావే పరిష్కారం అనుకొనే దుర్బల మనస్కులు ఆయన ధర్మ దీక్ష నుంచి స్ఫూర్తి పొందాలి. ఆ ధర్మనిరతి వల్ల ఆయనకు మంత్రసిద్ధి కలిగింది.

ఒక రోజు వెంకటనాథుడు తన ఊరికి వెళుతూ... మార్గమధ్యంలో ఒక అగ్రహారానికి చేరుకున్నారు. తేజస్సుతో వెలిగిపోతున్న ఆయనను చూసి ఒక ఇంటి యజమాని తన ఇంట్లో జరుగుతున్న సమారాధనకు ఆహ్వానించాడు. అయితే వెంకటనాథుని యోగ్యత తెలియని అక్కడి వారు... గంధం తీసే పని ఆయనకు అప్పగించారు. దాన్ని పరమాత్ముని సేవగా భావించిన వెంకటనాథుడు... అగ్ని సూక్తాన్ని పఠిస్తూ గంధం తీశారు. వెంకటనాథుడు పొందిన మంత్రసిద్ధి ప్రభావం ఎంతటిదంటే... దేవుని పూజ అయ్యాక ఆ గంధాన్ని రాసుకున్న వారికి శరీరాలు కాలిపోతున్న బాధ కలిగింది. "మంట మంట" అని అరుస్తున్నారు. అప్పుడు ఆ ఇంటి పురోహితుడు "ఈ గంధం తీసినది ఎవరు?" అని అడిగాడు. అందరూ వెంకటనాథుణ్ణి చూపించారు. ఆయనను చూడగానే జరిగిన అపరాధం ఆ పురోహితుడికి అర్థమయింది. తమను క్షమించి, ఈ ఉపద్రవం నుంచి రక్షించాలని వెంకటనాథుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు ఆయన వరుణ సూక్తాన్ని జపిస్తూ... మిగిలిన గంధాన్ని తీర్థంతో కలిసి రాసుకోవాలని సూచించారు. వారు అలా చేయగానే... అప్పటివరకూ నిప్పులు మీద పడ్డట్టు కలిగిన మంట మటుమాయమై, చల్లని అనుభూతి కలిగింది. అందరూ ఆయనను మహిమాన్వితుడని ప్రశంసించగా... ఇదంతా భగవంతుడి లీల అనీ, తాను కేవలం దాసుణ్ణి మాత్రమేనని చెప్పారు.



ద్వైత సిద్ధాంత స్థాపకుడైన శ్రీ మధ్వాచార్యుల సిద్ధాంతం గురించి వివరిస్తూ అర్థ వివరణలు, టీకా టిప్పణులతో దాదాపు 50 గ్రంథాలను శ్రీరాఘవేంద్రులు రచించారు. శ్రీ మధ్వ, శ్రీ జయతీర్థుల భావాలను ఆయన రాసిన 'భావదీప' ప్రకాశింపజేయడంతో పాటు వారిని ఆక్షేపించినవారికి దీటైన సమాధానంగా నిలిచింది. దశోపనిషత్తులకు రాసిన ప్రతిపదార్థం అత్యంత ప్రసిద్ధి చెందింది. అయితే గ్రంథరచన నెపంతో నిత్య, నైమిత్తిక కర్మలను శ్రీరాఘవేంద్రులు ఎన్నడూ విడిచిపెట్టలేదు. ప్రవచనాలు చెప్పేవారు. దేశసంచారం, తీర్థయాత్రలు చేసేవారు. భౌతిక శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత... శ్రీవిజయదాసుల వారికి ప్రహ్లాద, వ్యాసరాయ, రాఘవేంద్ర రూపాలతో దర్శనమిచ్చి.. దాసపథాన్ని కొనసాగించాలని ఆశీర్వదించారు. శ్రీజగన్నాథదాసులకు కనిపించి... శ్రీహరి తత్వాలను ఉపదేశించారు. 'మఠానికి చెందిన మంత్రాలయ గ్రామ భూములు సరైనవా? కావా?' అని విచారించడానికి తను వెళ్ళినప్పుడు... శ్రీ రాఘవేంద్రులవారు తన బృందావనం నుంచి నేరుగా బయటకు వచ్చారని, సంబంధిత పత్రాలను చూపించారని ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి సర్ థామస్ మన్రో 'మద్రాస్ గెజిట్'లో స్వయంగా పేర్కొన్నారు. మన్రో గెజిట్ నేటికీ అందుబాటులో ఉంది. భగవద్భక్తులు అంటే 'సరైన మార్గం ద్వారా తత్వ జ్ఞానాన్ని పొందడానికి దీక్ష వహించినవారు' అని అర్థం. స్వార్థానికి తావులేకుండా 'సమస్త జగత్తుకు శుభం కలగాలి' అనే చింతన వారి మనసులో ఎల్లప్పుడూ ఉండాలి. 'ప్రాతస్సంకల్ప గద్యం' అనే రచన ద్వారా శ్రీ రాఘవేంద్రులు ఇచ్చిన సందేశం ఇదే. "నేను చేసే అన్ని క్రియల ద్వారా ఆ శ్రీహరి ప్రసన్నం కావాలి. నా చుట్టూ ఉన్న సకల సజ్జనులకు సత్కర్మలు చేసే బుద్ధిని ఆ శ్రీహరి ప్రేరేపించాలి" అని రోజూ సంకల్పం చేసుకోవాలని ఆయన బోధించారు.

ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ శ్రీ రాఘవేంద్రుల ఆరాధన మహోత్సవాలు జరగనున్నాయి. ఆయన ప్రథమ శిష్యుడయిన అప్పణాచార్యులవారు తుంగభద్ర నదిని దాటుతూ రచించిన 'శ్రీ రాఘవేంద్ర స్తోత్రా'న్ని ఈ పుణ్య దినాలలో పారాయణం చేస్తే... అది మనల్ని సంసార సాగరాన్ని దాటిస్తుంది. శ్రీహరి కృపకు పాత్రులను చేస్తుంది. నైతిక జీవనం, జ్ఞాన సంపదలే దీక్షగా స్వీకరించి, శ్రీరాఘవేంద్రుల మార్గంలో సత్య ధర్మవ్రతులై ఉండేలా అనుగ్రహించాలని ఆయనను, భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

హరేకృష్ణ

నామస్తే హలాగ్రహ నామస్తే మూశలాయుధ
నామస్తే రేవతీ కాంత నామస్తే భక్త వత్సల
నామస్తే బలానాం శ్రేష్ఠ నామస్తే ధరణీధర
ప్రలంబారే నామస్తేస్తు త్రాహిమం కృష్ణ పూర్వజ

ఆధ్యాత్మిక బలం కోసం..

"హలధరుడు, గదాధరుడు, రేవతీకాంతుడు, భక్తవత్సలుడు, ధరణీధరుడు, బలశ్రేష్ఠుడు, ప్రలంబాసురుణ్ణి సంహరించినవాడు, శ్రీకృష్ణుడికి అగ్రజుడు అయిన బలరామునికి ప్రణామాలు. మా మీద దయచూపించి, మమ్మల్ని సదా రక్షించు" అని భావం. శ్రీకృష్ణుడి అన్న అయిన బలరాముని జయంతిని శ్రావణ పౌర్ణమి రోజున భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణ భక్తులు నిర్వహిస్తారు. రోహిణీ, వసుదేవుల తనయుడైన బలరాముడు 'సంకర్షణ, రామ, బలభద్ర' అనే పేర్లతో పిలుపులు అందుకున్నాడు. దేవకి గర్భం నుంచి రోహిణి గర్భానికి మార్పు చెందినవాడు కాబట్టి 'సంకర్షణుడు' అని, గోకుల వాసులందరినీ సంతోషం కలిగించేవాడు కాబట్టి 'రామ' అని, విశేష బలపరాక్రమాలు కలిగినవాడు కాబట్టి 'బలభద్రు'డనీ అంటారు.

కంసుడి ఆగడాల నుంచి లోకాన్ని రక్షించడానికి శ్రీకృష్ణుడిగా మహావిష్ణువు ఆవిర్భవించబోతున్న సమయంలో... ఆయనకు సహాయపడేందుకు ఆ అనంతశేషుడు భువిపై బలరాముడిగా జన్మించాడు. దేవకీ వసుదేవుల అష్టమ సంతానంగా శ్రీకృష్ణుడు పుట్టాల్సి ఉంది. ఏడో సంతానంగా దేవకి గర్భంలో బలరాముడు ఉన్నాడు. ఆయనను రోహిణి గర్భానికి యోగమాయ మార్చింది. గర్భస్రావం జరిగిందని అందరూ అనుకున్నారు. దేవకి కూడా భయపడింది. కానీ ఆమెకు యోగమాయ ధైర్యం చెప్పి, వాస్తవాన్ని తెలియజేసింది. ఈ విధంగా దేవకికి, రోహిణికి బలరాముడు కుమారుడయ్యాడు. ఆ తరువాత "నీవు ఈ భూతలంపై వివిధ క్షేత్రాల్లో... దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండికా, కృష్ణా, మాధవి, కన్యకా, మాయా, నారాయణీ, ఈశాని,



19న
శ్రీబలరామ
జయంతి

శారద, అంబిక తదితర పేర్లతో ప్రజల నుంచి పూజలు అందుకుంటావు" అని యోగమాయకు శ్రీకృష్ణుడు చెప్పాడు. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు తన భాష్యంలో బలరాముడి గురించి వివరిస్తూ "శ్రీకృష్ణుడి పరివ్యాప్త స్వరూపాలలో మొదటి రూపం బలరాముడని పలువురు పండితుల అభిప్రాయం. బలరాముడు 'మహా సంకర్షణ, కారణాబ్ధిశాయి, గర్భోదక శాయి, క్షీరోదక సాయి, అనంత శేషుడు' అనే అయిదు రూపాలలోకి తనను విస్తరింపజేసుకున్నాడు. ఈ అయిదు స్వరూపాలే ఆధ్యాత్మిక, భౌతిక జగత్తులు వ్యక్తం కావడానికి మూల కారణం" అని తెలిపారు.

ఆధ్యాత్మిక శక్తిలో మూడు అంశాలు ఉంటాయి. అవి సంధిని, సివత్, హ్లాదిని. వీటిలో సంధిని శక్తికి అధిష్ఠాన దైవం బలరాముడు. బలరాముణ్ణి ప్రార్థించడం ద్వారా శ్రీకృష్ణుని పాదపద్మాల దగ్గరకు చేరే మార్గం సుగమం అవుతుంది. బలరాముడు లేదా ఆయన ప్రతినిధి అయిన ఒక ప్రామాణిక గురువు అనుగ్రహం లేనిదే కృష్ణతత్త్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. "శ్రీకృష్ణుడి పట్ల, గురువు పట్ల ఎవరికైతే అచంచలమైన విశ్వాసం ఉంటుందో... వారిలో సమస్త జ్ఞానం తనంతట తానే భాసిల్లుతుంది" అంటుంది శ్వేతాశ్వతర ఉపనిత్తు. "నాయమాత్మ బలహీనేన లభ్యో... తగినంత ఆధ్యాత్మిక బలం లేనిదే ఆత్మసాక్షాత్కార మార్గంలో పురోగమించడం సాధ్యం కాదు" అంటోంది ముండకోపనిషత్తు. ఇందులో 'బల' అనే పదం బలరాముణ్ణి సూచిస్తుంది. అయితే అది భౌతిక బలాన్ని ఉద్దేశించిన మాట కాదు. ఆధ్యాత్మిక జీవనంలో ఎవరైనా పురోగమించాలని కోరుకున్నప్పుడు... మాయ, మోహం పలు రకాలుగా అడ్డు పడుతూ ఉంటాయి. వాటిని అధిగమించడానికి తగిన ఆధ్యాత్మిక బలం అవసరం. ఆ బలం బలరాముణ్ణి ప్రార్థించడం వల్ల కలుగుతుంది.

కృష్ణ భక్తికి అవరోధాలుగా నిలిచే మనలోని అంతర్గత శత్రువులను బలరాముడి నుంచి లభించే బలంతో జయించవచ్చు. పవిత్రమైన బలరామ జయంతి రోజున ఆయన అనుగ్రహం కోరుతూ ప్రతి ఒక్కరూ ప్రార్థించాలి. 'హరేకృష్ణ హరేరామ' మంత్రంలోని 'రామ' నామం బలరాముణ్ణి కూడా సూచిస్తుంది. ఆ మహామంత్ర జపంతో శ్రీకృష్ణ బలరాముల అనుగ్రహం లభిస్తుంది, సకల శుభాలు కలుగుతాయి.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

వరాల వేలుపు

గృహిణులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే వ్రతం... వరలక్ష్మీ వ్రతం. సంపదలను ప్రసాదించే ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో... పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం చేసుకోవడం సంప్రదాయం. శ్రావణమాసానికి, శుక్రవారాలకు ఉన్న విశిష్టతలే దీనికి కారణం. శ్రీసూక్తంలోని మొదటి శ్లోకం 'లోకైక దీపాంకురాం' అంటూ శ్రీమహాలక్ష్మిని వర్ణిస్తుంది. లక్ష్మీ దేవి సమస్త లోకానికీ వెలుగునిచ్చే దీపం. ఆమె క్షీరసాగర తనయ. శ్రవణం నక్షత్రం జన్మతిథిగా ఉన్న శ్రీహరిని భర్తగా పొందింది. పౌర్ణమి రోజున శ్రవణం నక్షత్రం ఉండే మాసమే శ్రావణమాసం. అలాగే... పౌర్ణమినాడు షోడశ కళలతో ప్రకాశించే చంద్రుడు... లక్ష్మీదేవికి తోబుట్టువు. అంటే అటు పుట్టినిల్లు, ఇటు మెట్టినిల్లు కాంతులతో విలసిల్లుతూ ఉంటుంది.

ఇక... శుక్రవారాన్ని 'భృగువారం' అంటారు. ఒక జన్మలో భృగుమహర్షి కుమార్తెగా లక్ష్మీదేవి శుక్రవారం నాడు జన్మించింది. అందుకే ఆమెను 'భార్గవీ లోక జననీ క్షీరసాగర కన్యకా' అంటూ పూజిస్తారు. శుక్రవారం ఆమెకు ఇష్టమైన రోజు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగినవి శ్రావణ శుక్రవారాలు.

> లక్ష్మీ దేవికి ఎన్నో పేర్లు, అంశలు ఉన్నా... ఆరింటినే ప్రధానంగా పేర్కొంటారు. శ్రీసూక్తంలోని 'శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీం సరస్వతీ... శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్న మమ సర్వదా' అనే శ్లోకం వాటి గురించి చెబుతుంది.

వ్రతకథ, విధానం...

వరలక్ష్మీ వ్రతం మహిళలందరూ ఆచరించదగినది. శ్రద్ధాభక్తులతో ఆ తల్లిని పూజించినవారిని ఎలాంటి కొరతా లేకుండా కటాక్షిస్తుందన్నది పెద్దల మాట. పుట్టింటివారితో, మెట్టినింటివారితో ఆప్యాయంగా మసలుకుంటూ, ఇరుగు పొరుగువారితో నిరహంకారంగా మెలుగుతూ... పెద్దలను గౌరవిస్తూ, పిన్నలను ఆదరంగా చూస్తూ... కుటుంబానికి కేంద్రబిందువుగా ఉండే మహిళగా 'వరలక్ష్మీ వ్రత కథ'లోని చారుమతి పాత్ర కనిపిస్తుంది. చారుమతిలోని ఆ గుణాలు లక్ష్మీ దేవికి ప్రీతిపాత్రమైనవనీ, అటువంటి వారికి ఆ తల్లి దయ ఎల్లప్పుడూ ఉంటుందనీ ఈ కథ వెల్లడిస్తుంది. చారుమతికి వరలక్ష్మీదేవి కలలో దర్శనమిచ్చి... తాను వరలక్ష్మిననీ, శ్రావణ పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం తనను భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన వరాలు కురిపిస్తాననీ చెబుతుంది. ఈ సంగతి ఇంటి పెద్దలకు, ఇరుగుపొరుగువారికీ చారుమతి తెలియజేస్తుంది.

వరలక్ష్మీదేవి ఆదేశం ప్రకారం... చారుమతితో పాటు ఇరుగు పొరుగు ఇల్లాళ్ళందరూ... ఆ రోజు అందరూ శుచిగా స్నానాలు ఆచరించారు. వ్రత విధానాన్ని పాటిస్తూ... షోడశోపచారాలతో అమ్మవారిని ఆరాధించారు. తోరాలను పూజించారు. వరలక్ష్మికి ప్రతీకగా నిలిపిన కలశానికి, అనంతరం తమ మంజేతులకు తోరాలను కట్టుకున్నారు. వ్రత మంటపానికి ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ విధంగా వ్రతం ఆచరించి, వారందరూ వరలక్ష్మీ కటాక్షాన్ని పొందారని వ్రత కథ వివరిస్తోంది. ఎలాంటి వివక్షలూ, పక్షపాతాలూ లేకుండా... సమష్టిగా వ్రతాలనూ, సత్కార్యాలనూ ఆచరించి, వచ్చిన ఫలితాన్ని సమానంగా అనుభవించాలని ఈ కథ బోధిస్తోంది.



నేడు వరలక్ష్మీ వ్రతం

సమగ్ర రూపమే వరలక్ష్మి

లక్ష్మీ దేవికి ఎన్నో పేర్లు, అంశలు ఉన్నా... ఆరింటినే ప్రధానంగా పేర్కొంటారు. శ్రీసూక్తంలోని 'శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీ సరస్వతీ... శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్న మమ సర్వదా' అనే శ్లోకం వాటి గురించి చెబుతుంది. మొదటిది శుద్ధ లక్ష్మి: మన సంపద శుద్ధంగా... అంటే అవినీతికి తావులేకుండా ఉండాలి. అధర్మంగా, హింసా మార్గంలో సంపాదించినది కాకూడదు. శుద్ధమైన సంపదను ధర్మబద్ధంగా వితరణ చేయాలి. అప్పుడే లక్ష్మి ప్రసన్నమవుతుంది. రెండోది మోక్షలక్ష్మి. పేరులోనే 'మోక్షప్రదాయిని' అనే అర్థం ఉంది. చతుర్విధ పురుషార్థాలలో చివరిది మోక్షం. మోక్షాన్ని కోరుతూ లక్ష్మీదేవిని ఆశ్రయిస్తే... లౌకికమైన ప్రలోభాల నుంచి ఆధ్యాత్మిక మార్గానికి మళ్ళిస్తుంది. మూడోది జయలక్ష్మి: లక్ష్మీదేవిని త్రికరణశుద్ధిగా పూజిస్తే సర్వత్రా జయం కలుగుతుంది. మంచి పనులను తలపెట్టి, అవి నిర్విఘ్నంగా పూర్తికావాలని ఆమెను ప్రార్థించాలి. నాలుగోది సరస్వతి: సరస్వతికి ప్రతీక విద్యాలక్ష్మి. ఆమె అనుగ్రహం ఉంటే ఎంతటి మందబుద్ధి అయినా ప్రతిభాసంపన్నుడు అవుతాడు. అయిదోది శ్రీలక్ష్మి: ఇది ధనలక్ష్మికి పర్యాయ పదం. రఘు మహారాజు శ్రీసూక్త మంత్రాలతో కుబేరుని నుంచి ధనాన్ని పొందాడు. శ్రీఆదిశంకరులు పేద గృహిణి ఇంట కనకధారను కురిపించిన కథ అందరికీ తెలిసినదే. ఇలా అయిదు రీతులలో అనుగ్రహించే శ్రీమహాలక్ష్మి... ఆ ప్రయోజనాలన్నిటినీ వరంగా ప్రసాదించే రూపమే... ఆరవది అయిన వరలక్ష్మి. ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్య లక్ష్మి, సంతాన లక్ష్మి... ఇలా ఆమెకు అనేక రూపాలు. వాటన్నిటి సమగ్ర రూపమే వరలక్ష్మీ దేవి అనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

పసిడి మళ్లీ రూ.75,000!



అమెరికా వడ్డీ రేట్లు తగ్గిస్తే పెరిగే చాన్స్

న్యూఢిల్లీ: పసిడి ధర మళ్లీ రూ.75,000కు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. సెప్టెంబరులో జరిగే భేటీలో అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' వడ్డీ రేట్లు ఏకంగా అర శాతం (0.50%) తగ్గిస్తుందనే వార్తలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. దీంతో అక్టోబరులో డెలివరీ ఇచ్చే ఫ్యూచర్స్ మార్కెట్లో పసిడి ధర మళ్లీ పైచూపులు చూస్తోంది. సెప్టెంబరులో జరిగే భేటీలో ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు పావు శాతం (0.25%) తగ్గించే అవకాశం ఉందని ఇప్పటి వరకు మార్కెట్ వర్గాలు భావించాయి. మరోవైపు తాజాగా ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్ కూడా వచ్చే నెలలో వడ్డీ రేట్లు తగ్గించే వీలుందని సంకేతాలిచ్చారు.

అమెరికా ఆర్థిక కష్టాలు

అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్న వార్తలు, ప్రస్తుతం అందరినీ భయపెడుతున్నాయి. ఈ ప్రమాదం నుంచి తప్పించాలంటే సెప్టెంబరులో జరిగే భేటీలో ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు ఏకంగా అర శాతం తగ్గించక తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే బులియన్ మార్కెట్లో మళ్లీ ర్యాలీ తప్పదని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తోడు అంతర్జాతీయ ఉద్రిక్తతలతో చైనాతో సహా ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దఎత్తున పసిడి నిల్వలు పెంచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పండగల సీజన్ నాటికి మన దేశంలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర రూ.75,000 దాటినా ఆశ్చర్యం లేదని మార్కెట్ వర్గాల అంచనా.

తగ్గిన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూలై మధ్య కాలంలో మన దేశానికి 1,264 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.05 లక్షల కోట్లు) విలువైన పసిడి దిగుమతైంది. గత ఏడాది ఇదే కాలంలో దిగుమతైన 1,320 కోట్ల డాలర్ల పసిడితో పోలిస్తే ఇది 4.23 శాతం తక్కువ. గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలోనూ పసిడి దిగుమతులు 10.65 శాతం తగ్గి 313 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే పండగల సీజన్ అమ్మకాలతో సెప్టెంబరు నుంచి దిగుమతులు మళ్లీ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

థార్ రాక్స్ వచ్చేసింది..

» ప్రారంభ ధర రూ.12.99 లక్షలు



కోచి: దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. ఐదు డోర్ల ఎస్‌యూవీ థార్ రాక్స్‌ను గురువారం ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.12.99 లక్షలు. ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తున్న మూడు డోర్ల థార్ ధర కన్నా రూ.1.64 లక్షలు ఎక్కువ. పెట్రోల్, డీజిల్ ఇంజన్ వెర్షన్లలో మొత్తం ఆరు వేరియంట్లలో ఈ కారు లభించనుంది. హైఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలుగా ఉంది. అక్టోబరు 3 నుంచి బుకింగ్స్ ప్రారంభించి.. దసరా (అక్టోబరు 12) రోజున కస్టమర్లకు డెలివరీలు చేయనున్నట్లు మహీంద్రా తెలిపింది.

30న ముంబైలో రెండో ప్రపంచ పసుపు సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్ ఎక్స్ఛేంజీ (ఎన్‌సీడీఎక్స్), కమోడిటీ ట్రేడింగ్‌లో ప్రముఖ సంస్థ మెక్‌డొనాల్డ్ పీఈఎల్‌జెడ్ ఈ నెల 30వ తేదీన ముంబైలో రెండవ ప్రపంచ పసుపు సదస్సును నిర్వహిస్తున్నాయి. పసుపు ఉత్పత్తి, ఎగుమతి రంగాలకు చెందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారు. పసుపు మార్కెట్ భవిష్యత్తు, పరిశ్రమలో ఏర్పడిన మార్పులు, పసుపు మార్కెట్లో చోటు చేసుకుంటున్న మార్పులు వంటి అంశాలపై ఆ సదస్సులో చర్చిస్తారు. ప్రపంచ బ్యాంకు, మహారాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి నిర్వహణలోని మహారాష్ట్ర వ్యవసాయ, గ్రామీణ పరివర్తన (స్మార్ట్) ప్రాజెక్టు, సుగంధ ద్రవ్యాల బోర్డు, వ్యవసాయ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొంటారు.

సిస్కోలో మరో 5,900 మంది ఔట్!

శాన్‌జోస్ (అమెరికా): అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. నెట్‌వర్క్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ సిస్కో మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ఈసారి ఏకంగా మొత్తం ఉద్యోగుల్లో ఏడు శాతం మందిని ఇంటికి పంపించబోతోంది. గత ఏడాది జూలై నాటికి సిస్కోలో 84,900 మంది పని చేస్తున్నారు. ఈ లెక్కన ఏడు శాతం మంది అంటే దాదాపు 5,900 మందిని కంపెనీ ఈసారి ఇంటికి పంపించబోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ సిస్కో కంపెనీ 4,000 మంది ఇంటికి పంపించింది. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ 15,000 మంది ఉద్యోగులను తీసివేస్తున్నట్టు ప్రకటించిన రెండు వారాలకే సిస్కో మరోసారి ఉద్యోగాల కోతకు దిగడం విశేషం. పడిపోతున్న ఆదాయాలు, లాభాలను కాపాడుకునేందుకు కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీలపై పెద్దఎత్తున దృష్టి పెట్టాలని సిస్కో భావిస్తోంది. ఇందులో భాగంగానే ఉద్యోగాల కోతకు దిగుతున్నట్టు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	486
వరంగల్	437	గోదావరి	486
చిత్తూరు	493	విశాఖపట్నం	490
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	95
వరంగల్	87	గుంటూరు	95
కరీంనగర్	87	ఒంగోలు	95
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	101
కర్నూలు	87	నెల్లూరు	101
విశాఖపట్నం	91	అనంతపురం	95
గోదావరి	95		

భారత్‌లోకి బీఎస్‌ఏ ఎంట్రీ

గోల్డ్ స్టార్ 650 విడుదల
ధర రూ.2.99 లక్షలు



ముంబై: ప్రపంచంలోనే అత్యంత పురాతన మోటార్ సైకిళ్ల బ్రాండ్ 'బర్మింగ్‌హామ్ స్మాల్ ఆర్మ్స్ కంపెనీ' (బీఎస్‌ఏ) తాజాగా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం మహీంద్రా గ్రూప్ చేతుల్లో ఉన్న ఈ కంపెనీ.. గోల్డ్ స్టార్ 650 మోటార్ సైకిల్‌ను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.2.99 లక్షలు. జావా, యెజ్డీ బైక్‌లను విక్రయిస్తున్న మహీంద్రా గ్రూప్ ప్రీమియం మోటార్ సైకిళ్ల విభాగం క్లాసిక్ లెజెండ్స్‌ను 2016లో బీఎస్‌ఏను కొనుగోలు చేసింది. 2021లో యూకే మార్కెట్లోకి రీఎంట్రీ ఇచ్చిన బీఎస్‌ఏ గోల్డ్ స్టార్ 650 బైక్ ప్రస్తుతం యూరప్, టర్కీ, న్యూజీలాండ్, ఫిలిప్పీన్స్‌లో అమ్ముడవుతోంది. తాజాగా భారత్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650కి పోటీగా మహీంద్రా ఈ బైక్‌ను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన డీలర్ల వద్ద ఈ బైక్‌ను కొనుగోలు చేయవచ్చని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్

3 వేరియంట్లు విడుదల చేసిన సంస్థ.. ప్రారంభ ధర రూ.74,999



కృష్ణగిరి (తమిళనాడు): ఓలా ఎలక్ట్రిక్ తాజాగా విద్యుత్ మోటార్ సైకిళ్ల విభాగంలోకి ప్రవేశించింది. రోడ్‌స్టర్ సిరీస్‌లో మూడు ఈ-బైక్‌లను గురువారం విడుదల చేసింది. అందులో రోడ్‌స్టర్ ఎక్స్ ప్రారంభ ధర రూ.74,999 కాగా, రోడ్‌స్టర్ ధర రూ.1,04,999గా ఉంది. రోడ్‌స్టర్ ప్రో మోడల్ ప్రారంభ ధరను రూ.1,99,999గా నిర్ణయించింది. రోడ్‌స్టర్, రోడ్‌స్టర్ ఎక్స్ బైక్‌ల డెలివరీ వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభం కానున్నాయని, రోడ్‌స్టర్ ప్రో మాత్రం వచ్చే ఏడాది దీపావళి నాటికి అందుబాటులోకి రానుందని కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాదు, ఓలా ఎలక్ట్రిక్ మరో రెండు కొత్త మోటార్ సైకిళ్లను సైతం మార్కెట్లోకి తీసుకురాబోతున్నట్లు సంకేతాలిచ్చింది. ఓలా వార్షిక సదస్సు 'సంకల్ప్ 2024'లో సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ భవిశ్ అగర్వాల్ ఈ-బైక్‌లను ఆవిష్కరించడంతో పాటు మరిన్ని కీలక ప్రకటనలను చేశారు.

ఓలా క్యాబ్ ఇక ఓలా కన్స్యూమర్: ఓలా తన ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవల ప్లాట్‌ఫామ్ ఓలా క్యాబ్స్ పేరును ఓలా కన్స్యూమర్‌గా మార్చింది. కంపెనీ ఇకపై ఆఫర్ చేయబోయే సేవల్లో క్యాబ్ బుకింగ్ ఒకటిగా ఉండనుంది. ఈ విభాగం ద్వారా పలు సేవలందించబోతున్నట్లు భవిశ్ తెలిపారు.

క్విక్ కామర్స్ కోసం పోర్టబుల్ డార్క్ వేర్‌హౌస్‌లు: ఓలా క్విక్ కామర్స్ సేవల్లోకి ప్రవేశిస్తున్నట్లు తెలిపింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ద్వారా బుకింగ్‌పై త్వరితగతిన డెలివరీ అందించేందుకు వీలుగా పోర్టబుల్ డార్క్ వేర్‌హౌస్‌లను నిర్మించనున్నట్లు, ఈ ఏడాది చివరినాటికివి అందుబాటులోకి రానున్నాయని భవిశ్ వెల్లడించారు. అయితే, నేరుగా తాము ఉత్పత్తులను విక్రయించే ఉద్దేశం లేదని.. డైరెక్ట్ టు కన్స్యూమర్ బ్రాండ్లు, ఇతర విక్రేతలు తాము విక్రయించే ఉత్పత్తులను స్టోర్ చేసుకునేందుకు ఈ డార్క్ స్టోర్లను నిర్మిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కంపెనీ ఈ-స్కూటర్లలో కృత్రిమ్ ఏఐ: ఓలా గ్రూప్‌నకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కృత్రిమ్ సేవలను సంస్థ ఎలక్ట్రిక్ స్కూటర్లలోనూ అందుబాటులోకి తేబోతున్నట్లు, ఈ దీపావళినాటికి బీటా వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు భవిశ్ తెలిపారు. అలాగే, కృత్రిమ్ ఏఐ కస్టమర్ కేర్ యాప్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 22 భాషల్లో అందుబాటులో ఉండే ఈ యాప్ ద్వారా డెవలపర్లు తమ కస్టమర్ కేర్ సేవలను యాంత్రీకరించుకోవచ్చన్నారు.ఓలా ఎలక్ట్రిక్, ఓలా క్యాబ్ ఇప్పటికే ఈ యాప్ సేవలను వినియోగించుకుంటున్నాయన్నారు.

ఏఐ చిప్‌ల తయారీలోకి కృత్రిమ్: కృత్రిమ్ ఏఐ చిప్‌ల తయారీలోకి ప్రవేశించబోతోంది. బోధి 1 పేరుతో ఏఐ చిప్‌లను తయారు చేస్తున్నట్టు, 2026 నాటికి తొలి చిప్ అందుబాటులోకి రానుందని భవిశ్ చెప్పారు.

ఓలా పే

ఓలా యాప్ ద్వారా క్యాబ్ రైడ్ లేదా ఫుడ్, కిరాణా సరుకుల ఆర్డర్ల కోసం యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలుగా కంపెనీ ఓలా పే సేవలను సైతం ప్రారంభించింది.

విద్యార్థులకు కెనరా బ్యాంక్ ప్రోత్సాహకాలు



విద్యార్థినికి చెక్ అందజేస్తున్న బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ వినూత్నమైన సేవలకు శ్రీకారం చుట్టింది. గురువారం బెంగళూరులోని ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనరా బ్యాంక్ ప్రతి శాఖ పరిధిలోను కనీసం ఆరేడు మంది ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభావంతమైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకి చెందిన విద్యార్థినులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 44,700 మంది విద్యార్థినులకు రూ.17.20 కోట్ల మేర నగదు బదిలీ చేశామన్నారు. ఏటా పేద బాలికలకు ప్రోత్సహించే విధానం కొనసాగుతుందన్నారు. ప్రతి గ్రామీణ బ్యాంకు శాఖ పరిధిలో పేద బాలికను దత్తత తీసుకుని ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు చదివిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే బ్యాంకులో వివిధ హోదాలలో పనిచేసి అనారోగ్యం, ప్రమాదాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలిచ్చినట్లు తెలిపారు. ఐదేళ్లుగా ఈ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. వయసుతో సంబంధం లేకుండా విద్యార్హతను బట్టి 150 మందికి ఉద్యోగాలిచ్చినట్లు చెప్పారు. స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్‌ను రూ.45 కోట్ల నుంచి 90 కోట్లకు పెంచేందుకు అనుమతులు లభించాయని ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన వారికి కూడా అన్ని సౌలభ్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

తీర్పుపై స్విస్ కోర్టుకు..



న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్ అప్పీల్‌ను క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కాస్) అడ్‌హాక్ డివిజన్ ఆర్బిట్రేటర్ జస్టిస్ అనాబెల్ బెనెట్ బుధవారం కొట్టివేశారు. ఇక.. వినేశ్‌పై అనర్హత వేటుకు సంబంధించి తదుపరి కార్యాచరణ ఏమిటనే విషయమై చర్చలు బయలుదేరాయి. తీర్పునకు సంబంధించి సింగిల్ లైన్ ఆర్డర్ కాపీ మాత్రమే వచ్చిందని పారిస్ కోర్టులో వినేశ్ కేసుపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున వాదించిన సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన విదుష్పత్ సింఘానియా శుక్రవారం తెలిపారు. తీర్పును ఎందుకు కొట్టి వేశారో సింగిల్ ఆర్డర్ కాపీలో లేదని చెప్పారు. పూర్తి వివరాలతో కూడిన తీర్పు కాపీ అందాల్సి ఉందన్నారు. కాస్ తీర్పుపై 30 రోజుల్లోగా స్విస్ ఫెడరల్ ట్రిబ్యునల్‌లో అప్పీలు చేస్తామని ఆయన తెలిపారు. స్విట్జర్లాండ్‌లోని లాసన్నెలో ఉన్న స్విస్ ఫెడరల్ కోర్టుకు వెళ్లే విషయంలో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే తమకు మార్గదర్శనం చేస్తారని విదుష్పత్ తెలిపారు. అక్కడ తీర్పు అనుకూలంగా వస్తే..వినేశ్‌కు రజత పతకం అందజేస్తారు.

ఇలా సవాలు చేయొచ్చు..

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), ప్రపంచ రెజ్లింగ్ పాలక మండలి..యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనలకు అనుగుణంగా కాస్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేయడానికి ఆస్కారముంది. కానీ తక్కువ అంశాల్లో మాత్రమే సవాలుకు చాన్సు ఉందని తెలిసింది. విచారణ నిబంధనలు ఉల్లంఘించినట్టు ప్రాథమికంగా తేలడం, పబ్లిక్ పాలసీలలో అననుకూలత..వంటి కారణాలతో కాస్ తీర్పును సవాలు చేయవచ్చని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

మేమంతా నీవెంటే..

ఫొగట్‌కు క్రీడాలోకం బాసట



న్యూఢిల్లీ: తన పిటిషన్‌ను కాస్ డిస్మిస్ చేయడంతో రెజ్లర్ వినేశ్ ఫొగట్‌తో పాటు యావత్ భారతావని నిరాశకు గురైంది. అయితే, రజత పతకం లభించకపోయినా వినేశ్ తమకు మాత్రం చాంపియనే అంటూ దేశ క్రీడారంగం ఆమెకు బాసటగా నిలిచింది. నిర్ణీత 50 కిలోలకుగాను 100 గ్రాములు అదనంగా బరువుండడంతో వినేశ్‌ను ఫైనల్ బౌట్‌కు అనర్హురాలిగా పారిస్ క్రీడల నిర్వాహకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఈ చీకట్లో నీ పతకాన్ని బలవంతంగా లాగేసుకున్నారు. అయినా, ప్రపంచం మొత్తం మీద నువ్వు వజ్రంగా వెలుగుతున్నావు' అని టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ట్వీట్ చేయగా.. 'దేశమంతా నీవెంటే ఉంది. వినేశ్ తలపైకెత్తుకొని ఉండాలి. మాకు, దేశానికి ఆమే చాంపియన్' హాకీ ఆటగాడు అమిత్ పోస్ట్ చేశాడు.

వినేశ్ స్పందన ఇలా..

కాస్ తీర్పుపై వినేశ్ నేరుగా స్పందించకున్నా..శుక్రవారం ఇన్‌స్టాలో ఆమె పోస్ట్ చేసిన ఫొటో ఆ స్టార్ రెజ్లర్ ఎంత వేదనలో కూరుకుపోయిందో తెలియజేసింది. మ్యాట్‌పై వెల్లికలా పడుకొని ముఖాన రెండు చేతులు పెట్టుకున్న ఆ చిత్రానికి 'రబ్బావే' అని పాటను జోడించింది. ప్రముఖ పంజాబీ సింగర్ ప్రతీక్ బచ్చన్ పాడిన 'రబ్బావే' అనే ఆ పాట 'దేవుడు తన పట్ల దయచూపలేదు' అనే సాహిత్యంలో కొనసాగడం గమనార్హం. దీంతో ఆమెలో గూడుకట్టుకున్న విషాదానికి ఆ ఫొటో అద్దం పడుతుందని నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.

యూఎస్ ఓపెన్‌లో ఒసాకాకు వైల్డ్‌కార్డ్

న్యూయార్క్: రెండుసార్లు చాంపియన్ నవోమి ఒసాకతోపాటు మాజీ విజేతలు వావ్రింకా, డొమినిక్ థీమ్, బియాంక అండ్రెస్క్యూకు యూఎస్ ఓపెన్ వైల్డ్ కార్డులు లభించాయి. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్ ఈనెల 26 నుంచి జరగనుంది. అమండా అనిసిమోవా, మెకార్టినీ కెస్లర్, అలెక్సా నోయల్, ఇవా జొవిచ్‌లకు కూడా వైల్డ్‌కార్డులు దక్కాయి.

'రిసార్ట్స్'లో వరల్డ్ చెస్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ తలపడే ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ వేదిక ఖరారైంది. సింగపూర్‌లోని 'రిసార్ట్స్ వరల్డ్ సెంటోసా'లో నవంబరు 23 నుంచి డిసెంబరు 15 వరకు చాంపియన్‌షిప్ జరగనుంది. చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను గుకేష్ చాలెంజ్ చేయనున్నాడు. 138 ఏళ్ల టోర్నీ చరిత్రలో ఆసియాకు చెందిన ఇద్దరు ప్లేయర్లు తలపడడం ఇదే తొలిసారి.

అమన్‌కు ప్రమోషన్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌కు పదోన్నతి దక్కింది. ఇప్పటిదాకా రైల్వేలో సాధారణ ఉద్యోగిగా విధులు నిర్వర్తించిన అమన్‌ను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా ప్రమోట్ చేస్తున్నట్టు ఉత్తర భారత రైల్వేస్ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా అమన్‌ను ఉత్తర భారత రైల్వేస్ జనరల్ మేనేజర్ శోభన్ చౌదురి ఘనంగా సత్కరించారు. పారిస్ క్రీడల్లో పతకం సాధించిన పిన్న వయసు భారత అథ్లెట్‌గా 21 ఏళ్ల అమన్ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.



ప్రధాని మోదీతో హాకీ ఆటగాళ్లు

ప్రతి క్రీడాకారుడూ చాంపియనే

పారిస్ అథ్లెట్లతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 'పారిస్‌లో పాల్గొన్న ప్రతి అథ్లెటూ చాంపియనే. మా ప్రభుత్వం క్రీడా రంగానికి మద్దతు కొనసాగిస్తుంది. అత్యున్నత క్రీడా సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడుతుంది' అని ప్రధాని మోదీ తెలిపారు. పారిస్‌లో ఒలింపిక్స్‌లో తలపడిన భారత బృందం ప్రధానిని ఆయన నివాసంలో గురువారం కలిసింది. ఈ సందర్భంగా ప్రధాని వారిని అభినందించడంతోపాటు అథ్లెట్లతో ముచ్చటించారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను కలుసుకోవడం అద్భుతంగా ఉంది. ఆ మెగా ఈవెంట్ సందర్భంగా అథ్లెట్లకు ఎదురైన అనుభవాల గురించి తెలుసుకున్నా' అని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు.

2036 ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమవుతున్నాం..

ప్రపంచ అతి పెద్ద క్రీడా పోటీలను నిర్వహించే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. ఈక్రమంలో 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ఉన్న ఏ అవకాశాన్నీ వదలబోమని ఎర్రకోటనుంచి చేసిన స్వాతంత్ర్యదిన ప్రసంగంలో స్పష్టంజేశారు. '2036 విశ్వక్రీడలను నిర్వహించాలన్నది భారత్ స్వప్నం. అందుకోసం మేం ఇప్పటికే చర్యలు ప్రారంభించాం' అని ఆయన గుర్తుచేశారు. భారత్‌తోపాటు సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఇక భారత్ నుంచి అహ్మదాబాద్ ఆతిథ్య నగరంగా రేస్‌లో నిలిచింది.



ఈ పిస్టల్‌తోనే పతకాలు..

పారిస్‌లో 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, సరబ్ జోత్‌తో కలిసి మిక్స్‌డ్‌లో మొత్తం రెండు కాంస్య పతకాలు సాధించిన షూటర్ మనూ భాకర్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ పోటీలలో తాను ఉపయోగించిన పిస్టల్‌ను మోదీకి చూపడంతోపాటు దానిని ఎలా ఉపయోగిస్తానో ఆమె వివరించింది. సరబ్ జోత్‌తోపాటు కాంస్య పతకం నెగ్గిన రైఫిల్ షూటర్ స్వప్నిల్ కుశాలేతో కూడా ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. పురుషుల 57 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ మోదీతో ఫొటో దిగడంతోపాటు తాను సంతకం చేసిన భారత జెర్సీని ప్రధానికి అందజేశాడు. అలాగే కాంస్య పతకం సాధించిన పురుషుల హాకీ జట్టు ప్రధానికి ప్రత్యేక కానుక అందజేసింది. జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీ, హాకీ స్టిక్‌ను మోదీకి బహూకరించింది. విశ్వ క్రీడల తర్వాత హాకీకి వీడ్కోలు పలికిన గోల్‌కీపర్ శ్రీజేష్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కాంస్య పతకాలను ధరించి ప్రధానితో ఫొటో దిగారు. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు భారత అథ్లెట్లు హాజరయ్యారు.

ఈ టీ20 వరల్డ్‌కప్ మా వల్ల కాదు

ఐసీసీ ప్రతిపాదనను తిరస్కరించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని అనిశ్చిత పరిస్థితుల కారణంగా అక్కడ జరగాల్సిన మహిళల టీ20 వరల్డ్‌కప్ సందిగ్ధంలో పడింది. ఈనేపథ్యంలో ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వాలంటూ ఐసీసీ చేసిన విజ్ఞప్తిని బీసీసీఐ తోసిపుచ్చింది. ఎందుకంటే వచ్చే ఏడాది మహిళల వన్డే వరల్డ్‌కప్ భారత్‌లోనే జరుగుతుంది. దీంతో వరుసగా రెండు ప్రపంచకప్‌లు నిర్వహించడం కష్టమనే భావనలో బోర్డు ఉంది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 3-20 మధ్య బంగ్లా వేదికగా టీ20 వరల్డ్‌కప్ జరగాలి. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాలో నిర్వహించే చాన్స్ లేకపోవడంతో శ్రీలంక, యూఏఈ వేదికలను పరిశీలిస్తున్నారు. ఈనెల 20న తుదినిర్ణయం వెలువడనుంది.

ఎన్‌సీఏలోనే లక్ష్మణ్



బెంగళూరు: మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్‌గా మరికొంతకాలం కొనసాగనున్నాడు. అతడి మూడేళ్ల పదవీకాలం వచ్చే నెలతో ముగియనుంది. కానీ లక్ష్మణ్‌ను మరో ఏడాదిపాటు ఎన్‌సీఏలోనే కొనసాగించాలని బీసీసీఐ భావిస్తోంది. మరోవైపు బెంగళూరు శివారులో అత్యంత ఆధునికంగా నిర్మిస్తున్న నూతన ఎన్‌సీఏ ముగింపు దశకు చేరింది. ఇందులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మూడు క్రికెట్ స్టేడియాలు, 45 ప్రాక్టీస్ పిచ్‌లు, ఇండోర్ క్రికెట్ పిచ్‌లు, ఒలింపిక్ ప్రమాణాలతో కూడిన స్విమ్మింగ్‌పూల్, రిహాబిలిటేషన్ సెంటర్ ఉన్నట్టు బీసీసీఐ కార్యదర్శి జైషా ఎక్స్‌లో ఫొటోలను షేర్ చేశాడు.

ఒలింపిక్ అథ్లెట్లు కూడా..

కొత్త ఎన్‌సీఏలో వసతులను క్రికెటర్లే కాకుండా స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా సహా ఇతరులు కూడా వినియోగించుకోవచ్చనిజైషా తెలిపాడు.

సచిన్.. అధరహో!


● రూ. 2.15 కోట్లకు తలైవాస్ కొనుగోలు
● మహ్మద్‌రెజాకు రూ. 2.07 కోట్లు



మహ్మద్‌రెజా

ముంబై: ప్రొ కబడ్డీ సీజన్-11 వేలంలో ఆటగాళ్లపై కాసుల వర్షం కురిసింది. అత్యంత ఖరీదైన ఆటగాడిగా రైడర్ సచిన్ తన్వర్ సత్తా చాటగా.. విదేశీ ఆటగాళ్ల జాబితాలో ఇరాన్ ఆల్‌రౌండర్ మహ్మద్‌రెజా చియనెహ్ రూ. 2 కోట్ల మార్క్‌ను దాటాడు. రెండు రోజులపాటు జరిగే వేలంలో మొత్తం 500 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. గురువారం జరిగిన తొలిరోజు వేలంలో మొత్తం 8 మంది ఆటగాళ్ల ధర రూ. కోటి దాటగా.. అందులో ఏడుగురు భారత ప్లేయర్లు ఉండడం విశేషం. కాగా, సచిన్ కోసం తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ కూడా చివరిదాకా బిడ్డింగ్‌లో నిలిచినా.. చివరకు అతడిని తమిళ్ తలైవాస్ రూ. 2.15 కోట్లకు ఖరీదు చేసింది. సచిన్ తన కనీస ధర రూ. 30 లక్షలకు ఏడు రెట్లు ఎక్కువకు అమ్ముడుపోవడం విశేషం. రైడర్ గుమాన్ సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ. 1.97 కోట్లకు దక్కించుకోగా, గత సీజన్‌లో రూ. 2.6 కోట్లతో టాప్ లేపిన హైఫ్లయర్ పవన్ కుమార్ సెహ్రావత్‌ను ఈసారి తెలుగు టైటాన్స్ రూ. 1.72 కోట్లకు మళ్లీ చేజిక్కించుకుంది. ఆల్‌రౌండర్ భరత్‌ను యూపీ యోధాస్ రూ. 1.30 కోట్లకు, మణీందర్ సింగ్‌ను బెంగాల్ రూ. 1.15 కోట్లకు, డిఫెండర్ సునీల్ కుమార్‌ను యు ముంబా రూ. 1.01 కోట్లకు కొనుగోలు చేశాయి. కాగా, బాహుబలి అంటూ ఎంతో క్రేజ్ సంపాదించుకొన్న సిద్దార్థ్ దేశాయ్‌ను దబాంగ్ ఢిల్లీ కేవలం రూ. 26 లక్షలకు తీసుకోవడం గమనార్హం. రైడర్లు అంజిక్యా పవార్ రూ. 1.10 కోట్లకు, పర్‌దీప్ నర్వాల్ రూ. 70 లక్షలకు బెంగళూరు బుల్స్ సొంతమయ్యారు. యువ రైడర్ మంజీత్‌ను ముంబా రూ. 80 లక్షలకు దక్కించుకుంది. కాగా, విదేశీ ప్లేయర్లలో మహ్మద్‌రెజా చియనెహ్ ఊహించినట్టే హాట్‌కేక్‌గా అమ్ముడయ్యాడు. అతడిని హరియాణా స్టీలర్స్ రూ. 2.07 కోట్లకు ఎగరేసుకుపోయింది. ఇరాన్ డిఫెండర్ ఫజల్ అత్రాచెలిని బెంగాల్ వారియర్స్ రూ. 50 లక్షలకే దక్కించుకొంది. ఆరో సీజన్‌లోనే కోటికిపైగా పలికిన అత్రాచెలిపై ఫ్రాంచైజీలు ఈసారి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆల్‌రౌండర్లు రోహిత్ గులియా, విశ్వంత్‌లు అన్‌సోల్డ్‌గా మిగిలారు. మరికొంత మంది ఆటగాళ్ల వేలం శుక్రవారం జరగనుంది.

ప్రొ కబడ్డీ లీగ్ వేలం



సచిన్ తన్వర్

రాజ్యాంగం.. నేటి పాలకులూ మంచివారే!

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్టుగా.. 'రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేసేవాడు మంచివాడు కాకపోతే అది చెడు ఫలితాలనిస్తుంది'. రాజ్యాంగంతో పాటు ఇప్పుడు పాలకులూ మంచి వారే కాబట్టి ప్రజలకు నూటికి నూరుశాతం మంచే జరుగుతుంది. మంచి చేసే మా ప్రభుత్వానికి మీ ఆశీస్సులు సదా ఉండాలి.

అన్నదానంలో అందరూ భాగస్వాములు కావాలి

అన్నదాన కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలి. నలుగురికి అన్నం పెట్టే కార్యక్రమానికి విరాళాలు ఇచ్చి ఆ మంచిలో మీరూ భాగస్వాములు కావాలి. మీ పుట్టిన రోజు, పెళ్లి రోజు, మీ ఇంట్లో శుభకార్యాల రోజున మీరు విరాళం ఇస్తే, మీ పేరుతో ఆరోజు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పెడతాం - చంద్రబాబు



రాష్ట్రానికి ఐదేళ్ల తర్వాత మళ్లీ స్వాతంత్ర్యం

విధ్వంసక పాలన నుంచి విముక్తి.. ఇక అభివృద్ధితో దూసుకుపోతాం.. అక్టోబరు 2న విజన్-2047 విడుదల

నదుల అనుసంధానం చేసి తీరుతాం.. కక్ష సాధింపులు ఉండవు.. తప్పుచేసిన వారిని వదలం.. స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు

కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. నేరస్థులు రాజకీయ ముసుగులో వచ్చి రౌడీయిజం చేస్తే ఉపేక్షించేది లేదు. మా ప్రభుత్వంలో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపులకు తావులేదు. కానీ తప్పు చేసిన ఎవరినీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. అవినీతికి పాల్పడి, ప్రజల ఆస్తులను దోచుకున్న వారి నుంచి ఆ ఆస్తులు చట్టపరంగా తిరిగి రాబట్టి ప్రజలకు అందేలా చేస్తాం.



అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల చీకటి పాలనతో విసిగిపోయిన ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని, విధ్వంసక పాలన నుంచి విముక్తి కలిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'రాజధాని కూడా లేని పరిస్థితుల్లో నాడు పాలన ప్రారంభించాం. ఎక్కడ కూర్చుని పనిచేయాలో కూడా తెలియని అనిశ్చితి నుంచి పాలన మొదలు పెట్టి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించాం. రాష్ట్రానికి నడిబొడ్డుగా ఉండే అమరావతి ప్రాంతంలో రాజధానికి శంకుస్థాపన చేసుకున్నాం. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి ఐదేళ్లలో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమిచ్చాం. ఒక యజ్ఞం లా పోలవరాన్ని పరుగులు పెట్టించి 72 శాతం పనులు పూర్తి చేశాం. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ పాటికే పోలవరం పూర్తయ్యేది.

ప్రజల ఆశలు నెరవేరుస్తాం

'120కి పైగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, శాంతిభద్రతలు, అందరికీ ఉపాధి, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలతో రాష్ట్రం దూసుకుపోతున్న క్రమంలో 2019లో వచ్చిన ఎన్నికల ఫలితాలు రాష్ట్రాన్ని చీకటిమయం చేశాయి. ప్రజావేదిక ధ్వంసంతో ప్రారంభమైన నాటి విధ్వంస పాలనతో సంపద సృష్టి, ఉపాధి కల్పనా కేంద్రమైన ప్రజారాజధాని అమరావతిని పురిటిలోనే చంపే ప్రయత్నాలు చేశారు. గత ప్రభుత్వ అసమర్థ విధానాలతో రాష్ట్ర అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. గత ఐదేళ్ల చీకటి పాలనలో విసిగిపోయిన ప్రజల్లో చైతన్యం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవంతో అసాధారణ విజయంతో కూటమికి పట్టం కట్టారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఏకపక్షంగా పట్టం కట్టారు. కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారు. వాటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది.

హామీల అమలుతో మాట నిలబెట్టుకున్నాం

'గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ఐదు కీలక అంశాలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నాం. బాధ్యతలు స్వీకరించిన రోజునే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేసి చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేశారు. అందుకే రెండో సంతకంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. పింఛను మొత్తాన్ని పెంచి ఇంటివద్దే పంపిణీ చేస్తున్నాం' అని చెప్పారు. 'యువత నైపుణ్యం పెంచేందుకు.. దేశంలోనే తొలిసారి నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టి, ఐదో సంతకం దీనిపైనే పెట్టాం. గత ప్రభుత్వ ఇసుక దోపిడీపై సీఐడీ విచారణ జరిపిస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచిత ఇసుక విధానంపై నిర్ణయం తీసుకున్నాం. అందరి అభిప్రాయాలు తీసుకుని స్వర్ణాంధ్రప్రదేశ్-విజన్-2047ను అక్టోబరు 2న విడుదల చేస్తాం.

రైతులకు సాయం అందిస్తాం

రైతు సబ్సిడీలను త్వరలో పునరుద్ధరిస్తాం. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తాం. అన్నదాత పథకం కింద ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తాం. రానున్న వంద రోజుల్లో కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొస్తాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాన్ని మళ్లీ అగ్రగామిగా చేస్తాం. పారిశ్రామికాభివృద్ధికి భోగాపురం కేంద్రంగా మారనుంది'.

ఇంగ్లీషుకు ప్రోత్సాహం.. మాతృభాషకు ప్రాధాన్యం

'ఇంగ్లీషు బాషకు ప్రోత్సాహమిస్తూనే ప్రాథమిక స్థాయి ఉంచి మాతృభాష అయిన తెలుగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. 2014-19 నాటి పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. గిరిజన ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్‌ల వ్యవస్థలను బలోపేతం చేస్తాం. ఎన్టీఆర్ బేబీ కిట్స్‌ను తిరిగి ప్రవేశపెడతాం' అని చంద్రబాబు చెప్పారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కండి

ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా దేశంలో జనాభా పెరుగుదలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చంద్రబాబు చెప్పారు. 'ఇప్పటివరకు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాం. నేడు జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాలి. లేకపోతే రానున్న రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరిగి పనిచేసే వాళ్ల సంఖ్య తగ్గుతుంది' అని తెలిపారు. గతంలో పీ3 విధానంతో సంపద సృష్టించామని, ఇప్పుడు పీ4 పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంతో జీరో పావర్టీ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయం

- ఆ దిశగా అడుగులు వేస్తున్నాం
- ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై చర్యలు తప్పవు: పవన్ కల్యాణ్



కాకినాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు. గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా పవన్ గురువారం కాకినాడలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, ప్రసంగించారు. గత ప్రభుత్వంలో గాడి తప్పిన వ్యవస్థలకు పునర్వైభవం తీసుకురావడంతోపాటు ఆర్థికంగా అతలాకుతలమైన రాష్ట్రానికి జీవం పోస్తామన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా విధించుకుని పని చేస్తామని తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుగా మాట్లాడే వారిపై నిఘా..

'గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. సోషల్ మీడియాలో మహిళలపై తప్పుగా మాట్లాడే వారిపై నిఘా పెడతాం. మహిళలు, ఆడబిడ్డలను కించపరిచేలా అసభ్యంగా మాట్లాడే వారిని ఉపేక్షించం. సోషల్ మీడియాలో పోస్టుల దగ్గర నుంచి మెసేజ్‌ల వరకు ఆడబిడ్డలపై వేధింపులకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తి లేదు' అని పవన్ హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన విషయాలపై గత ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించలేదన్నారు.

కూతురు ఆద్యతో పవన్ సెల్ఫీ

కాకినాడ సిటీ, ఆగస్టు 15: కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వేదికపై తన కూతురు ఆద్యతో సెల్ఫీ తీసుకున్నారు. దీంతో ఒక్కసారిగా గ్యాలరీ నుంచి అభిమానులు కేరింతలు కొట్టారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి గౌరవ వందనం స్వీకరిస్తూ పవన్‌కల్యాణ్ వేదిక వద్దకు వస్తున్న సమయంలో పబ్లిక్ గ్యాలరీ నుంచి సందర్శకులు కేరింతలు కొట్టారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు నృత్య ప్రదర్శన చేస్తున్నప్పుడు పవన్ వేదిక మీద నుంచి వారివద్దకు వచ్చి అభినందించారు.

పవన్‌కు బొకే ఇచ్చి.. సెల్యూట్ చేసిన డాగ్

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు డాగ్ షో అందరినీ ఆకట్టుకుంది. ఈ షోలో పవన్‌కల్యాణ్‌కు డాగ్ బొకే ఇచ్చి సెల్యూట్ చేసింది. ఆ బొకే అందుకున్న పవన్.. ప్రతిగా ఆ డాగ్‌కి సెల్యూట్ చేశారు.

విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతిలోని హైకోర్టు ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల





డిప్యూటీ సీఎంకు బొకే తెస్తున్న పోలీసు జాగిలం, బొకే ఇచ్చిన జాగిలానికి నమస్కరిస్తున్న పవన్



ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్, సీజే, సీఎం దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సముద్ర గర్భంలో మువ్వన్నెల రెపరెపలు

సాగర్‌నగర్: విశాఖకు చెందిన 'లైవ్ ఇన్ అడ్వంచర్స్' సభ్యులు గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సముద్రంలో 78 అడుగుల లోతులో జాతీయ జెండాను ఎగురవేసి ఔరా అనిపించారు. రుషికొండ తీరం సమీపంలో 'అడ్వంచర్స్' డైరెక్టర్ బలరాంనాయుడు ఆధ్వర్యంలో స్కూబా డైవర్స్ జాతీయ జెండాను చేబూని సముద్ర గర్భంలోకి వెళ్లి జాతీయ జెండాను రెపరెపలాడించారు.




సముద్రంలో 78 అడుగుల లోతున జాతీయ జెండాను ఎగురవేసిన స్కూబా డైవర్స్

భరతమాత విగ్రహ పునఃప్రతిష్ఠ

- గతంలో జగన్ ఇంటిముందు తొలగించిన చోటే..

తాడేపల్లి టౌన్, ఆగస్టు 15: తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటికి వెళ్లే రోడ్ మొదట్లో గతంలో తొలగించిన చోటే భరతమాత విగ్రహాన్ని గురువారం మళ్లీ పునఃప్రతిష్ఠ చేసి ఆవిష్కరించారు. నాడు జగన్ ఇంటి ముందు విశాలమైన రోడ్డు నిర్మాణం కోసం పేదల ఇళ్ల తొలగింపుతో పాటు ఎన్నో ఏళ్లుగా ఉన్న భరతమాత విగ్రహాన్ని అప్పట్లో అధికారులు తొలగించారు. భరతమాత సర్కిల్‌గా పేరుగాంచిన ఆ ప్రాంతంలో విగ్రహ తొలగింపును అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీతో పాటు బీజేపీతో సహా పలు పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. అవేమీ పట్టించుకోకుకుం డా అర్ధరాత్రి సమయంలో క్రేన్ సా యంతో విగ్రహాన్ని తొలగించేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగనే, మాజీ సీఎం జగన్ ఇంటి ముందు ఉన్న రోడ్‌కు ఆంక్షలు తొలగించి, అందరూ ప్రయాణించే విధంగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి నారా లోకేశ్ చేశారు. అదే విధంగా రోడ్ కోసం తొలగించిన భరతమాత విగ్రహాన్ని అదే ప్రదేశంలో ఆవిష్కరించడంతోపాటు పురప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి భరతమాత విగ్రహాన్ని ఆవిష్కరించి, అందరితో జాతీయ గీతాలపన చేయించారు.



భరతమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన శివస్వామి, బీజేపీ నేతలు

మారుమూల ప్రాంతాలకు న్యాయ సేవలు

- వసతుల కల్పనకు త్రికరణశుద్ధితో పనిచేస్తున్న ఏపీ ప్రభుత్వం
- హైకోర్టులో ఆగస్టు 15 వేడుకల్లో సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- చట్టసభల్లో ఫలప్రదమైన చర్చలు జరగాలి: స్పీకర్ అయ్యన్న

అమరావతి, న్యూఢిల్లీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సీజే మాట్లాడుతూ... 'సాధారణ ప్రజలకు న్యాయం అందించడంలో జరుగుతున్న జాప్యాన్ని, అవరోధాలను అధిగమించే దశలో దేశ న్యాయవ్యవస్థ ఉంది. మారుమూల ప్రాంతాలకు న్యాయసేవలను తీసుకెళ్లేందుకు, న్యాయవ్యవస్థ శక్తివంతంగా పనిచేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ఏపీ ప్రభుత్వం త్రికరణశుద్ధితో పనిచేస్తుంది' అని అన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.చిదంబరం, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ... 'స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు. ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. దేశంలో జనాభా సంఖ్యకు తగ్గట్లు న్యాయమూర్తుల సంఖ్య లేదు. ఈ కారణంగా కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఏపీలో న్యాయమూర్తుల ఖాళీలను తక్షణం భర్తీ చేయాలి' అని అన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి: స్పీకర్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతి అసెంబ్లీ ముందు జాతీయ పతాకాన్ని ఎగురవేసిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 'ప్రతి పౌరుడు దేశం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, తన కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించాలి. చట్టసభల్లో ప్రజాసమస్యలపై ఫలప్రదమైన చర్చలు జరగాలి' అని ఆకాంక్షించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ... 'ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన పేదలందరికీ అందాలి. అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని అన్నారు.

న్యూఢిల్లీ ఏపీ భవన్‌లో...

దేశ రాజధానిలోని ఏపీ భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, అడిషనల్ కమిషనర్ హిమాంశు కౌశిక్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.



ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లోకేశ్

రాజ్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోం


అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఆయన సతీమణి గుడియా ఠాకూర్ హాజరయ్యారు. చంద్రబాబు దంపతులు, పవన్ కల్యాణ్, హైకోర్టు సీజే దంపతులు.. గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. జాతీయ గీతాలాపన అనంతరం అతిథుల వద్దకు గవర్నర్ వెళ్లి పేరు పేరున పలకరించారు. ఆరు గంటలకు జాతీయ గీతాలాపనతో ఎట్ హోం కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులు, డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, ఎంపీలు కేశినేని చిన్ని, బాలశౌరి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి.. పోలీసులు, ఎన్‌సీసీ, మాజీ సైనికుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రతిబింబించే శకటాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగర ప్రజలు తిలకించేందుకు వీలుగా వేడుకల అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం నుంచి బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు రింగ్, విజయాటాకీస్, ఓల్డ్ బస్టాండ్, రాఘవయ్య పార్కు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తదితర ప్రాంతాల మీదుగా శకటాల ప్రదర్శన నిర్వహించారు.

పాఠశాల విద్య శకటానికి మొదటి బహుమతి

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 9 శాఖలు శకటాలను ప్రదర్శించగా, పాఠశాల విద్యాశాఖ శకటం మొదటి బహుమతి సాధించగా, పశు సంవర్ధకశాఖ, మహిళాభివృద్ధి-శిశు సంక్షేమశాఖల శకటాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ, రైతు సంక్షేమంపై పశుసంవర్ధకశాఖ, ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా సంక్షేమంపై సెర్ప్, గ్రామీణాభివృద్ధిశాఖ, అమరావతి రాజధానిపై సీఆర్‌డీఏ ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా, నగరంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు మువ్వన్నెల రంగుల దుస్తులు ధరించి కూర్చోవడంతో స్టేడియం ప్రత్యేక శోభను సంతరించుకొంది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించినప్పుడు విద్యార్థులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ప్రసంగం పూర్తయ్యే దాకా ఆసక్తిగా విన్నారు. గతానికి భిన్నంగా ఈసారి క్రమశిక్షణతో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయని పలువురు వ్యాఖ్యానించారు.



మొదటి బహుమతి గెలుచుకున్న విద్యా శాఖ శకటం

సంక్షేమానికి కోత పెట్టం

- సూపర్ సిక్స్ హామీలకు కండీషన్లు ఉండవు
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి లోకేశ్




గుంటూరులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి లోకేశ్

గుంటూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు ఎలాంటి కండీషన్లు ఉండవని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అనవసరమైన నిబంధనలతో సంక్షేమ కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో కోత పెట్టబోమన్నారు. గురువారం ఉదయం గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశాన్నిచ్చారు. తొలుత జాతీయ జెండాని ఎగుర వేసి ఓపెన్ టాప్ వాహనంలో పరేడ్‌ని సందర్శించారు. అనంతరం వేడుకలకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. యువతకు 20 లక్షల ఉద్యోగా కల్పన హామీ అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ, ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు శాంతి, అహింస అనే ఆయుధాలతో స్వేచ్ఛని సాధించుకున్నారని మంత్రి చెప్పారు. ప్రజలు, ప్రజాసంఘాలు మాట్లాడేందుకు స్వేచ్ఛ లభించిందన్నారు. ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వచ్చిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న ఈ స్వాతంత్ర్య వేడుకల్లో అందరి కళ్లలో ఆనందం కనిపిస్తున్నదని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు అన్నతో సమానమని మంత్రి లోకేశ్ తన విధేయతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సేవకులమై ప్రజల కన్నీరు తుడుస్తాం

- 'వారధి' ప్రారంభంలో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి
- వైసీపీ నేతలు ఉపాధి నిధుల్లో 500 కోట్లు కొట్టేశారని విమర్శ

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజలే దేవుళ్లన్న ఎన్టీ రామారావు, జనతా జనార్దన్ అన్న నరేంద్ర మోదీ.. వ్యాఖ్యల స్ఫూర్తితో ప్రజలకు సేవకులమై వారి కన్నీరు తుడుస్తాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆమె 'వారధి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రోజుకొక ప్రజా ప్రతినిధి పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల వినతులు స్వీకరిస్తారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు. ప్రతి సమస్యను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపి పరిష్కారం దిశగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పని చేస్తారు' అని అన్నారు. కాగా, గురువారం పలువురు సమస్యలపై వినతులు ఇచ్చారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కొత్రపాటిపల్లెలో కల్లూరి బాబు అనే వ్యక్తిని వైసీపీ నాయకుడు రాజారెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 28న హత్య చేయించినా పోలీసులు చర్య తీసుకోలేదని బాధితులు వాపోయారు. 'కృష్ణా జిల్లా వీరపనేనిగూడెం, టెంపల్లి, మర్లగూడెం గ్రామాలకు అనుకూలంగా ఉన్న ర్యాంపును నేషనల్ హైవే అధికారులు తొలగించారు. దీంతో అదనంగా నాలుగు కిలోమీటర్లు చుట్టుకుని రైల్వే గేటు దాటి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ర్యాంపు తిరిగి ఏర్పాటు చేయించాలి' అని గ్రామస్తులు కోరారు. ప్రకాశం జిల్లాలో 2019-24 మధ్య కేంద్రం ఇచ్చిన 3,383 కోట్ల ఉపాధి నిధుల్లో రూ.500 కోట్లు వైసీపీ నేతలు అవినీతి చేశారని, డ్వామా అధికారులపై విచారణ జరిపించాలని ఆ జిల్లాకు చెందినవారు కోరారు. కాగా, 40 కోట్ల మంది భారతీయుల పోరాట ఫలితమే దేశానికి స్వాతంత్ర్యమని పురందేశ్వరి అన్నారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు.



విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి



గురువారం ఎట్ హోం కార్యక్రమంలో మంత్రి లోకేశ్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పరస్పర అభివాదం

ప్రతిపక్ష నేత వెనుక వరుసలోనా..?

- మోదీకి ఇష్టమున్నా లేకున్నా ప్రజలు రాహుల్‌ను ఎన్నుకున్నారు: షర్మిల


అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్న రాహుల్ గాంధీని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వెనుక వరుసలో కూర్చోబెడతారా? అంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 'దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చింది కాంగ్రెస్సే. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వెనుక వరుసలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని కూర్చోబెట్టడం ఏమిటి? మోదీకి ఇష్టమున్నా లేకున్నా దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో రాహుల్ గాంధీ కలుస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. బీజేపీ మతతత్వ పార్టీ. జాతీయ జెండాను బీజేపీ అవమానించింది. మూడు రంగుల జెండాను గౌరవించబోమని బీజేపీ చెప్పింది. ఒకే రంగు ఉండాలనడం ద్వారా త్రివర్ణ పతకాన్ని అవమానించింది' అని షర్మిల అన్నారు.

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం: పల్లా

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నాటి సమర యోధుల ప్రాణ త్యాగాల ఫలితంగానే నేడు భారతీయులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించగలుగుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీడీపీ జాతీయ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. 'బ్రిటీష్ కాలంలో రూ.45 లక్షల కోట్లు దోచుకుంటే.. గత వైసీపీ పాలకులు అంతకంటే ఎక్కువే దోచుకున్నారు. గత వైసీపీ పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థల్ని పునర్నిర్మించుకుంటూ.. సుపరిపాలన వైపు సాగడమే కూటమి ప్రభుత్వ కర్తవ్యం' అని పల్లా అన్నారు. కాగా, మాజీ ఎంపీ లాల్‌జాన్ బాషా వర్ధంతి సందర్భంగా ఆయనకు పార్టీ నేతలు నివాళులర్పించారు.

టీడీపీ కార్యకర్తకు సింగపూర్ తెలుగు ఫోరం సాయం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఓ టీడీపీ కార్యకర్తకు సింగపూర్ తెలుగు ఫోరం ఆర్థిక సాయం అందించింది. టీడీపీ కార్యకర్త తుమ్మల సత్య చాలా కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని వినతికి స్పందించిన సింగపూర్ తెలుగు ఫోరం సభ్యులు రూ.2.14 లక్షలు విరాళంగా సేకరించారు. ఆ మొత్తాన్ని గురువారం ఇక్కడ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా సత్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ ఫోరం సభ్యులు ఇంటూరి మనోహర్, గుంటుపల్లి నవీన్, గుంటుపల్లి రమేశ్, పొన్నికంటి సాంబశివరావు పాల్గొన్నారు.



సాహసమే!

- వరద ఉండగానే స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- తుంగభద్ర జలాలను కాపాడటమే లక్ష్యంగా ప్రయత్నం
- నేడు గైడ్ యాంగిల్‌లోకి స్టాప్‌లాగ్ ఎలిమెంట్
- 1624 అడుగుల వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర
- అక్కడి నుంచి 11 అడుగులు నీటిలోనే కిందికి దించాలి
- ప్రక్రియలో అత్యంత కీలకమైన దశ ఇదే
- పాత గేటు ముక్క గాడిలో ఇరుక్కున్నట్లు గుర్తింపు

(రాయదుర్గం/బళ్లారి/కర్నూలు - ఆంధ్రజ్యోతి)

నాడు దివి నుంచి భువికి గంగను దించేందుకు భగీరథ మహర్షి మహా ప్రయత్నమే చేశారు. నేడు... తుంగభద్రమ్మను కాపాడుకునేందుకు ఇంజనీర్లు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్టుగేటు స్థానంలో స్టాప్‌లాగ్ బిగించే ప్రక్రియ గురువారం పకడ్బందీగా మొదలైంది. 'ప్లాన్ -ఏ'లో భాగంగా అత్యంత సున్నితమైన, ప్రమాదకరమైన పనులను చేపట్టారు. జిందాల్‌లో తయారు చేయించిన స్టాప్‌లాగ్ తొలిబ్లాక్‌ను గురువారం భారీ వాహనంపై ఆనకట్ట వద్దకు తరలించారు. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, ఐదుగురు ఇంజనీర్ల పర్యవేక్షణలో తమిళనాడుకు చెందిన కార్మికులు బ్లాక్‌ను కిందికి దించారు. గేటు అమరిక కోసం కౌంటర్ వెయిట్ కింది భాగంలో గంట పాటు వెల్డింగ్ చేశారు. 1635 అడుగుల వద్ద స్టాప్‌లాగ్‌ను గైడ్ యాంగిల్‌లోకి (గేటును అటూఇటూ పట్టి ఉంచే నిర్మాణం) దించాల్సి ఉంది. 60 అడుగుల వెడల్పు... నాలుగు అడుగుల ఎత్తు... 13 టన్నుల బరువైన భారీ ఇనుప నిర్మాణమిది! అయితే... కొలతల్లో కాస్త తేడా వచ్చింది. రాతి గేట్‌వాల్ కన్నా ప్రస్తుతం తయారు చేయించిన స్టాప్‌లాగ్ రెండు అంగుళాలు ఎక్కువైంది. దీంతో... రెండు వైపులా ఒక్కో అంగుళం చొప్పున అరగదీయాల్సి వస్తోంది. రాత్రి 10 గంటల దాకా ఆ పని కొనసాగింది. ఆ తర్వాత పనులను నిలిపివేశారు. శుక్రవారం స్టాప్‌లాగ్ బ్లాక్‌ను అమర్చే ప్రక్రియ తిరిగి ప్రారంభిస్తారు. సుమారు 110 మంది కార్మికులు ఇందులో భాగస్వాములయ్యారు.

ఆ 11 అడుగులు అత్యంత కీలకం

స్టాప్‌లాగ్‌ను 1635 అడుగుల ఎత్తులో గైడ్ యాంగిల్‌లో అమర్చడం ఈ మొత్తం ప్రక్రియలో తొలిఘట్టం. స్టాప్‌లాగ్‌ను అటూ ఇటూ అంగుళం చొప్పున తగ్గించిన అనంతరం... గైడ్ యాంగిల్‌లో కూర్చోబెడతారు. అక్కడి నుంచి నీటిమట్టం తగిలే దాకా... అంటే 1624 అడుగుల వరకు సులువుగానే స్టాప్‌లాగ్ బ్లాక్‌ను కిందికి దించవచ్చు. ఆ తర్వాతి నుంచి 11 అడుగులు కిందికి, స్పిల్‌వే లెవెల్ వద్ద బెడ్ మీద కూర్చోబెట్టాలి! ఈ ప్రక్రియలో అత్యంత సంక్లిష్టమైనది, కీలకమైనది ఇదే! స్పిల్‌వే నుంచి శరవేగంగా దూసుకొస్తున్న నీటి ప్రవాహాన్ని ఆపుతూ... స్టాప్‌లాగ్ బ్లాక్‌ను లోపలికి దించాలి. ఈ 11 అడుగుల ప్రయాణం నీళ్లలోనూ సాగుతుంది. అయితే... కొట్టుకుపోయిన 19వ గేటు తాలూకు ముక్క ఒకటి లోపలే ఇరుక్కున్నట్లు గుర్తించారు. దానిని కూడా తొలగించాల్సి ఉంది. ఇది రాతి కట్టడం కావడంతో... ఒక్క రాయి దెబ్బ తిన్నా పెను ప్రమాదం తలెత్తే ప్రమాదముందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి అడుగూ ఆచితూచి వేస్తున్నారు. పనుల నేపథ్యంలో డ్యామ్ సమీపానికి ఎవ్వరినీ అనుమతించడం లేదు. తుంగభద్ర ఆనకట్ట కింది భాగంలో నది రెండు పాయలుగా ప్రవహిస్తోంది. అక్కడికి కూడా ప్రజలను వెళ్లనివ్వడం లేదు. పూర్తి స్థాయిలో నిషేధం విధించారు. ప్రస్తుతం జిందాల్‌లో తయారైన స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను అమర్చే ప్రక్రియ మొదలుపెట్టారు. ఇంకా... నారాయణ ఇంజనీరింగ్ హిందూస్థాన్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లలోనూ బ్లాక్‌లు దాదాపుగా సిద్ధమయ్యాయి.

నీటిని కాపాడాలనే లక్ష్యంగా..



తుంగభద్ర డ్యాం వద్ద స్టాప్‌లాగ్ ఏర్పాటు పనులు

ఇంజనీర్ల శ్రమ ఫలించి స్టాప్‌లాగ్ ఏర్పాటు విజయవంతం కావాలని... కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, కొప్పళ్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం, కడప ఆయకట్టు రైతులు ప్రార్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో... వరద వేగంలోనూ ప్రాణాలను పణంగాపెట్టి ఇంజనీర్లు, సిబ్బంది సాహసోపేతంగా పని చేస్తున్నారు. డ్యామ్ 19వ గేటు ఈనెల 10వ తేదీన కొట్టుకుపోయింది. ఆ సమయంలో 105.788 టీఎంసీల నీటి నిల్వ ఉంది. స్పిల్‌వే లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాంను ఖాళీ చేసి ఆ తరువాత స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు చేయాలని మొదట్లో భావించారు. అంటే.. దాదాపు 62 టీఎంసీల నీటిని వృథాగా కిందికి వదిలేయడమే! అదే జరిగితే కర్ణాటక సహా కరువు రాయలసీమ జిల్లాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. దీంతో వీలైనంతగా నీటిని కాపాడుకోవాలనే సంకల్పంతో గురువారం 1625.22 అడుగుల లెవల్‌లో 77.21 టీఎంసీలు నీటి నిల్వ ఉండగానే స్టాప్‌లాగ్‌ను అమర్చే పని ప్రారంభించారు.

ఇది మోడల్ కావాలి..

ఉధృతంగా ప్రవహిస్తున్న నీటికి అడ్డుకట్ట వేస్తున్న స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ సాహసోపేతమైనదని క్రస్ట్‌గేట్ నిపుణుడు కన్నయ్య నాయుడు అన్నారు. దేశంలో మొదటిసారి ఇలాంటి ప్రయత్నం జరుగుతోందని, ఇది విజయవంతం కావాలని, ఇలాంటి సమస్యలకు మున్ముందు మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

ఆ ఇద్దరు.. 'ఉత్తములు' కారు!

- ఉత్తమ సేవా పురస్కారాల జాబితా నుంచి తొలగింపు
- గుంటూరు కలెక్టర్ ఆదేశాలతో దేవదాయశాఖ చర్యలు
- ఆ ఇద్దరికీ రాలేదని, అర్హులైన మరో ఇద్దరినీ తప్పించిన వైనం
- దేవదాయశాఖలో ఎవరికీ దక్కని అవకాశం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంటూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఘోర పరాజయం చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దేవదాయశాఖ ఉన్నతాధికారుల పోకడల్లో మాత్రం మార్పు రాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికార పెద్దల అండతో ఏకంగా ప్రతిపక్ష హోదాలో ఉన్న చంద్రబాబు సభనే అడ్డుకునే ప్రయత్నం చేసిన గుంటూరు దేవదాయశాఖ అన్నసత్రం ఈవో నారాయణతోపాటు, అప్పటి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో అంటకాగి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలుపొందిన వైసీపీ ఎమ్మెల్యేలందరి ఇళ్లకు డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డితో పాటు వెళ్లి వేద పండితులతో ఆశీర్వచనాలు ఇచ్చి సత్కరించిన అప్పటి మంగళగిరి ఈవో నారాయణ(ప్రస్తుతం ఏసీ)లకు ఇప్పటికీ కొమ్ముకాస్తున్నారు. వైసీపీ హయాంలో చెప్పినట్లు వ్యవహరించిన ఈ ఇద్దరు ఈవోల పేర్లను తాజాగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలకు తమ శాఖ తరఫున ఎంపిక చేసి జిల్లా కలెక్టర్‌కు జాబితా పంపించారు.

ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 12న 'వైసీపీతో అంటకాగితే 'ఉత్తములే' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. గతంలో వారిద్దరు వ్యవహరించిన తీరుపై దర్యాప్తు నిర్వహించి, వాస్తవమని తేలటంతో వారి పేర్లను తొలగించాల్సిందిగా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ ఇద్దరికి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకునే అవకాశం చేజారింది. విశేషమేమిటంటే దేవదాయశాఖ నుంచి వీరిద్దరితో పాటు ఏసీ డి.శ్రీనివాసరావు (వాసు), ఏసీ కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి పేర్లను కూడా పంపారు. వీరు అర్హులైనప్పటికీ తాము కోరుకున్న వారికి దక్కలేదనే అక్కసుతో వీరి పేర్లు కూడా ఉపసంహరించుకున్నారు. కాగా, వీరిద్దరి పేర్లను ఎంతో బరితెగించి సిఫారసు చేసిన ఉన్నతాధికారులపై టీడీపీ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

చల్లపల్లి సర్పంచికి కేంద్రప్రభుత్వ సన్మానం

న్యూఢిల్లీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామ సర్పంచి పైడిపాముల కృష్ణకుమారిని కేంద్రప్రభుత్వం సత్కరించింది. తమ పనితీరుతో గుర్తింపు పొందిన.. 400 మంది పంచాయతీ రాజ్ సంస్థల మహిళా ప్రజాప్రతినిధులను కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది. గురువారం ఇక్కడ జనపథ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వారందరినీ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ సన్మానించారు. పైడిపాముల కృష్ణకుమారిని కేంద్ర మంత్రి షీల్డ్‌తో సత్కరించారు.

సమాచార హక్కు... తుక్కు!

- 9వేలకుపైగా కేసులు పెండింగ్
- సీఐసీ బాషా నేతృత్వంలో పడకేసిన కమిషన్
- సొంత పత్రిక ఉద్యోగికి జగన్ అందలం
- ప్రజల వ్యక్తిగత సమాచారం వెబ్‌సైట్‌లో!
- నెలకు ఆరు తీర్పులతో బాషా 'రికార్డు'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ఉన్నా లేనట్లుగా తయారైంది. ప్రస్తుతం కమిషన్‌లో 9000కుపైగా దరఖాస్తులు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం... చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) బాషా తీరే అనే విమర్శలున్నాయి.

ఆర్‌టీఐ గురించి ప్రజల్లో, ప్రభుత్వాధికారుల్లోనూ అవగాహన పెంచాలని... అందుకోసం కమిషనర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని చట్టం చెబుతోంది. కానీ... 'మీరెవరూ కార్యాలయం దాటి బయటికి వెళ్లొద్దు' అని సీఐసీ బాషా హుకుం జారీ చేశారు. ఇలాంటి మరెన్నో అసంబద్ధ నిర్ణయాల కారణంగా రాష్ట్ర సమాచార కమిషన్ అచేతనావస్థలో పడిపోయింది.

గత రెండేళ్లలో ఒకరిద్దరు కమిషనర్లు మాత్రం సీఐసీ ఆదేశాలను సైతం కాదని క్షేత్రస్థాయిలో ఆర్టీఐ అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఇది మినహాయిస్తే... రాష్ట్రంలో ఈ చట్టం అమలు దాదాపుగా పడకేసినట్లే!

సమాచార హక్కు స్ఫూర్తికి అనుగుణంగా పని చేసి, కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేసిన కమిషనర్లకు చట్టప్రకారం అందాల్సిన బకాయిలు రాకుండా, ఆర్జిత సెలవు (ఈఎల్) దరఖాస్తులను కూడా బాషా తొక్కిపెట్టారని తెలుస్తోంది. తమ ఈఎల్ ప్రొసీడింగ్స్‌ను ప్రభుత్వానికి పంపించకుండా సీఐసీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆ కమిషనర్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

'ఒక్కసారి చెబితే... వందసార్లు చెప్పినట్లే' అన్నది సూపర్ స్టార్ రజినీకాంత్ 'బాషా'లోని ఓ ఫేమస్ డైలాగ్. 'వంద మంది ఆర్టీఐ దరఖాస్తులు పెట్టుకున్నా... ఒక్కదానికీ జవాబు చెప్పం' అన్నది రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ బాషా తీరు! వైసీపీ హయాంలో 'సమాచార హక్కు చట్టం' ఉండీ లేనట్లుగా తయారైంది. ప్రతిభ, సామర్థ్యంతో సంబంధంలేకుండా... తన పత్రికలో పని చేసిన 'అనుభవం', సొంత జిల్లా, తమ పట్ల విధేయతలే అర్హతలుగా ఆర్ఎం బాషాను అత్యంత కీలకమైన ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా జగన్ నియమించారు. ఇది రాజ్యాంగబద్ధ పదవి. చీఫ్ కమిషనర్‌గా సమాచార హక్కును గట్టిగా నిలబెట్టాల్సిన ఆర్ఎం బాషా... దానిని సమూలంగా పడగొట్టడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇదీ కమిషన్ ఘనత...

రాష్ట్ర సమాచార కమిషన్‌లో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. ప్రతి నెలా కొత్తగా వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి. కానీ... కమిషన్ నెలకు కనీసం 400 కేసులు కూడా పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉంది. నాలుగున్నర లక్షల రూపాయల జీతభత్యాలు తీసుకునే ప్రధాన సమాచార కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో పరిష్కరించిన కేసులు కేవలం ఆరు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి 19 నెలల సుదీర్ఘ కాలంలో ఆయన పరిష్కరించిన కేసులు సుమారు 200 మాత్రమే! బాషా సీఐసీగా రాకముందు కమిషనర్లు ఒకొక్కరు సగటున నెలకు 100 కేసులు పరిష్కరించేవారు. బాషా వచ్చాక కమిషన్ పని తీరు రివర్స్ గేర్‌లో పడింది. సహచర కమిషనర్లన్నా... మరీ ముఖ్యంగా పని చేసే వారన్నా బాషాకు అస్సలు గిట్టదని, శత్రువుల్లా చూస్తూ వేధిస్తుంటారనే ఆరోపణలున్నాయి.

దరఖాస్తుదారుల సమాచారం బజారులో...

ప్రజలకు తప్పనిసరిగా తెలియజేయాల్సిన జీవోలను కూడా వెబ్‌సైట్‌లో పెట్టకుండా జగన్ ప్రభుత్వం గతంలో అత్యంత గోప్యంగా పాలన సాగించింది. అదే జగన్ ఆశీస్సులతో సీఐసీగా నియమింతుడైన బాషాది మరో లెక్క! ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ బహిర్గత పరచరాదని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు కూడా స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. కానీ... ఆర్ఎం బాషా తీరే వేరు. ఆర్టీఐ దరఖాస్తుదారుల పాన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, సాక్షుల వేలి ముద్రలు, వారి చిరునామాలు, బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు... దరఖాస్తులతోపాటు ప్రజలు జతపరచిన వివరాలన్నింటినీ సీఐసీ జడ్జిమెంట్ల కింద అప్‌లోడ్ చేసేశారు. తీర్పులు మాత్రమే వెబ్‌సైట్‌లో పెట్టాలని, దరఖాస్తుదారులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం బహిర్గతం చేయడం సరికాదని కొందరు సహ కమిషనర్లు నెత్తీనోరూ మొత్తుకొని చెప్పినా వినిపించుకోలేదు. 'నేను తప్పు చేస్తా... మీరూ చేయాల్సిందే. లేని పక్షంలో మీ తీర్పులను వెబ్‌సైట్‌లో పెట్టేది లేదు' అంటూ సహ కమిషనర్లను ఆదేశించారు. ఆ తర్వాత... విషయం గ్రహించి అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లన్నింటినీ ఒక్కటొక్కటిగా తొలగించడం మొదలుపెట్టారు.

కమిషనర్లతో మాటల్లేవ్...

ప్రస్తుతం రాష్ట్ర ఆర్టీఐ కమిషన్‌లో ఇప్పుడు ప్రధాన కమిషనర్ సహా అయిదుగురు కమిషనర్లు ఉన్నారు. వీరిందరినీ సమన్వయం చేయడం, తాజా కోర్టు తీర్పులపై చర్చించడం ప్రధాన కమిషనర్‌గా బాషా బాధ్యత. కానీ... ఆయన కమిషనర్లందరినీ శత్రువులుగా చూస్తారనే ఆరోపణలున్నాయి. రెండేళ్లకుపైగా తన జమానాలో కమిషనర్లను సమావేశపరచి ఒక్కటంటే ఒక్కసారి కూడా 'ఆర్‌టీఐ కేసులపై ఏం చేద్దాం' అన్న విషయంపై చర్చించలేదు. పొద్దస్తమానం సీసీటీవీలో సిబ్బందిని గమనించడం తప్ప... ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కార వేగం పెంచే ఒక్కపనీ సీఐసీ చేయడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. చివరికి తనను కలవడం కోసం వచ్చే కమిషనర్లను కూడా గేటు దగ్గరే నిలిపేసి, గంటలకొద్దీ వెయిటింగ్‌లో పెట్టి అవమానించిన ఉదంతాలూ ఉన్నాయి. కమిషన్ తాజా పరిస్థితిపై ఆర్‌టీఐ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎంలో లుకలుకలు

- గత ఎన్నికల్లో పార్టీ అనుసరించిన విధానంపై అసంతృప్తి
- కృష్ణా జిల్లా సీనియర్ నేత రఘు రాజీనామా
- పార్టీ నుంచి బహిష్కరించిన నాయకత్వం

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనుసరించిన విధానంతో సీపీఎం రాష్ట్ర శాఖలో ముసలం పుట్టింది. దీంతో కృష్ణా జిల్లాకు చెందిన సీనియర్ నేత ఆర్.రఘుపై పార్టీ నాయకత్వం బహిష్కరణ వేటు వేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ అనుసరించిన రాజకీయ విధానం, పొత్తుల నిర్ణయాలను రఘు గట్టిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తుకు వెళ్లాలనే విషయమై సీపీఎం నాయకత్వం బ్యాలెన్స్ తప్పిందని, రాష్ట్రంలో పార్టీ బలహీనపడటానికి కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలదే బాధ్యతంటూ ఆయన విమర్శించారు. పార్టీ మహాసభలలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. తన రాజీనామాకు కారణాలను వివరిస్తూ గత నెల 22న రఘు కృష్ణా జిల్లా సీపీఎం కార్యదర్శి వై.నరసింహారావుకు రాజీనామా లేఖ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు కూడా ఒక ప్రతిని పంపించారు. ఆయనతో సీపీఎం రాష్ట్ర నాయకత్వం చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో పార్టీ నుంచి బహిష్కరించింది. రఘును ప్రాథమిక సభ్యత్వం నుంచి, కృష్ణా జిల్లా కమిటీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వై.నరసింహారావు ఈ నెల 14న ప్రకటన విడుదల చేశారు. కాగా, సీపీఎం నుంచి బహిష్కరణకు గురైన రఘు.. విప్లవ లక్ష్యంతో పనిచేసే శక్తులతో కలిసి కొత్త పార్టీని నెలకొల్పే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

కౌంటర్లు సకాలంలో వేయాల్సిందే!

- ఇకపై నిర్లక్ష్యం వహిస్తే ఖర్చులు విధిస్తాం
- అధికారులను హెచ్చరించిన హైకోర్టు
- ఆదేశించి ఏడాదైనా కౌంటర్ వేయలేదని ఆక్షేపణ
- కేంద్ర గనులశాఖ కార్యదర్శికి 20వేలు జరిమానా
- నంద్యాల జిల్లా కలెక్టర్‌కు రూ.10వేలు ఫైన్



అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సకాలంలో కౌంటర్లు వేయకుండా జాప్యం చేస్తే ఇకపై ఖర్చులు విధిస్తామని అధికారులను హైకోర్టు హెచ్చరించింది. వివిధ వ్యాజ్యాలలో కౌంటర్ దాఖలు చేసేందుకు తగిన సమయం ఇస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఓ కేసులో ఏడాది క్రితం ఆదేశాలు ఇచ్చినా, ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయని కేంద్ర గనులశాఖ కార్యదర్శికి రూ.20వేలు జరిమానా విధించింది. అలాగే, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సకాలంలో మెరుగైన కౌంటర్ దాఖలు చేయడంలో విఫలమైన నంద్యాల జిల్లా కలెక్టర్‌కు రూ.10వేలు జరిమానా విధించింది. ఆ సొమ్మును న్యాయవాదుల గుమస్తాల సంక్షేమనిధికి జమ చేయాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలుకు మరికొంత గడువు ఇచ్చి, విచారణను సెప్టెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. వ్యవసాయానికి పనికిరాని లైమ్‌స్టోన్ ఖనిజ నిల్వలు ఉన్న భూములను తన అనుచరుల పేరు మీద అసైన్డ్ పట్టాలు ఇప్పించేందుకు బనగానపల్లి వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రయత్నిస్తున్నారని, పట్టాల పంపిణీని నిలువరించాలని కోరుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం పై గతేడాది ఆగస్టు 8న విచారణ జరిపిన ధర్మాసనం కేంద్ర గనులశాఖను ప్రతివాదిగా చేర్చింది. అసైన్ చేయాలని నిర్ణయించిన భూముల్లో ఖనిజ నిల్వలు ఏమైనా ఉన్నాయా? వాటిని సాగు నిమిత్తం అసైన్ చేయవచ్చా? అసైన్ చేసేందుకు గనులశాఖ నుంచి అనుమతి ఏమైనా తీసుకున్నారా? తదితర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని నంద్యాలజిల్లా కలెక్టర్‌ను, కేంద్ర గనులశాఖ కార్యదర్శిని నాడు హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా, ఉత్తర్వులు ఇచ్చి ఏడాది గడుస్తున్నా కేంద్ర గనులశాఖ కార్యదర్శి కౌంటర్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారుల అంతర్గత మార్పుల వల్ల కౌంటర్ వేయడంలో జాప్యం జరిగిందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది యజ్ఞదత్ ఇచ్చిన వివరణకు ధర్మాసనం సంతృప్తి చెందలేదు. తాము న్యాయవాదులుగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు కౌంటర్ వేయడంలో జాప్యం ఉండేదికాదని న్యాయమూర్తులు గుర్తు చేశారు. కౌంటర్లు వేసే విషయంలో అధికారులు నిర్లిప్తంగా ఉండడానికి వీల్లేదని, ఇకపై జాప్యం జరిగితే ప్రతికేసులో ఖర్చులు విధిస్తామని హెచ్చరించింది.

కక్షల కేసులపై ఏడుపు!

- కొత్త ప్రభుత్వం వాటిని సమీక్షిస్తుంటే నీరు గార్చేస్తున్నారంటూ నీచ రాతలు
- గత ఐదేళ్లలో విపక్షాలపై 3,000 కేసులు
- రాజకీయ ప్రేరేపిత కేసులే ఇవన్నీ
- రివ్యూ చేస్తే రోత పత్రికకు ఉలుకెందుకో?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం తనకు ఉన్న అధికారాలతో ప్రతిపక్ష నాయకులపై, సామాన్యులపై ఎడాపెడా దొంగకేసులు పెట్టింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని సమీక్షిస్తుందనగానే, జగన్ రోతపత్రిక ఉలిక్కిపడుతోంది. భుజాలు తడుముకుంటోంది. గత ఐదేళ్లపాటు జగన్ పెట్టిన దొంగ కేసుల గుట్టు రట్టవుతుందని భయమా? ఆ కేసులన్నీ నిజమే అనుకుని నమ్మి ఓట్లేసి 11 సీట్లు ఇచ్చిన ఓటర్లు కూడా దూరం అవుతారని కంగారా? కేసులను సమీక్షల పేరుతో చంద్రబాబు నీరుగార్చుతున్నారంటూ గురువారం రోతపత్రికలో ఒక ఏడుపుగొట్టు కథనం ప్రచురించారు. జగన్ పెట్టిన కేసులన్నీ తప్పులనడానికి ప్రజలముందే సాక్ష్యాలున్నాయి. అవినీతి అంటూ పెట్టిన కేసుల్లో ఒక్క రూపాయిని కూడా చూపించలేకపోయారు. ఇలాంటి నియంతృత్వ పోకడలతోనే జనాలు కూడా విసుగెత్తిపోయి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు.

అయ్యో.. జనాలకు తెలిసిపోతే ఎలా?

పోలీసులను అడ్డగోలుగా ఉపయోగించుకుని అక్రమ కేసులు పెట్టడానికి జగన్‌కి ఏ అధికారాలైతే ఉన్నాయో.. వాటిని సమీక్షించి తప్పొప్పులు తేల్చడానికి కూడా కూటమి ప్రభుత్వానికి అవే అధికారాలుంటాయి. తప్పుడు కేసుల లోగుట్టు బయటపడితే, అందుకోసం వారు చేసిన ఘోరాలు వెలుగులోకి తెస్తే అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో చేశారో ప్రజలకు మరింత స్పష్టత వస్తుంది. ఇదే జగన్‌ను, ఆ రోతపత్రికను వేధిస్తున్న అంశం. జగన్ హయాంలో 3,000కు పైగా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టారు. 2560 మందికి పైగా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. గతంలో చంద్రబాబుపై ఒక్క బాబ్లీ కేసు మాత్రమే ఉండేది. జగన్ హయాంలో 17 కేసులు పెట్టారు. పవన్ కల్యాణ్‌పై 7 కేసులు పెట్టారు. జేసీ ప్రభాకర్ రెడ్డిపై 66 కేసులు పెట్టారు.

అన్నీ కక్షసాధింపు కేసులే...

సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయని ధూళిపాళ్ల నరేంద్రను జైల్లో పెట్టారు. పులివెందులలో పోటీ చేసిన బీటెక్ రవిని ఏ కారణం చెప్పకుండా జైల్లో పెట్టారు. అధికారులపై దాడి చేశారంటూ కూన రవికుమార్‌పై కేసులు నమోదు చేశారు. ఫర్నిచర్ దుర్వినియోగం చేశారంటూ మాజీ స్పీకరు కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారు. ఆ అవమానం తట్టుకోలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ప్రస్తుత హోం మంత్రి, టీడీపీలోని ఎస్సీ నాయకురాలు వంగలపూడి అనితపై అప్పట్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై అప్పట్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు అత్యాచారయత్నం కేసు పెట్టారు.

వెంటాడి.. వేధించారు..

అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజును లాకప్‌లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. ఎంపీ అయిఉండి కూడా, ఐదేళ్ల పాటు సొంత నియోజకవర్గంలోకి రాలేని భయానకవాతావరణం సృష్టించారు జగన్ ప్రభుత్వం అమరావతిలోని రైతులను, మహిళలను కనీసం మనుషులుగా కూడా చూడలేదు. కేసులు, అరెస్టులు, సోషల్ మీడియాలో బూతులతో వారిని చిత్రహింసలు పెట్టింది. రాజకీయ ప్రేరణలతో పెట్టిన కేసులే ఇవన్నీ. నోరెత్తాలంటే భయపడాలన్న నియంతృత్వ పోకడలతో జగన్ పెట్టిన అక్రమ కేసులను వీరంతా ఎందుకు భరించాలి? ప్రభుత్వం మారాకైనా ఉపశమనం కలగాలి కదా! అందుకే చంద్రబాబు ఈ కేసులను సమీక్షించి బాధితులకు ఉపశమనం కలిగించేందుకు పూనుకున్నారు. చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేశారు. బాబు అరెస్టు జరిగిన తర్వాత ఎనిమిది నెలల పాటు వైసీపీనే అధికారంలో ఉంది. కానీ, ఒక్క ఆధారం కూడా చూపలేకపోయారు. అలాంటప్పుడు ఆ కేసు కక్షపూరితం, అక్రమమే అవుతుంది. ఇలాంటి వాటిని ఎందుకు భరించాలి? అందుకే ప్రభుత్వం దిద్దుబాటుకు సిద్ధమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అంగరంగ వైభవంగా

తిరంగా ఎగరంగా..



ఏపీ సీఆర్‌డీఏలో..

కృష్ణలంక: రాష్ట్ర ప్రజల స్వప్నమైన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఉద్యోగులందరూ కర్తవ్య దీక్షతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) కమిషనర్ కాటంనేని భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం గవర్నర్ పేటలోని సంస్థ కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తొలుత మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేస్తూ ప్రతి ఉద్యోగి అమరావతి నిర్మాణానికి పరిశ్రమించాలని పిలుపునిచ్చారు. ఏపీసీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు మల్లారపు నవీన్, జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ పాల్గొనగా జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్‌రాజు అధ్యక్షత వహించగా అన్ని విభాగాధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఆర్టీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో..

బందరు రోడ్‌లోని ఆర్టీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డీటీసీ కార్యాలయంలో డీటీసీ ఎం.పురేంద్ర అధికారులకు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మోటారు వాహన తనిఖీ అధికారులు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, శివరామగౌడ్, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యాలయ పరిపాలన అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, కేవీవీ నాగమురళి, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భద్రాచలం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో..

విజయవాడ: నగరంలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో స్వాతంత్ర దిన వేడుకలు గురువారం నిర్వహించారు. పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డీసీపీలు గౌతమీశాలి, ఉదయరాణి, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఏడీసీపీలు టి.కనకరాజు, ఎం.కృష్ణమూర్తి నాయుడు, ఆర్.శ్రీహరిబాబు, డి.ప్రసాద్, కేవీవీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.



పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో...

బస్టేషన్: నగరంలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎం.యేసుదానం పతాకాన్ని ఎగురవేసి వికసిత భారత్ లక్ష్యాల గురించి వివరించారు. జోన్-2 ఆర్ఎం కె.గోపినాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జోనల్, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. జిల్లా వర్క్స్ మేనేజర్ సత్యనారాయణ, డీఎంఈ నీలిమ, పర్సనల్ ఆఫీసర్ అలివేలు మంగ, మేనేజర్లు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



రైల్వే ఆధ్వర్యంలో..

రైల్వే స్టేషన్: సిబ్బంది అకుంఠిత దీక్ష, అంకితభావం, సమన్వయంతోనే రైల్వే ప్రగతి పట్టాలెక్కిందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. గురువారం రైల్వేస్టేషన్ సమీపంలోని మినీ స్టేడియంలో గురువారం జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆర్‌పీఎఫ్, జాక్ అండ్ జిల్ స్కూల్, ఎస్‌కేపీవీ స్కూల్ విద్యార్థుల కవాతును సీనియర్ డీఏస్ఈ వల్లేశ్వర బీ తోకలతో కలిసి తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందేశాన్ని వినిపించి మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జూలై వరకు రూ.2,030 కోట్ల ఆదాయం వచ్చిందని, అంతకుముందు ఏడాదికంటే 16.07 శాతం పెరుగుదల నమోదైందని, గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 9 శాతం ఎక్కువ ఆదాయమన్నారు. కొత్త లైన్ల పనులు జరుగుతున్నాయని, ప్రయాణికుల భద్రత, మౌలిక సదుపాయాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రూ.4వేల కోట్ల కంటే అధికంగా సరుకు రవాణా ఆదాయాన్ని పొందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్ కళ్లకు గంతలు కట్టుకుని 9ఎంఎం, ఏకే 47 మిషన్ గన్‌లను ఒక నిమిషం లోపల లోడ్ చేయటం ఆకట్టుకుంది. పోలీసు జాగిలం రెమో బాంబు గుర్తింపు, తదితరాల ప్రదర్శనతో ఆకట్టుకుంది. సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా సంక్షేమ అధ్యక్షురాలు వర్షా పాటిల్ స్వాగతం పలికారు. వర్షా పాటిల్‌కు రెమో జాగిలం పుష్పగుచ్ఛం అందచేయటం ఆకట్టుకుంది. మహిళా ఆర్‌పీఎఫ్ సిబ్బంది పలు విన్యాసాలను ప్రదర్శించారు. పర్సనల్ డిపార్టుమెంట్ నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆర్‌పీఎఫ్ డిపార్టుమెంట్‌కు, ఇతర విభాగాలకు రూ.85,500 నగదు బహుమతిని అందజేశారు. రైల్వేస్టేషన్ క్లాక్ టవర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జాక్ అండ్ జిల్ స్కూల్‌లో వర్షాపాటిల్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా రైల్వే ఆసుపత్రికి రూ.8లక్షల విలువైన ఆర్థోపెడిక్ యంత్రాలను, ఆపరేషన్ థియేటర్ టేబుల్‌ను విరాళంగా అందించారు. రైల్వే ఆసుపత్రి సూపరింటెండెంట్ శౌరి బాల కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌ప్రాటెక్టర్ ఏ డీఆర్ఎం అడ్విన్, అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌డీఆర్ఎఫ్‌లో..

గన్నవరం: మండలంలోని కొండపావులూరు సర్వే నెంబర్ 6లో ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ ప్రసన్నకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి దేశ స్వాతంత్ర్య ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్‌వోలు, జవాన్‌లు పాల్గొన్నారు.



ఆకాశవాణి కేంద్రంలో..

విజయవాడ కల్చరల్: నగరంలోని ఆకాశవాణి కేంద్రంలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. డీడీజీ సోమేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ నేతలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అనంతరం హర్ ఘర్ తిరంగా నినాదాలతో ఉద్యోగులందరితో కలిసి ర్యాలీగా వెళ్లి ఆకాశవాణి స్టాఫ్ క్వార్టర్స్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ చుండూరు మాణిక్యరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



దుర్గగుడిలో...

వన్‌టౌన్: దుర్గగుడిలో ఈవో కేఎస్ రామారావు తొలుత దుర్గమ్మకు, భారత మాత, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు మంత్రోచ్ఛారణతో పూజలు చేశారు. ఎస్‌పీఎఫ్, హోం గార్డులు, సెక్యూరిటీ గౌరవ వందనాన్ని అందుకున్నారు. అనంతరం జాతీయ పతాకం ఎగురవేశారు. జెండా వందనంలో పాల్గొన్న చిన్నారులు, సిబ్బందికి దుర్గమ్మ ప్రసాదం, చాక్లెట్లు పంచారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్డీయే కార్యాలయంలో..

వన్‌టౌన్: భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య శుభాకాంక్షలు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పశ్చిమను అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మరో కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో టీడీపీ



రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు గన్నే వెంకట నారాయణ ప్రసాద్, కొత్త నాగేంద్ర కుమార్ కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. టీఎన్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు బోయిన సుబ్రహ్మణ్యం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కోగంటి రామారావు, గొల్లపూడి నాగేశ్వరరావు, చిట్టా నిర్మల, వెంకటేశ్వరరావు గౌడ్, కిషోర్ బాబు, ఉమా, జ్యోతి, భాగ్యం పాల్గొన్నారు.



బుద్దా వెంకన్న కార్యాలయంలో..

స్థానిక అర్జునవీధిలోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న కార్యాలయంలో స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్దా వెంకన్న జెండాను ఎగురవేసి నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్లు పంచారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), పార్టీ నేతలు పొనుగుపాటి సుబ్బయ్య, నాగోతి రామారావు, తుపాకుల రమణమ్మ, బూదాల నందకుమారి, యర్రంశెట్టి పద్మ, వల్లభనేని లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. అలాగే హనుమాన్‌పేటలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో కోగంటి రామారావు.. గన్నే ప్రసాద్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముప్పా వెంకటేశ్వరరావు, కాకు మల్లికార్జునయాదవ్, పొన్నం రవి, ఆర్ఆర్ సూరిబాబు, దేవినేని శ్రీనివాసరావు, వెల్లంకి సుధాకర్, బండారుపల్లి అనిల్, ఈడుపుగంటి అజయ్ పాల్గొన్నారు.



కృష్ణా మిల్క్ యూనియన్‌లో..

చిట్టినగర్: స్థానిక కృష్ణామిల్క్ యూనియన్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు.. మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఛైర్మన్ ఆంజనేయులు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలమే మనం ఈ రోజు అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని, వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులు, వినియోగదారులు, సమితి సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీబీ సిద్ధార్థ కళాశాలలో..

మొగల్రాజపురం: పీబీ సిద్ధార్థ కళాశాలలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా 4 ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ లెఫ్టినెంట్ రోహిణికుమ ఆధ్వర్యంలో 17 ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కె.విజయ్, 8 నేవల్ యూనిట్ లెఫ్టినెంట్ ఆకురాతి వెంకటేష్, 3 ఆర్ అండ్ వీ ఆంధ్రా రెజిమెంట్ కేర్‌టేకర్ ఏ బాలాజీ అధ్వర్యంలో 4 బెటాలియన్స్ పేరేడ్ నిర్వహించాయి. ఈ పేరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా 3 ఆర్ అండ్ వీ రెజిమెంట్ చేసిన గుర్రపు స్వారీ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫిట్జీ కళాశాలలో..

ధర్నాచౌక్: విద్యార్థులు విద్యతో పాటు మానసిక వికాసాన్ని అలవర్చుకోవాలని ఏపీ సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ శిరీన్ బేగం తెలిపారు. నగరంలోని ఫిట్జీ కళాశాలలో గురువారం జరిగిన 78వ స్వాతంత్ర వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో చదువుకుని నేడు అమెరికాలోని వర్శిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా స్టూడెంట్ అధ్యక్షుడిగా ఎన్నికైన గొట్టిపాటి సూర్యకాంత్‌ను ఘనంగా సత్కరించారు. డైరెక్టర్ పిన్నెపు రమేష్‌బాబు, ప్రిన్సిపల్ సంపత్, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో..

దేశానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ కొనియాడారు. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్.రమణారెడ్డి, నగరాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జి.రామారావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.సాంబశివరావు, యూనియన్ నేతలు జి.రఘురామ్, ఆకుల తిరుపతిరావు, దారం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత



వీఎంసీలో..

చిట్టినగర్: వీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని మేయర్ ఆవిష్కరించగా, వీఎంసీ జెండాను వీఎంసీ కమిషనర్ ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ ఎయిర్‌వింగ్ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), బోయి సత్యబాబు, రహమతున్నీసా, షాహినా సుల్తానా అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్, ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజనీరు ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బీ.సత్యనారాయణమూర్తి పలు విభాగాల అధికారులు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర వేడుకలు స్థానిక మారుతీనగర్‌లో గురువారం ఘనం గా జరిగాయి. తొలుత బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి మారుతీనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థినుల గౌరవ వందనం స్థానికులను అలరించింది. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు మొక్కలు నాటి ట్రీగార్డుల ను అమర్చారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కర్‌రావు, జూబ్లీ హరిత అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస ప్రసాద్, లయన్స్ రీజియన్ ఛైర్‌పర్సన్ ఏ శరాబందీరావు, పానాసోనిక్ డిజిటల్ స్టోర్ అధినేత రామకృష్ణ, క్లబ్ కార్యదర్శి కోటా ఫణి, కోశాధికారి శ్రీధర్, ప్రముఖ యోగా గురువు అంకాల సత్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు ఈశ్వరాచారి, శ్రీనివాసరావు, సాయిబాబు, ముస్తాఫా, రామయ్య, తోట రవీంద్ర, గిరికుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో...

ఆటోనగర్: స్థానిక జవహర్ ఆటోనగర్‌లో స్వాతంత్ర్య దిన వేడుకలు వైభవంగా జరిగాయి. డాక్టర్ అబ్దుల్ కలాం, ఐలా కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల బాబ్జీ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆటోనగర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరావు, కార్యదర్శి దస్తగిరి, వీరాచారి జాతీయ జెండాలను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

టెక్నిషియన్స్ రక్తదానం..

పటమట: అమరావతి కార్, ఏసీ టెక్నిషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీనాస్ కార్స్ మాల్స్ వద్ద స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ సమీ జెండా ఎగురవేయగా, 50మంది అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. వెంకట అప్పారావు, షేక్ సాధిక్, ఆచంట రామకృష్ణ, అజయ్‌కుమార్, షేక్ బరక్‌తుల్ల, షంషేర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

జీవీకే ఈఎంఆర్ఐలో...

గొల్లపూడి: స్థానిక జీవీకే ఈఎంఆర్ఐ కార్యాలయంలో 78వ స్వాతంత్ర దిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఆపరేషన్స్ హెడ్ బగేష్ మిశ్రా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆపరేషన్స్ హెడ్ ఎండీ కలీం, ప్రాజెక్టు కోఆర్డినేటర్ దుర్గ, డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.





బాపూ మ్యూజియం, తుమ్మలపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

తెలుగుజాతికి గర్వకారణం పింగళి

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఆగస్టు 15: జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగు జాతికి ఎంతో గర్వకారణమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం బందరు రోడ్‌లోని బాపు మ్యూజియం, పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, పింగళి వెంకయ్యకు నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పురావస్తు శాఖ కమిషనర్ డాక్టర్ వాణిమోహన్‌తో కలిసి ఆయన మ్యూజియంను సందర్శించారు. డిప్యూటీ డైరెక్టర్లు వి. సురేష్, ఓ రామసుబ్బారెడ్డి, పీ మైఖేల్, మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్లు కె.నరసింహ నాయుడు, స్వామి నాయక్, సాంకేతిక సహాయ సంచాలకుడు వెంకట్రావ్, టీడీపీ నేతలు ఎం.ఎస్.బేగ్, మాదిగాని గుర్నాథం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం అభినందనీయం

తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, సేవలందించటం అభినందనీయమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరి కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కంపనీయన్ షిప్ (తోడు నిలిచి) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. నిర్వాహకులు షబీర్, షేక్ సిరాజుద్దీన్, కంపనీయన్ షిప్ డైరెక్టర్ ఇబ్రహీం, నయీం పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయంలో..

భారతీయుల ఐక్యత, శక్తిని చాటి చెప్పిన ఇంటింటి జెండా అని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరంలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ భవన్ ఆవరణలో ఎంపీ శివనాథ్ జాతీయ పతాకాన్ని ఎగరవేసి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ఉషారాణి, టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ఎస్.బేగ్, ఎరుబోతు రమణారావు, మాదిగాని గురునాథం, పుల్లగూర చరణ్ సాయి యాదవ్, పీతా బుజ్జి, కొణిజేటి రమేష్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 'కాలజ్ఞాపిక' ఫొటో ప్రదర్శన

రైల్వే స్టేషన్, ఆగస్టు 15: విజయవాడ రైల్వేస్టేషన్ పాత బుకింగ్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా గురువారం కాలజ్ఞాపిక ఫొటో ప్రదర్శన (టాక్స్ ఆఫ్ టైమ్)ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, మహిళా సంక్షేమ సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ వర్షా పాటిల్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 19వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో సమకాలీన, పాత ఛాయా చిత్రలను ప్రదర్శించారు. వీటిలో రైల్వేకు సంబంధించిన వంతెనలు, ట్రాక్‌లు, ఆనాటి ప్రకృతి దృశ్యాలను ఏర్పాటు చేశారు. ఈనెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ప్రముఖ ఫొటో జర్నలిస్టులను సత్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఫొటో ప్రదర్శనను తిలకించిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అందమైన ఫొటోలను సమీకరించినందుకు సిబ్బందిని అభినందించారు. ఆవిరి ఇంజన్ల నుంచి ప్రస్తుత సెమీ, హైస్పీడ్, వందే భారత్ వరకు ఫొటోలు ప్రతిబింబిస్తున్నాయన్నారు. రైల్వేల ఘన చరిత్రను ఇవి తెలియజేస్తున్నాయన్నారు. వర్షా పాటిల్ మాట్లాడుతూ ఫొటోలు



ఎంతో మనోహరంగా ఉన్నాయని, అన్ని భావోద్వేగాలను సంగ్రహించిందని తెలిపారు. ఏడీఆర్ఎం టి.అడ్విన్ ఈ ఫొటో ప్రదర్శన జ్ఞాపికాల దొంతరలను తెలియజేస్తుందన్నారు.



జెస్సీరాజ్‌ను అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

స్కేటింగ్ క్రీడాకారిణి

జెస్సీరాజ్‌కు అరుదైన గౌరవం

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 15: ఓషియానిక్ ప్రపంచ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన మాత్రపు జెస్సీరాజ్‌కు గురువారం అరుదైన గౌరవం దక్కింది. గుంటూరులో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ బాలిక వెళ్లారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న జెస్సీరాజ్ స్కేటింగ్‌లో ఇటీవల పతకాలతో తనదైన ప్రతిభ చాటుతోంది. ఎన్ఎస్ఎం స్కూల్లోను జెస్సీరాజ్‌ను యాజమాన్యం జ్ఞాపికతో సత్కరించగా, అనంతరం గుంటూరు వేడుకల్లో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా స్కేటర్‌ను అభినందించారు.

దుర్గగుడిలో దక్షిణామూర్తి పూజ

వన్‌టౌన్, ఆగస్టు 15: ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తి విగ్రహానికి అర్చకులు గురువారం శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. దక్షిణమూర్తికి అభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు.



స్వామిని అర్చించి, మంత్రపుష్పం, హారతు లిచ్చారు. ఈతి బాధలు లేకుండా కాపాడాలని, మేధోసంపత్తిని కలుగజేయాలని, జ్ఞాన భిక్ష పెట్టాలని, లోకాలకంతటికీ సుఖశాంతులు చేకూర్చాలని కోరుతూ సంకల్పం చెప్పి దక్షిణామూర్తికి సమర్పణ చేశారు.

అన్న వితరణకు విరాళం

దుర్గగుడిలో జరుగుతున్న అన్న వితరణ కార్యక్రమానికి ఏలూరు సిటీ వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన మద్దుల శ్రీనివాస్ గురువారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116లు చెక్కు రూపంలో అధికారులకు అందించారు. సాయి చైతన్య, వాసవిల పేరిట అన్నవితరణ చేయాలని ఈ విరాళం అందచేశారు. అమ్మవారి దర్శన అనంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.

వారధి పేరుతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం

● బీజేపీ నేత కిలారు దిలీప్

పెనమలూరు, ఆగస్టు 15: వారధి పేరుతో కార్యకర్తల, ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ శ్రీకారం చుట్టింది. ఈకార్యక్రమంలో భాగంగా గురువారం విజయవాడలో రాష్ట్ర బీజేపీ అధినేత పురందేశ్వరి లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం, శనివారం దినాల్లో ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమస్యలు స్వీకరించి పరిష్కార మార్గాలు చెబుతారని వారధి కార్యక్రమ సమన్వయకర్త కిలారు దిలీప్ తెలిపారు.

ఐటీఐలో స్వల్ప కాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, ఆగస్టు 15: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్వల్ప కాలిక శిక్షణ కోర్సులకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19లోపు దరఖాస్తుల చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, ప్లంబింగ్ జనరల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఆపై అర్హత కలిగి 15ఏళ్ల నుంచి 45ఏళ్లలోపు అభ్యర్థులు తమ ఆధార్, ఫోన్‌నెంబర్, మెయిల్ ఐడీతో ఈనెల 19లోపు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 77804 29468, 99660 04808, 99855 42888లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 16: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ధాముస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ టీటీ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ నెల 16నుంచి 18వరకు ఏపీ టీటీ ర్యాంకింగ్ టోర్నీని నిర్వహిస్తున్నట్టు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి వై దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ వర్శిటీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో అండర్ -11,13,15,17,19 బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళా విభాగాల్లో రాష్ట్రవ్యాప్తంగా 550 ఎంట్రీలు వచ్చినట్టు వివరించారు. పోటీలను కేఎల్ డీమ్డ్ వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీపీ సారథి, ప్రొఫెసర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కే సుబ్బారావు, ఏపీ టీటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎస్ ప్రకాశరావు, పీ విశ్వనాథరావు, జిల్లా కార్యదర్శి కె బలరామ్ ప్రసాద్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు.

సద్గురువులకు లయ వాద నీరాజనం

విజయవాడ కల్చరల్: మృదంగ సంగీత సద్గురువులకు శిష్య ప్రశిష్యగణం మృదంగ వాద్య లయ విన్యాసాలతో నీరాజనాలను అర్పించారు. శ్రీ మహదేవ్ రాధాకృష్ణరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మృదంగ సద్గురువులు పొట్లూరు వీరరాఘవయ్య చౌదరి 82వ వర్ధంతి, మహదేవు రాధాకృష్ణరాజు 35వ వర్ధంతి, దండమూడి రామ్మోహనరావు 14వ వర్ధంతి, మహాదేవ లక్ష్మీనారాయణరాజు 9వ వర్ధంతి కలిపి సంయుక్తంగా సద్గురువుల సంస్మరణ ఉత్సవంగా నిర్వహించారు. సత్యనారాయణపురం శివరామకృష్ణక్షేత్రంలో గురువారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక డీజీపీగా నళిన్ ప్రభాత్

» తదుపరి డీజీపీ ఆయనే

» ఆయన ఏపీ కేడర్ అధికారి.. గ్రేహౌండ్స్‌లో విశేష అనుభవం

న్యూఢిల్లీ, ఆగస్టు 15: సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందిన నళిన్ ప్రభాత్ (55)ను జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక పోలీసు డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. తక్షణమే ఆ బాధ్యతలను చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుత డీజీపీ ఆర్.ఆర్.స్వయిన్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేసిన వెంటనే ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఆయనను హోం శాఖ కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు మూడేళ్ల పాటు డిప్యుటేషన్‌పై పంపించింది. జమ్మూ-కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో ఈ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల సమస్యను ఎదుర్కోవడంలో సమర్థంగా వ్యవహరించారు. గ్రేహౌండ్స్, సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)లో పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఆయనను కాలపరిమితి ముగియకుండానే జమ్మూ-కశ్మీర్‌కు పంపించింది. ఆయనకు మూడు పోలీసు గ్యాలెంటరీ మెడల్స్, పరాక్రమ్ పతకం, ఇతర మెడల్స్ లభించాయి. సవాళ్లను ఎదుర్కోవడంలో ధైర్య సాహసాలను ప్రదర్శించడంతో పాటు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తారన్న పేరు ఆయనకు ఉంది. ప్రస్తుతం జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్రవాదం ప్రబలడంతో దానిని అణచివేతకు నళిన్ ప్రభాత్‌ను కేంద్రం ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

ఇక ప్రతి నెలా 'కిసాన్ కీ బాత్'

» కేంద్ర వ్యవసాయ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 15: రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు ఇకపై ప్రతి నెలా రేడియోలో కిసాన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. గురువారం ఇక్కడ జాతీయ తెగుళ్ల నిఘా వ్యవస్థ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం-ఎన్‌పీఎస్ఎస్)ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. కిసాన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా వ్యవసాయ మంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరిస్తారని తెలిపారు. తగిన అవగాహన లేకపోవడంతో రైతులు ఇష్టం వచ్చినట్టు క్రిమి సంహారక మందులు వాడుతున్నారని, దీనిపై చైతన్యం కలిగించాల్సి ఉందని చెప్పారు. కృషి విజ్ఞాన్ కేంద్రాల నిర్వహణను మరింత మెరుగుపరిచి రైతులకు అందుబాటులోకి తేవాల్సి ఉందని అన్నారు.

ఇజ్రాయెల్‌పై వెనకడుగు వేస్తే 'దైవాగ్రహం' తప్పదు

» ఇరాన్ సుప్రీం లీడర్ ఖమెనెయ్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 15: ఇజ్రాయెల్‌పై చర్యలు తీసుకోవడంలో ఇరాన్ వెనకడుగు వేస్తే దైవాగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని ఆ దేశ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమెనెయ్ (86) హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో మిలటరీ, రాజకీయం, ఆర్థికపరంగా రాజీ పడడంగానీ, వెనక్కి తిరిగి రావడంగానీ జరగకూడదని అన్నారు. హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిల్ హనియెహ్ గత నెలలో టెహ్రాన్‌లో హత్యకు గురయిన దగ్గర నుంచి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సుప్రీం లీడర్ చేసిన హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకొంది. ఎటువంటి దాడులు చేయకుండా ఇరాన్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన 'శత్రువు చేసే మానసిక యుద్ధం'గా అభివర్ణించారు. శత్రువుల బలాన్ని ఎక్కువగా చేసి చూడడం అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజల మద్దతు పొంది, శత్రువుల సామర్థ్యాలను సక్రమంగా మదింపు చేయలిగితే ఎవరి ఒత్తిళ్లకూ లొంగాల్సిన అవసరం లేదని అన్నారు.

అగ్ని క్షిపణి పితామహుడు రామ్‌నారాయణ్ ఇకలేరు

» బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కీలక భూమిక



అల్వాల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిక్షిపణి పితామహుడు, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌నారాయణ్ అగర్వాల్(84) ఇకలేరు. గురువారం ఆయన హైదరాబాద్‌లో కన్నుమూశారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జన్మించిన రామ్‌నారాయణ్.. బెంగళూరులోని ఐఐఎస్సీ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు. డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా సేవలందించిన ఆయన.. అగ్ని మిసైల్స్‌కు మొదటి ప్రోగ్రామ్ డైరెక్టర్. 1983లో అగ్ని-1ను విజయవంతంగా పరీక్షించారు. అంతా ఆయనను అగర్వాల్ అని కాకుండా.. ముద్దుగా 'అగ్నివాల్' అని పిలిచేవారు. రామ్‌నారాయణ్ బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కీలక పాత్ర పోషించారు. రామ్‌నారాయణ్ సేవలకు గాను భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన హైదరాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ(ఏఎస్ఎల్)కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా సేవలందించారు. 2005లో డీఆర్‌డీవో నుంచి రిటైర్ అయ్యారు. రామ్‌నారాయణ్ మృతి పట్ల సీనియర్ సైంటిస్టులు, అధికారులు, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్తలు సంతాపం తెలిపారు. డీఆర్‌డీవో మాజీ చీఫ్ సతీశ్‌రెడ్డి రామ్‌నారాయణ్ మరణంతో దేశం ఓ లెజెండ్‌ను కోల్పోయిందని అన్నారు.

ఒడిశాలో ఒక రోజు రుతుకాల సెలవు

» ప్రయివేటు ఉద్యోగినిలకూ వర్తింపు: ఉప ముఖ్యమంత్రి వెల్లడి

భువనేశ్వర్, ఆగస్టు 15: ఒడిశాలో మహిళా ఉద్యోగులకు ఒక రోజు వేతనం కూడిన రుతు క్రమ సెలవు ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోని ఉద్యోగినిలకు కూడా వర్తిస్తుంది. అయితే ఇది కేవలం ఐచ్ఛికం మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిడా వెల్లడంచారు. గురువారం కటక్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఈ విషయాన్ని ప్రకటించారు. రుతు క్రమంలోని మొదటి రోజుగానీ, రెండో రోజుగానీ ఈ సెలవు తీసుకోవచ్చని తెలిపారు.

మణిపూర్‌ను సందర్శించండి

» ప్రధానికి మరోసారి విజ్ఞప్తి చేసిన రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: అల్లర్లతో అతలాకుతలమవుతున్న మణిపూర్‌ను సందర్శించాలని ప్రధాని మోదీకి విపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఢిల్లీలో నివసిస్తున్న మణిపూర్ రాష్ట్ర వాసులు కొందరు గురువారం రాహుల్‌తో భేటీ అయ్యారు. ఘర్షణల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. కుటుంబ సభ్యులకు దూరమై శారీరకంగా, మానసికంగా పడుతున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సమావేశం వివరాలను రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా వెల్లడించారు. భద్రత లేదన్న కారణంతో ఫొటోలు తీసుకోవడానికి కూడా భయపడుతున్నారని తెలిపారు. నిరంతరం వారు భయంతో బతుకుతున్నారని, ఈ వాస్తవాన్ని గమనించాల్సి ఉందని కోరారు. అందరూ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్న సమయంలో మణిపూర్‌వాసులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఇప్పటికైనా మణిపూర్‌ను సందర్శించి సమస్యను పరిష్కరించాలని ప్రధానిని కోరారు.

పాలస్తీనా జెండా ఆవిష్కరణకు యత్నం

» అడ్డుకున్న తుమకూరు పోలీసులు



పాలస్తీనా జెండాతో యువకులు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కుణిగల్ పట్టణంలో జాతీయ జెండాకు బదులుగా పాలస్తీనా జెండాను ఆవిష్కరించేందుకు అల్లరి మూకలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కుణిగల్ జేకేబీఎంఎస్ పాఠశాల మైదానంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు సాగుతున్న సందర్భంలోనే పాలస్తీనా జెండాతో కొందరు యువకులు అక్కడికి చేరుకున్నారు. స్థానికులు గమనించి పాలస్తీనా జెండాను ఎలా ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. దీంతో యువకులు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అంతలో బజరంగదళ్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని వారిని తరిమివేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చేసరికే దుండగులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై కుణిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జెండాతో వచ్చిన యువకుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫొటోలు, వీడియోల ఆధారంగా అందరినీ గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

'చెత్తతో సంపద'పై సర్కార్ దృష్టి



» గ్రామాల్లో ఆదాయవనరుల పెంపునకు ప్రణాళికలు

» డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కార్యాచరణ

» 10వేల ఘన వ్యర్థాల షెడ్లు వినియోగంలోకి

» తడి, పొడి చెత్త వేరుచేసి వర్మీకంపోస్టు తయారీ

» వర్మీకి రైతులే వినియోగదారులు

» స్వయం సమృద్ధి దిశగా పంచాయతీలు!

» ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో చెత్తను సంపదగా మార్చాలి.. పంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా మళ్లించాలి.. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిరోజూ చెత్త సేకరణ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతోపాటు ఆ చెత్తను ప్రాసెస్ చేయడం ద్వారా పంచాయతీలను ఆర్థికంగా పరిపుష్టి చేయాలి.. ఆయా సర్పంచులు నిధుల కోసం ప్రభుత్వాన్ని యాచించే పరిస్థితి రాకూడా చూడాలి.. ఇదీ కూటమి ప్రభుత్వ మహత్తర లక్ష్యం!.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈమేరకు పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే పిఠాపురంలో తగిన కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఈ దిశగా ప్రభుత్వ చర్యలు ఫలిస్తే పంచాయతీలు స్వయం సమృద్ధి దిశగా దూసుకుపోతుందనడంలో ఏ మాత్రం సందేహంలేదు! గతంలో ఈ ప్రయోగాలు విఫలమైనా... సెలబ్రిటీ అయిన పవన్ కల్యాణ్ పిలుపుతో గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ ఉద్యమంలా ఈ పథకం సఫలీకృతమవుతుందని భావిస్తున్నారు.

పర్యావరణపై పరిరక్షణపై విపరీతమైన ఆసక్తి ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. చెత్తతో సంపద అంశానికి ఆకర్షితుడయ్యారు. తమిళనాడుకు చెందిన నిపుణుడు శ్రీనివాసన్‌ను మళ్లీ చెత్తతో సంపద తయారీకి సంబంధించి కన్సల్టెంట్‌గా నియమించి గ్రామ పంచాయతీల్లో ఈ ప్రయోగాన్ని మళ్లీ మరోసారి అమలు చేయాలని భావించారు. ఇందులో భాగంగా ముందుగా ఆయన తన నియోజకవర్గం పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించారు. చెత్త సేకరణ ద్వారా పరిసరాలు శుభ్రంగా ఉంచడమే కాకుండా పంచాయతీలకు ఆదాయ వనరుగా మార్చడం వల్ల గ్రామసీమల ముఖచిత్రమే మార్చవచ్చన్న యోచనలో ఉన్నారు. ఇక ఈ ప్రాజెక్టు సక్సెస్‌కు సమర్థుడైన అధికారి కోసం అన్వేషించారు. కేరళలో పనిచేసే తెలుగు ఐఏఎస్ కృష్ణతేజను ఏరికోరి పంచాయతీరాజ్ కమిషనర్‌గా తెచ్చుకున్నారు. ప్రస్తుతం కృష్ణతేజ కేరళలో పంచాయతీలు బలోపేతం కావడానికి, మన రాష్ట్రంలో బలహీనంగా ఉండటానికి కారణాలను అధ్యయనం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్తను అంత తేలికగా తీసుకోరాదని, దాని సంపదగా మలుచుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాలు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటాయని చెప్తున్నారు. స్వచ్ఛభారత్ పుణ్యమా అని గ్రామాల్లో ఇప్పటికే గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లు నిర్మించారు. రాష్ట్ర వ్యాప్తగా సుమారు 10 వేలకు పైగా షెడ్లు ఉన్నాయి. గ్రామ సచివాలయాల ద్వారా సచివాలయ కార్యదర్శులను నియమించి ఉన్నారు. అన్నీ ఉన్నా.. సరైన ప్రణాళికలతో పనిచేయకపోవడం వల్ల గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు.

అన్ని వర్గాల అభిప్రాయాలతో...

పవన్ కల్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల నుంచి అన్ని వర్గాలతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి గ్రామాభివృద్ధికి ఏయే చర్యలు తీసుకోవాలో వారి నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నారు. వారి సమస్యలను ప్రతి ఒక్కటీ నోట్ చేసుకుని ఏం చేస్తే గ్రామీణులకు మేలు చేయగలమో యోచించి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు జరుపుకోవాలంటే రూ.100లు, రూ.200ల కంటే ఎక్కువగా ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది కాదు. సర్పంచ్‌లతో సమావేశమైన తర్వాత ఈ విషయాలు తెలుసుకున్న వెంటనే ఆ మేరకు నిర్ణయం తీసుకోగలిగారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి అన్ని విభాగాల ఉద్యోగులతో కూడా సమావేశమవుతున్నారు. వారి సాధకబాధకలు అడిగి తెలుసుకుంటున్నారు. ఏం చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలను కూడా స్వీకరిస్తున్నారు. సర్పంచ్‌లతో మాట్లాడటం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వీర్యంగా ఉన్న ఘన వ్యర్థాల షెడ్ల ప్రస్తావన వచ్చింది. వాటిని వినియోగంలోకి పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న సుమారు 10 వేల ఘన వ్యర్థాల షెడ్‌లను వినియోగంలోకి తెచ్చి వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా చెత్త సమస్య లేకుండా పోవడమే కాకుండా పంచాయతీలకు ఆదాయం గడించేలా చేయవచ్చని భావిస్తున్నారు.

డేటా సేకరణతో శ్రీకారం

ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా కనిపిస్తుండటం, చెత్త ఎక్కడ పడితే అక్కడే పడేయడం వల్ల గ్రామాల్లో ఏయే జబ్బులు వస్తున్నాయో? డేటా సేకరించి ఆ మేరకు అప్రమత్తం చేయనున్నారు. ఈ ప్రక్రియ ప్రారంభించే ముందుగా సర్వే నిర్వహించనున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి ఎవరింట్లో ఎంత చెత్త వస్తుంది, ఆయా గ్రామాల్లో మొత్తం ఎంత చెత్త వస్తుంది?, ఆయా చెత్తలను వేరుచేయడం ద్వారా ఘన వ్యర్థాలకు సంబంధించిన చెత్త ఏ మేరకు వస్తుందనే దానిపై డేటా సేకరిస్తారు. అందుకు అనుగుణంగా చెత్త సేకరణ చేపట్టి ఘన వ్యర్థాల షెడ్లలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. తయరైన వర్మీ కంపోస్టు ఎలా మార్కెట్ చేయాలనేదానిపైనా కసరత్తు చేస్తారు.

తడి, పొడి చెత్తలు వేరుచేసి వర్మీ తయారీ

గ్రామాల్లో తడిచెత్త రకాలుగా పశువుల పేడ, మిగిలిన అన్నంకూరలు, మిగిలిన పోయిన మాంస పదార్థాలు, అన్నం తిన్న తర్వాత మిగిలిన వ్యర్థాలు, పువ్వులు, కొబ్బరిపీచులు, కూరగాయల తొక్కలు, పనికిరాని చీపుర్లు, కాచిన టీ, కాఫీ పొడి, వంటగదిలో ఉత్పత్తయ్యే వ్యర్థ పదార్థాలు, పెరటి నుంచి, పంట నుంచి వచ్చే ఆకులు, మొక్కలు, పండ్లతొక్కలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి, అన్ని రకాల చనిపోయిన చిన్న కీటకాలు, పురుగులుగా గుర్తిస్తున్నారు. పొడి చెత్తగా చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సంచులు, కవర్లు, గాజుసీసాలు, పనికిరాని గుడ్డముక్కలు, చెప్పులు, బ్యాగులు, వాటర్, కూల్ డ్రింక్స్ బాటిల్స్, సబ్బు, షాంపూ, గుట్కా, బిస్కెట్, పాల కవర్లు, పాడైన బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వస్తువులు, పనికిరాని నోటు పుస్తకాలు, అట్టలు, అట్టపెట్టెలు, థర్మాకోల్ వస్తువులు, బల్బులు, ట్యూబులు, ట్యాబ్లెట్ కవర్లు, టూత్‌పేస్ట్, పౌడర్, ఆయిల్ డబ్బాలు, ఇనుప, స్టీలు వస్తువులు, కోడిగుడ్డు పెంకులు, వెంట్రుకలు, ఎముకలు, అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను గుర్తించారు. ఈ విధంగా వేరుచేసిన తడి చెత్తను వానపాముల సాయంతో వర్మీ కంపోస్టు తయారుచేస్తారు.

కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు...

ఇప్పటికే పిఠాపురం పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన పంచాయతీరాజ్‌శాఖ ఘన వ్యర్థాల షెడ్ల వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు రూపొందిస్తోంది. పంచాయతీరాజ్‌శాఖలోని అన్ని విభాగాలను అప్రమత్తం చేసి దీనిని ఒక ఉద్యమంలా చేపట్టాలని నిర్ణయించారు. గ్రీన్ అంబాసిడర్లను ఉపయోగించుకుని వారికి ప్రతి నెలా జీతం అందేలా చేయనున్నారు. గ్రామాల్లో ఈ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన తీసుకురావాలని భావిస్తున్నారు. గ్రామాల్లో స్వయం సహాయ సంఘాలను కూడా వాటి కోసం వినియోగించుకోవడంతో పాటు గ్రామాల్లో అన్ని సంఘాల సహకారం తీసుకోవాలని భావిస్తున్నారు.

అసోంలో బాంబుల కలకలం

» 24 చోట్ల బాంబులు అమర్చినట్టు ఉల్ఫా (ఐ) ప్రకటన

» సాంకేతిక వైఫల్యంతో పేలనివైనం

గువాహతి, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అసోంవ్యాప్తంగా వరుస బాంబు పేలుళ్లకు నిషేధిత ఉగ్రవాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోమ్ (ఇండిపెండెంట్) చేసిన ప్రయత్నం ఫలించలేదు. 24 చోట్ల బాంబులను అమర్చినట్లు ఉల్ఫా (ఐ) గురువారం చేసిన ప్రకటన కలకలం రేపింది. అయితే సాంకేతిక వైఫల్యం కారణంగా ఈ బాంబులు పేలలేదని మీడియా సంస్థలకు ఈమెయిల్ ద్వారా సమాచారమిచ్చింది. గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ బాంబుపేలుళ్లు జరగాల్సి ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రణాళిక అమల్లో విఫలమైనట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేయడంలో ప్రజలు సహకరించాలని కోరింది. 19 బాంబులను అమర్చిన ప్రదేశాల చిత్రాలను వెల్లడించిన ఉల్ఫా.మిగతా ఐదు ప్రదేశాల వివరాలను మాత్రం తెలియజేయలేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రసంగం పూర్తయిన నిమిషాల్లోనే ఈమెయిల్‌ను ఉల్ఫా పంపింది. బాంబులు అమర్చినట్టు ప్రకటించడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఆ ప్రదేశాల్లో తనిఖీల కోసం బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్స్, ఆర్మీ సహా ఇతర కేంద్ర భద్రతా బలగాలను పంపారు. ఎనిమిది ప్రదేశాల్లో బాంబులాంటి పదార్థాలను వెలికితీసినట్టు అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా హైఅలర్ట్‌ను ప్రకటించారు. అయితే బాంబులు ఏర్పాటు చేసినట్టు ఉల్ఫా (ఐ)నే స్వయంగా సమాచారమిచ్చే వరకు ఇంటెలిజెన్స్ విభాగానికి ఎలాంటి ఉప్పందకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

జెండా ఎగురవేసి... గుండెపోటుతో కుప్పకూలి

» తెలంగాణలో వైద్య విద్యార్థి మృతి

» నల్లగొండ జిల్లా దేవరకొండలో విషాదం

దేవరకొండ, ఆగస్టు 15: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇంటిపై జెండా ఎగురవేసిన ఓ వైద్య విద్యార్థి ఐదు నిమిషాల్లోనే గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటిదాకా తమతో ఉన్న కుమారుడు కళ్లముందే మరణించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో బుధవారం జరిగింది. దేవరకొండకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నక్క వెంకటేశ్, సత్తెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నక్క అఖిలేశ్‌యాదవ్(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల కిందట అఖిలేశ్ ఇంటికి వచ్చాడు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం తమ ఇంటిపై తండ్రితో కలిసి జాతీయ జెండాను ఎగురవేశాడు. ఐదు నిమిషాల అనంతరం గుండెలో నొప్పి వస్తోందని తండ్రికి చెప్పాడు. వెంటనే అఖిలేశ్‌ను ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. అఖిలేశ్ మృతదేహానికి గురువారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.



విధానసౌధ ఎదుట దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

తల్లిని పోలీసులు తిట్టారని... విధానసౌధ ఎదుట వాహనానికి నిప్పు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరు విధానసౌధ ముందుకు ద్విచక్రవాహనంతో బుధవారం వచ్చిన ఓ యువకుడు.. ఒక్కసారిగా తన వాహనానికి నిప్పుపెట్టాడు. చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరకు చెందిన పృథ్వీరాజ్ ట్రెక్కింగ్ వెళుతుంటాడు. ఇటీవల ట్రెక్కింగ్‌కు వెళ్లిన సందర్భంలో తప్పిపోవడంతో అతడి తల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించకపోగా, తనను తీవ్రంగా దూషించినట్టు ట్రెక్కింగ్ నుంచి వచ్చిన పృథ్వీకి తల్లి చెప్పారు. దీంతో మొబైల్ వీడియో చేసుకుంటూనే తల్లిని వెంటబెట్టుకుని పృథ్వీ పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. తాను కనిపించలేదని తన తల్లి ఫిర్యాదు చేస్తే ఎందుకు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించాడు. దీంతో పోలీసులు ఆగ్రహంతో మొబైల్ లాక్కొని కూర్చోబెట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఆ తర్వాత సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. అనంతరం పలు వీడియోలను పృథ్వీ పోస్టు చేశాడు. తన తల్లిని అవమానించి పోలీసులు దూషించారని, తనకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఉగ్రవాదిని అవుతాననని ఓ వీడియోలో చెప్పుకున్నాడు. తాను ఎలక్ట్రికల్ ఇంజనీర్‌నని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, మెట్రోలో 9 ఏళ్ల పనిచేశానని, బాంబులతో పేల్చివేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మరో వీడియోలో విధానసౌధను పేల్చివేస్తానని చెప్పుకున్నాడు. ఇంతలోనే బుధవారం ఒక్కసారిగా విధానసౌధ ముందుకు వచ్చి ద్విచక్రవాహనానికి నిప్పుపెట్టాడు. కాసేపటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. విధానసౌధ పోలీసులు రంగంలోకి దిగి పృథ్వీని అదుపులోకి తీసుకున్నారు.

గగన తలంలో రెండు 'రఫేల్' యుద్ధ విమానాల ఢీ

» ఫ్రాన్స్‌లో ఘటన.. ఇద్దరి గల్లంతు

కొలంబే లెస్ బెల్లీస్ (ఫ్రాన్స్), ఆగస్టు 15: ఫ్రాన్స్ గగన తలంలో రెండు రఫేల్ సూపర్ సోనిక్ యుద్ధ విమానాలు ఢీకొన్నాయి. అరుదైన ఈ దుర్ఘటనలో ఇద్దరు గల్లంతయ్యారు. ఈశాన్య ఫ్రాన్స్‌లోని కొలంబే లెస్ బెల్లీస్ పట్టణం వద్ద బుధవారం ఈ సంఘటన జరిగింది. ఆ రెండు విమానాలు సెయింట్ డిజియర్ ఎయిర్ బేస్ నుంచి బయలుదేరాయి. ప్రమాదం జరిగిన అనంతరం ఒక విమానం పైలట్ సురక్షితంగా బయటపడగా, మరో విమానంలోని శిక్షకుడు, విద్యార్థి గల్లంతయ్యారు. వారి కోసం గాలిస్తున్నట్టు రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకోర్ను తెలిపారు. ఈ ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదు.

పరువు పోతోంది

» వారి తప్పులు.. వీరికి తిప్పలు

» జగన్ హయాంలో కేంద్ర స్కీమ్‌ల్లో గోల్‌మాల్‌పై 'కూటమి' అధికారులను నిలదీస్తున్న కేంద్రం

» ఆయా శాఖలకు కొత్త కావడంతో ఇబ్బంది

» 'ఉపాధి'లో దొంగ మస్టర్ల నుంచి, జలజీవన్ మిషన్, పంచాయతీలకు నిధులవరకు ప్రశ్నల పరంపర

» ఢిల్లీలో జరిగే సమీక్షల్లో ఏది అడిగినా మౌనమే..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఢిల్లీలో రాష్ట్రం పరువు పోతోంది. రాష్ట్రంలో కేంద్ర పథకాల అమలులో ఆయా శాఖలకు చెందిన అప్పటి రాష్ట్ర అధికారులు వ్యవహరించిన తీరు ఇప్పుడు కొత్త అధికారులకు ఇబ్బందిగా మారింది. అప్పట్లో జగన్ చెప్పినట్లు చేసిన ఐఏఎస్ అధికారులు ఇప్పుడు ఆ శాఖల నుంచి మారిపోయారు. కొత్తగా వచ్చిన అధికారులకు ఆయా శాఖల్లో గత ఐదేళ్లలో జరిగిన నిర్వాకాలు తెలియవు. దీంతో ఢిల్లీలో అధికారులు వేసే ప్రశ్నలకు వారంతా కంగుతింటున్నారు. కొంతమంది అధికారులైతే సమీక్ష సమావేశమంతా మౌనంగా కూర్చొని వింటున్నారే తప్ప ఒక్కప్రశ్నకు కూడా సమధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని శాఖలకు సంబంధించి అయితే, రాష్ట్ర అధికారులు గత ఐదేరళ్లు ఢిల్లీ సమావేశాలకు డుమ్మా కొట్టారు. వారి స్థానాల్లోకి కొత్తగా వచ్చిన అధికారులకు ఇప్పుడు ఢిల్లీలో నెగ్గుకురావడం ఇబ్బందికరంగా మారింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు, గిరిజన సంక్షేమశాఖ, సామాజిక న్యాయం, సాధికారత, తాగునీటి సరఫరా మంత్రిత్వ శాఖల్లో ఇప్పుడిదే పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు.. గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి ఇటీవల ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన పాలనా ప్రక్షాళనలో భాగంగా ఈ శాఖలో అనేక మార్పులు చేపట్టారు. కొత్త అధికారులను ఇక్కడ నియమించారు. 'మీ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారు' అంటూ కేంద్ర అధికారులు నిలదీశారు. దీంతో ఏం సమాధానాలు చెప్పాలో వారికి అర్థం కాలేదు. అప్పట్లో మన రాష్ట్రానికి చెందిన ఉపాధి అధికారి కొన్ని జిల్లాల్లో మెటీరియల్ కాంపోనెంట్ పనులు విపరీతంగా మంజూరుచేశారని కేంద్ర అధికారులు ఆక్షేపించారు. కొన్ని జిల్లాల్లో లేబర్ కాంపోనెంట్‌కు అనుగుణంగా కాకుండా అధికంగా ఆ అధికారి పనులు చేయించారని తప్పుబట్టారు. ఇలా.. సమీక్ష సమావేశం జరిగినంతసేపు కేంద్ర అధికారులు ప్రశ్నలు వేస్తూనే ఉండగా, ఎలా స్పందించాలో తెలియక మన అధికారులు ఇబ్బంది పడ్డారు. నిజానికి, ఉపాధి హామీ పథకంలో ఒకప్పుడు మన రాష్ట్రం ఒక వెలుగు వెలిగింది. ఏ వినూత్న కార్యక్రమాలను ఈ పథకం కింద చేపట్టినా అవి ఏపీలోనే ప్రారంభమయ్యేవి. మన రాష్ట్రంలోనే మొదట ఉపాధి హామీ పథకానికి సంబంధించి సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేశారు. అనంతరం దీని ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సొంత సాంకేతిక వ్యవస్థను ఏర్పాటుచేసింది. అప్పట్లో మన రాష్ట్ర అధికారులకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో పరపతి, పలుకుబడి ఉండేవి. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత అవన్నీ తెరమరుగయ్యాయి. కూలీలతో పనులు చేయించకుండా దొంగ మస్టర్లు వేయించి అధిక వేతనాలు డ్రా చేయడం, అనుమతి లేని జగనన్న లేఅవుట్ల చదును పనులు, సచివాలయ భవనాల నిర్మాణాల పనులు చేపట్టడంవంటి చిల్లర పనులతో కేంద్రం ఎదుట రాష్ట్రం ప్రతిష్ఠను దిగజార్చింది.

ఇదేం జంఝాటం?

గత జగన్ ప్రభుత్వం నిర్వాకంతో 'జల్‌జీవన్ మిషన్' కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కేంద్రం ఇచ్చిన నిధులను వేరే అవసరాలకు వాడుకోవడం, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులివ్వకపోవడం, రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్‌మిషన్ అధికారులుగా పనిచేస్తున్న వారు ఇటీవల ఢిల్లీకి వెళ్లారు. ఈ పథకం అమలు అస్తవ్యస్తంగా ఉన్నదంటూ కేంద్ర అధికారులు నిలదీస్తుంటే, మన అధికారులకు తలలు పట్టుకుని కూర్చున్నారు.

యూసీలేవీ.. ఆ నిధులు వాడలేదేం?

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఆ శాఖ అధికారులు గతంలో కేంద్ర అధికారుల ముందు తలెత్తుకోలేని పరిస్థితి ఉండేది. కొత్తగా వచ్చిన అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిందని, ఇక నుంచి అలా జరగదని కేంద్ర అధికారులను ఒప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇక కేంద్ర గిరిజన శాఖ ఇచ్చిన నిధులకు యూసీలు కూడా సమర్పించని పరిస్థితి! ఈ కారణంగా పలు దఫాలు నిధులు ఆగిపోయాయి. మనఅధికారులు ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర అధికారులు యూసీల ప్రస్తావన తెస్తుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి! మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖల్లో కేంద్రం అప్పట్లో అమృత్ మిషన్ ద్వారా ఇచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. దీనిపైనా ఢిల్లీలో కురుస్తున్న ప్రశ్నలవర్షంతో మన అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

రాహుల్‌కు ఐదో వరుసలో సీటు



» వేడుకల్లో ప్రతిపక్ష నేతను గౌరవించరా?: కాంగ్రెస్ ఆక్షేపణ

» ఒలింపిక్స్ విజేతలకు మొదటి వరుస కేటాయించినందునే: రక్షణశాఖ వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 15: స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రధాని మోదీకి గౌరవం లేదని దీన్నిబట్టి అర్థమవుతుందని కాంగ్రెస్ మండిపడింది. కుచించుకుపోయిన మనస్తత్వం కలిగిన వ్యక్తుల నుంచి పెద్ద పెద్ద విషయాలను ఆశించడం వృథా అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతకు కేబినెట్ మంత్రి హోదా ఉంటుందని ఆ స్థానంలో ఉన్నవారికి మొదటి వరుసలో సీటు కేటాయించాలని, రాహుల్ ఒక్కరికే కాదని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కూడా ఐదో వరుసలోనే సీటు కేటాయించారని సుప్రియా మండిపడ్డారు. ఇక, పారిస్ ఒలింపిక్స్ పతాక విజేతలను గౌరవించుకోవడం కోసమే వారికి మొదటి వరుసలో సీట్లు కేటాయించామంటూ రక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటన అర్థం లేనిదని ఆమె ధ్వజమెత్తారు. అలాంటప్పుడు కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, జైశంకర్, నిర్మలా సీతారామన్‌లకు మొదటి వరుసలో సీట్లు ఎలా కేటాయించారని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు.

పదేళ్ల తర్వాత వేడుకలకు విపక్ష నేత!

దశాబ్దం తర్వాత ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. పదేళ్లుగా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎవరికీ ఇవ్వని విషయం తెలిసిందే. ఇక, రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించారన్న విమర్శల నేపథ్యంలో రెండో వరుసలో రాహుల్ కూర్చున్న వీడియోలు బయటకు వచ్చాయి.

రాష్ట్రపతి ప్రసంగంలో నెహ్రూ పేరు లేదేం?

ఇక, స్వేచ్ఛ అనేది ఒక పదం మాత్రమే కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన అతిపెద్ద రక్షణ కవచమని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశంలో రాహుల్ పేర్కొన్నారు. ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న రాహుల్ ఆ తర్వాత ఏఐసీసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఇక, రాష్ట్రపతి ప్రసంగంలో మాజీ ప్రధాని నెహ్రూ పేరు కూడా ప్రస్తావించకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. చరిత్ర నుంచి దేశ మొదటి ప్రధాని పేరును చెరిపేయడమే లక్ష్యంగా సాగుతున్న కార్యక్రమంలో భాగమే ఇదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 16 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

టీజీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్

తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

అర్హత

విద్యార్థులు ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హై స్కూల్స్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, గవర్నమెంట్ ఆశ్రమ్ హై స్కూల్స్, కస్తూర్బా రెసిడెన్షియల్ స్కూల్స్, రెసిడెన్షియల్ మోడల్ స్కూల్స్ జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, సైనిక్ స్కూల్స్ ఇతర రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.



రాత పరీక్ష వివరాలు

ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్

రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ కాపీని పాఠశాలలో సబ్మిట్ చేసేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్‌కు దరఖాస్తులు చేరాల్సిన తేదీ:** సెప్టెంబరు 18
- **రాత పరీక్ష తేదీ:** నవంబరు 24
- **వెబ్‌సైట్:** http//bse.telangana.gov.in

ఎన్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్' పోటీ



న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్&ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్(డీఈఎస్ఎం)- 'ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్(ప్రయాస్) 2024 స్కీమ్' గైడ్‌లైన్స్ విడుదల చేసింది. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మేథమెటిక్స్ విభాగాల్లో ఆసక్తిని కలిగించి పరిశోధనల దిశగా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పరీక్షించి వారి సృజనాత్మకతను పెంపొందించేలా పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయంగా పరిశోధనలు చేయాలి. ఇందుకు తమ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.

తమ పరిశోధనల వివరాలతో ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను సంస్థ ఈ మెయిల్‌కు పంపాలి. ప్రాజెక్ట్ వర్క్ వ్యవధి ఏడాది. అవసరం మేరకు మరో ఆర్నెల్లు పొడిగించే వీలుంది. నిబంధనల ప్రకారం పూర్తిచేసిన ప్రాజెక్ట్ పరిశోధన పత్రాలను ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

అర్హత

తొమ్మిది నుంచి పదకొండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు నాటికి విద్యార్థుల వయసు 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు విద్యార్థుల గ్రూప్ తమ టీచర్, హెచ్ఈఐ సహకారంతో రీసెర్చ్ చేయవచ్చు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సైన్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

ప్రాజెక్ట్ వివరాలు

దరఖాస్తు ద్వారా వచ్చిన ప్రాజెక్ట్ ప్రపోజల్స్‌ను పరిశీలించి స్క్రీనింగ్ చేస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ ఒరిజినాలిటీకి 20 శాతం, సైంటిఫిక్ థాట్‌కు 10 శాతం, సైంటిఫిక్ మెథడాలజీకి 10 శాతం, జనరేషన్ ఆఫ్ సైంటిఫిక్ నాలెడ్జ్‌కి 20 శాతం, ఎన్విరాన్‌మెంటల్ ఎఫిషియెన్సీకి 20 శాతం, ప్రాజెక్ట్ ప్రపోజల్ క్లారిటీ-రైటప్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ ప్రాజెక్ట్ ప్రపోజల్స్‌ను షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సంబంధిత విద్యార్థులు, టీచర్/మెంటార్‌ను ప్రజంటేషన్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. జ్యూరీ ఎదుట అయిదు నుంచి ఏడు నిమిషాలు తమ ప్రాజెక్ట్‌ను పీపీటీలు, చార్ట్‌లు, ఓరల్ డిస్కషన్, అసెస్‌మెంట్ ద్వారా ప్రజంట్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలు పూర్తయిన వెంటనే ఎంపిక చేసిన 15 ప్రాజెక్ట్ ప్రపోజల్స్ వివరాలు ప్రకటిస్తారు.

ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లకు సంస్థ రీసెర్చ్ గ్రాంట్ కింద రూ.50,000 అందిస్తుంది. ఇందులో విద్యార్థులకు రూ.10,000(ఒక్కొక్కరికి రూ.5,000); పీజీటీ, హెచ్ఈఐలకు ఒక్కొక్కరికి రూ.20,000 ఇస్తారు. ఈ మొత్తాన్ని స్టేషనరీ, బుక్స్, ట్రావెలింగ్, డేటా కలెక్షన్, కెమికల్ ప్రయోగాలు, ల్యాబొరేటరీ, సైన్స్ కిట్, పరిశోధన సంబంధిత అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. వారానికి అయిదు నుంచి ఏడు గంటలు ప్రాజెక్ట్ వర్క్ చేయాలి.

ప్రాజెక్ట్ వర్క్ ప్రారంభమైన నాలుగు నెలల తరవాత టీచర్ సహకారంతో విద్యార్థులు నిర్దేశిత ఫార్మాట్‌లో ప్రోగ్రెస్ రిపోర్ట్ సబ్మిట్ చేయాలి. ఇందులో టేబుల్స్, ఫిగర్స్‌తో కూడిన వివరణ ఉండాలి.

ప్రాజెక్ట్ వర్క్ పూర్తికావడానికి 15 రోజుల ముందు ఫైనల్ టెక్నికల్ రిపోర్ట్ సబ్మిట్ చేయాలి.

ప్రాజెక్ట్ వర్క్‌ల వివరాలు; సంబంధిత ప్రయాస్ విద్యార్థులు, టీచర్లు, హెచ్ఈఐ వివరాలను ప్రయాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రయాస్ విద్యార్థుల పరిశోధన పత్రాలను రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శన(ఆర్‌బీవీపీ)లో ప్రజంట్ చేస్తారు. వీటిని స్టాండర్డ్ జర్నల్స్‌లో కూడా ప్రచురిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 25
- **దరఖాస్తుల స్క్రీనింగ్:** ఆగస్టు 31
- **ప్రాజెక్ట్ ప్రపోజల్ సెలెక్షన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **జ్యూరీ ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌ల సమాచారం:** సెప్టెంబరు 10న
- **ప్రాజెక్ట్ రీసెర్చ్ వర్క్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసేందుకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 14
- **ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్:** 2025 సెప్టెంబరు 20
- **ఈ మెయిల్ ఐడీ:** prayaas-ncert@gmail.com
- **వెబ్‌సైట్:** ncert.nic.in

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ఏఎన్ఎం ట్రెయినింగ్



అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15న
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

లిటిల్స్




నగరం- హాంకాంగ్

- దక్షిణ చైనాలో ఉండే నగరమిది. ప్రపంచంలోనే పాపులర్ సిటీ 'హాంకాంగ్'. యాత్రికులకు స్వర్గధామం. షాపింగ్‌కు ఫేమస్. టూరిస్టుల కోసమే తయారు చేసిన నగరమిది. ఇంగ్లీషు ఎక్కువగా మాట్లాడతారు. చైనా ప్రత్యేక పాలనా ప్రదేశమిది.
- హాంకాంగ్ అంటే చీనీ భాషలో 'ఫ్రాగ్రంట్ హార్బర్' అని అర్థం. ఓడరేవులతో పాటు అందమైన, ఎత్తైన కట్టడాలకు ప్రసిద్ధి ఈ నగరం. వాస్తవానికి ఇది 263 దీవుల సముదాయమిది. ఇక్కడి శుభ్రమైన పరిసరాలు, అందమైన బీచ్‌లు ఆహ్లాదకరం. ఆసియాలోని ఖరీదైన నగరాల్లో ఇదే ప్రథమం. సింగపూర్‌ను మించి యాత్రికుల సందడి హాంకాంగ్‌కు ఉంటుంది.




- ప్రపంచంలోనే అతి పొడవైన ఎస్కలేటర్ ఇక్కడ ఉంది. మిడ్ లెవల్ ఎస్కలేటర్స్ కనీసం అరకిలోమీటర్ ఉంటాయి.
- డబ్బును అధికంగా సంపాదించాలనే కోరిక ఉండే వాళ్లలో హాంకాంగ్ ప్రజలు ఒకరు. 2020 గ్లోబల్ బిలియనీర్ లిస్ట్ చూస్తే అందులో హాంకాంగ్ ర్యాంక్ 7 వ స్థానం.
- 7.5 మిలియన్ల జనాభా ఉండే ఈ నగరంలో 95 శాతం చైనీయులే ఉంటారు. ఇక్కడి ప్రజలు ఎగ్‌టార్ట్స్, పైనాపిల్ బన్స్ ఇష్టంగా తింటారు. 20 సాకర్ గ్రౌండ్స్ అంత హాంకాంగ్‌లో విమానాశ్రయం ఉంది.
- చైనా, ఇంగ్లీష్ అధికారిక భాషలు. ఈ దేశాన్ని 'వన్ కంట్రీ.. టూ సిస్టమ్స్' అని పిలుస్తారు.
- హాంకాంగ్ ప్రాంతాన్ని గతంలో జపాన్‌తో పాటు పోర్చుగీసు, బ్రిటన్ కూడా పాలించింది. ఇపుడు చైనా అదుపాజ్ఞల్లో ఉంది. విచిత్రమేంటంటే.. ఇక్కడి పాత బ్రిటీష్ కాలనీల్లో ఉండే వాళ్లు దాదాపు ఇంటికొకరు రోల్స్ రాయ్స్ కారును వాడతారు. అలా ప్రపంచంలోనే అత్యధిక రోల్స్ రాయ్స్ కార్లు ఇక్కడే ఉన్నవి.
- ప్రపంచంలోనే అత్యధిక (సుమారు 9000) స్కై స్క్రాపర్స్ ఇక్కడే ఉన్నాయి.
- 40 శాతం పార్కులు, నేషనల్ రిజర్వ్ ఇక్కడ ఉన్నాయి. చైనాలో ఫోర్ అనే శబ్దానికి అర్థం 'డెత్'. అందుకే నాలుగో ఫ్లోర్ ఉండదు. లిఫ్ట్‌లో నాలుగు అంకె కనిపించదు.



దారి కనుక్కోండి

6 తేడాలు గుర్తించండి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 385

		7		3		1		
	2	3			8		4	5
							6	3
	8							7
			8		1			
5							2	
9	5							
3	4		9			6	1	
		2		6		9		

సుడోకు - 384 సమాధానం

3	7	5	1	4	6	2	9	8
4	8	6	9	3	2	7	5	1
9	1	2	7	8	5	6	4	3
8	2	4	6	7	3	9	1	5
7	6	3	5	9	1	4	8	2
5	9	1	8	2	4	3	6	7
1	5	9	2	6	7	8	3	4
6	4	7	3	1	8	5	2	9
2	3	8	4	5	9	1	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

SCHOLARSHIP ALERT

Rolls-Royce Wings4Her Scholarship for Women Engineering Students

Description: Rolls-Royce india invites applications from girl students studying in the 1st/2nd/3rd year of an engineering degree program at AICTE-recognised institutions. The scholarship aims to support deserving students who demonstrate academic excellence and financial need.

Eligibility: Girl students enrolled in the 1st/2nd/3rd year of an engineering degree program (in fields like aerospace, marine, electronics, computers, etc.) at AICTE-recognised institutions are eligible.

- The applicants must have scored more than 60% in their Class 10 and 12 board exams.
- Annual family income must not exceed INR 4 lakh per annum.
- Open to pan-India students.

Please Note:

- Female scholars who have previously received the 'Rolls-Royce Wings4Her Scholarship for Women Engineering Students' in 2023 and are currently in their 4th year of engineering degree can also apply.
- Preference will be given to individuals belonging to special categories, such as tahose with physical disabilities, single parents, and orphans.

Prizes & Rewards: INR 35,000.

- Exclusive one-to-one and one-to-many mentorship sessions, webinars/workshops from industry experts at Rolls-Royce India

Last Date to Apply: 05-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/UNSC3

Infosys Foundation STEM Stars Scholarship

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
Last Date to Apply: 15-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS2

Corteva Agriscience Scholarship Program

Description: An initiative of Corteva Agriscience India Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./ M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

- The applicant's annual family income must be 6,00,000 or less.
- Students from across India can apply
- Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:

- For PG students: INR 50,000
- For UG students: INR 25,000
- For school students: INR 10,000

Last Date to Apply: 13-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4

KSB Scholarship and Mentorship

Description: KSB Ltd through Care Charitable Trust invites applications from female students in their first year of a diploma in engineering or any polytechnic course to provide them with financial support for their studies.

Eligibility: Girls studying in the first year of a diploma in engineering or any polytechnic course. Students studying or having domiciles in and around Pune, Nashik, Ahmednagar, Satara, and Coimbatore. Students who have scored more than 60% marks in their previous classes are eligible to apply. Students' family income from all sources should be less than INR 8 lakh per annum. Children of employees of KSB Care Charitable Trust and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of INR 25,000 and mentorship support
Last Date to Apply: 16-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KSBMP1

buddy4study.com